**జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు కావలెను**

WE ARE NOW HIRING JOIN OUR TEAM

మనసర్కార్ దినపత్రిక, డిజిటల్ ఛానల్, న్యూస్ పోర్టల్ కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోని ఉమ్మడి జిల్లాల వారీగా గతంలో ప్రింట్ లేదా ఎలక్ట్రానిక్ మీడియాలో జిల్లా స్థాయిలో పని చేసిన అనుభవం ఉన్న రిపోర్టర్లు కావలెను.

మీ బయోడేటాను ఈ క్రింది మెయిల్ కు పంపగలరు

మనసర్కార్ PRGI REG. No. : TGTEL/25/A0540

Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073

Follow: manasarkar

email: jobs@manasarkar.com



సంక్షేమ

# మనసర్కార్

Follow: manasarkar

సంపుటి: 01 ::: సంచిక:242 | హైదరాబాద్ 04 ఏప్రిల్ 2026, శనివారం | పేజీలు: 8, వెల: రూ. 5/-

Vol-01 ::: Issue-242 | Hyderabad 04 April 2026, Saturday | Pages: 8, Rs. 5/-



**ఇన్సూరెన్స్ అడ్వైజర్స్ కావలెను**




ప్రముఖ ఇన్సూరెన్స్ మార్కెటింగ్ కంపెనీకి లైఫ్, హెల్త్, జనరల్ ఇన్సూరెన్స్ మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్న అడ్వైజర్లు / ఏజెంట్లు కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.

వివరాలకు : 91333 73937, makkfinsol@gmail.com







# భారత్‌కు రష్యా భరోసా

భారీగా చమురు, గ్యాస్ సరఫరాకు సిద్ధం

సరఫరాను మరింత పెంచేందుకు రష్యా కంపెనీలు హామీ

రష్యా ప్రతిపాదన భారత్ ఇంధన భద్రతకు కీలకం

అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా భారత్ మళ్లీ రష్యా వైపు మొగ్గు

పశ్చిమాసియా యుద్ధ మేఘాల మధ్య అంతర్జాతీయ చమురు విపణి అతలాకుతలమవుతున్న వేళ భారత్‌కు రష్యా అండగా నిలిచింది. హర్మూజ్ జలసంధి వద్ద రవాణా ఆటంకాలతో ఇంధన ధరలు మండిపోతున్న తరుణంలో.. దేశీయ అవసరాలకు తగ్గట్టుగా ముడి చమురు, ఎల్ఎన్‌జీ సరఫరాను భారీగా పెంచేందుకు సిద్ధమని మాస్కో ప్రకటించింది. భారత పర్యటనకు వచ్చిన రష్యా ఉప ప్రధాని డెనిస్ మంటురోవ్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహా కీలక మంత్రులతో భేటీ అయి భరోసా కల్పించారు.

...::: పూర్తి కథనం 3వ పేజీలో...

# సముద్ర గర్భంలో... సైలెంట్ కిల్లర్!

భారత నౌకాదళంలోకి 'ఐఎన్ఎస్ తారాగిరి'

స్వదేశీ పరిజ్ఞానానికి పెద్దపీట

జాతికి అంకితం చేసిన రక్షణమంత్రి

బ్రహ్మోస్ క్షిపణులతో భీకర శక్తి




భారత నౌకాదళ అమ్ములపొదిలో మరో శక్తివంతమైన అస్త్రం చేరింది. శత్రువుల రాడార్ల కళ్లుగప్పి మెరుపుదాడులు చేయగల అత్యాధునిక యుద్ధనౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' శుక్రవారం విశాఖ తీరంలో లాంఛనంగా కొలువుదీరింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ యుద్ధనౌకను జాతికి అంకితం చేస్తూ, ఇది భారత సముద్ర రక్షణ కవచాన్ని మరింత పటిష్టం చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'ఆత్మనిర్భర్ భారత్' నినాదానికి ప్రతీకగా, 75 శాతానికి పైగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన ఈ 'స్టెల్త్' ఫ్రిగేట్.. బ్రహ్మోస్ క్షిపణులు, అత్యాధునిక రాడార్ వ్యవస్థలతో సముద్ర జలాల్లో భారత్‌కు తిరుగులేని ఆధిపత్యాన్ని అందించనుంది.

...::: పూర్తి కథనం 2వ పేజీలో...



## అధికారం ఇస్తే... మేమేంటో చూపిస్తాం

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

మనదేశంలో చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా ఉమ్మడి పౌరస్మృతితో అడ్డుకునే వీలుంటుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. అస్సాంలోని గోల్‌పాడాలో శుక్రవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో అమిత్‌షా మాట్లాడారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## దక్షిణాసియా వస్త్ర రాజధానిగా మన తెలంగాణ



**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

హైదరాబాద్‌లో నిర్వహించిన 13వ ఏషియన్ టెక్స్ టైల్స్ కాన్ఫరెన్స్ 2026 వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ భవిష్యత్తుపై ఒక అద్భుతమైన విజన్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. తెలంగాణ అంటే కేవలం ఐటీ, ఫార్మా రంగాలకే పరిమితం కాకుండా, ప్రపంచ వస్త్ర రంగంలో తిరుగులేని శక్తిగా ఎదగాలన్నది ప్రభుత్వ ప్రధాన సంకల్పమని ఆయన స్పష్టం చేశారు.

...::: తరువాయి 2వ పేజీలో...




## నాశనం చేయాలని చూస్తే... శాసనం చేశాం

**అమరావతి (ఏడీఎన్ఎన్):**

అమరావతి రాజధాని చట్టబద్ధత బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ,

...::: తరువాయి 2వ పేజీలో...

## పేదల ఇళ్లు కూల్చేవారు నీతులు చెప్పొచ్చా?



**తిరువనంతపురం (ఏడీఎన్ఎన్) :**

కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కేవలం ఆ రాష్ట్రానికే పరిమితం కాకుండా, తెలంగాణ రాజకీయాల్లోనూ వేడి పుట్టిస్తోంది. యూడీఎఫ్ అభ్యర్థుల తరపున ప్రచారానికి వెళ్లిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేరళ సర్కార్‌పై చేసిన విమర్శలు చిలికి చిలికి గాలివానలా మారాయి.

...::: తరువాయి 2వ పేజీలో...

## ఘర్షణకు దిగితే ఊహించని దాడులే



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలపై పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తీవ్రంగా స్పందించారు. భారత్ తమపై దాడులకు ప్రణాళికలు రచిస్తోందని ఆరోపిస్తూ, ఒకవేళ భారత దేశం ఘర్షణకు దిగితే ఊహించని రీతిలో ప్రాణాంతకమైన సమాధానం ఇస్తామని ఖవాజా హెచ్చరించారు. ఇరాన్, అమెరికా యుద్ధం వల్ల ఏర్పడిన అంతర్జాతీయ అనిశ్చితిని అదునుగా చేసుకుని భారత్ ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే, ఆ ప్రతిస్పందన అత్యంత తీవ్రంగా ఉంటుందని ఖవాజా ఆసిఫ్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన ఆసిఫ్, భారత్ తమను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. తమ రక్షణ వ్యవస్థలు పూర్తి అప్రమత్తంగా ఉన్నాయని, శత్రువుల దాడులను వేగవంతమైన ,ప్రణాళికాబద్ధమైన రీతిలో తిప్పికొడతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత యుద్ధాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భారత్ సంయమనం పాటించాలని, లేనిపక్షంలో దక్షిణ ఆసియాలో భద్రతా పరిస్థితులు పూర్తిగా అదుపు తప్పుతాయని ఆయన హెచ్చరించారు. ఈ పరిణామాలు రెండు దేశాల మధ్య దౌత్యపరమైన అగాధాన్ని పెంచేలా ఉన్నాయి.

## పుదుచ్చేరిలో మోదీపై పూలవర్షం

పుదుచ్చేరిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారీ రోడ్‌షోతో ఎన్డీయే ప్రచార పర్వంలో జోష్ నింపారు. ముఖ్యమంత్రి రంగస్వామి సహా కూటమి నేతలతో కలిసి రెండు కిలోమీటర్ల మేర సాగిన ఈ యాత్రకు ప్రజలు పూలవర్షంతో నీరాజనం పలికారు.




...::: పూర్తి కథనం 2వ పేజీలో...

## భారత్ పై అమెరికా ఫార్మా బాంబు




**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అమెరికా దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన 'అమెరికా ఫస్ట్' నినాదాన్ని ఫార్మా రంగానికి విస్తరిస్తూ ప్రపంచ దేశాలకు భారీ షాక్ ఇచ్చారు. జాతీయ భద్రత, ఔషధ సరఫరాలో స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా విదేశాల నుంచి దిగుమతి అయ్యే పేటెంట్ (బ్రాండెడ్) ఔషధాలపై 100 శాతం వరకు సుంకాలు విధిస్తూ ట్రంప్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయం అంతర్జాతీయ ఔషధ విపణిని కుదిపేయడమే కాకుండా, 'ప్రపంచపు ఫార్మసీ'గా పేరొందిన భారత్‌కు పెను సవాలుగా మారింది. ట్రంప్ ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకోవడానికి బలమైన గణాంకాలు కారణమయ్యాయి. అమెరికాలో వినియోగించే పేటెంట్ మందులలో 53 శాతం దేశం వెలుపలే తయారవుతున్నాయి, కేవలం 15 శాతం యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియెంట్స్ మాత్రమే అమెరికాలో ఉత్పత్తి అవుతున్నాయి.

...::: తరువాయి 2వ పేజీలో...



## 27 మంది అభ్యర్థుల ప్రకటన
# తమిళనాడులో పోటాపోటీగా బీజేపీ, కాంగ్రెస్

**చెన్నై (ఏడీఎన్ఎన్) :**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రకటన నువ్వా? నేనా? అన్న ఛందంగా రెండు జాతీయ పార్టీలు పోటీ పడుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ శుక్రవారం పోటీ చేసే మొత్తం 27 మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. డీఎంకే కూటమిలో భాగంగా కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో పోటీ చేస్తోంది. శ్రీ పెరుంబుదూరు నుంచి పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కె.సెల్వపెరుంతగై మరోసారి పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లోనూ ఆయన శ్రీపెరుంబుదూరు నుంచి పోటీ చేసి ఏఐఏడీఎంకే అభ్యర్థి కె.పళనిపై 11,000 అధిక్యంతో గెలుపొందారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే దురై చంద్రశేఖర్ పొన్నేరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మరోసారి పోటీ చేస్తున్నారు. కృష్ణగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి డాక్టర్ ఎ చెల్ల కుమార్ పోటీలో ఉండగా, వేలచ్చేరి నుంచి జేఎంహెచ్ ఆసాన్ మౌలానా, షోలింగూర్ నుంచి ఏఎం మునిరత్నం, ఉతంగారై అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆర్ కుప్పుస్వామి పోటీ చేస్తున్నారు. బీజేపీ కూడా తన అభ్యర్థులను ప్రకటించింది. 27 మందిని షార్ట్ లిస్ట్ చేస్తూ బీజేపీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ 2026 అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. వీరిలో మైలాపూర్ నియోజకవర్గం నుంచి డాక్టర్ తమిళిసై సౌందరరాజన్‌కు పార్టీ అధిష్ఠానం టికెట్ ఇచ్చింది. కోయంబత్తూరు నార్త్ నుంచి వనతి శ్రీనివాసన్ పోటీ చేయనున్నారు. అవినాశి నుంచి డాక్టర్ ఎల్.మురుగన్‌కు అవకాశం ఇచ్చింది బీజేపీ. తిరుప్పూర్ సౌత్ నియోజకవర్గం నుంచి ఎస్.థంగరాజ్, సత్తూర్ నుంచి నైనార్ నాగేంద్రన్, తిరుచెందూర్ నుంచి కె.ఆర్.ఎం.రాధాకృష్ణన్, విలవంకోడ్ నుంచి విజయధారణి పోటీ చేయనున్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, అన్నాడీఎంకే కలిసి పోటీ చేస్తున్నాయి. ఈ మేరకు పొత్తులో భాగంగా మొత్తం 234 సీట్లకు గానూ అన్నాడీఎంకే బీజేపీకి 27 సీట్లు కేటాయించింది అయితే, తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలైకు సీటు దక్కలేదు. దీంతో ఆయన నిరాశ చెందినట్టు తెలుస్తోంది. తమిళనాడు అసెంబ్లీకి ఏప్రిల్ 23న ఒకే విడతలో పోలింగ్ జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

## యుద్ధ విరమణకు ఐక్యరాజ్యసమితి పిలుపు



...::: పూర్తి కథనం 3వ పేజీలో...

## బీఆర్ నాయుడిని తక్షణమే తొలగించాలి




...::: పూర్తి కథనం 4వ పేజీలో...



## పాత పేరు.. కొత్త అజెండాతో వస్తా...

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ స్థాపనపై శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన ఆమె, 'తెలంగాణ రాష్ట్ర సమితి' అనే పాత పేరు, సరికొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని ప్రకటించారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ నిద్రావస్థలో ఉందని వ్యాఖ్యానించిన ఆమె, తమ పార్టీ ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతాల ప్రాతిపదికన నడుస్తుందని స్పష్టం చేశారు. టీఆర్ఎస్ పేరు ప్రస్తుతం ఖాళీగానే ఉందని, పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం ప్రత్యేక బృందం పనిచేస్తోందని వెల్లడించి రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించారు.తమ పార్టీకి ప్రధాన శత్రువు అధికార కాంగ్రెస్ పార్టీయేనని కవిత కుండబద్దలు కొట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి హరీశ్ రావులను ఉద్దేశించి 'గుంపు మేస్త్రీ, గుంటనక్కలు దోస్తులు' అంటూ పరోక్షంగా ఘాటు విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి ఇతర రాష్ట్రాల్లో ప్రచారం చేస్తూ కాంగ్రెస్‌ను ఓడిస్తున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అలాగే భవిష్యత్తులో సిద్ధిపేట నియోజకవర్గం గనుక మహిళలకు రిజర్వ్ అయితే, అక్కడి నుంచే ఎన్నికల బరిలోకి దిగుతానని తన రాజకీయ వ్యూహాన్ని బయటపెట్టారు. గజ్వేల్ స్థానం విషయంలోనూ సానుకూల నిర్ణయం తీసుకుంటానని పేర్కొన్నారు.

## బీసీలకు కాంగ్రెస్ సర్కార్ మొండిచేయి

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్రంలోని బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిందని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. మహబూబ్‌నగర్ పట్టణంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకల్లో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌లతో కలిసి కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ, బీసీ సంక్షేమానికి వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని చెప్పిన రేవంత్ సర్కార్, ఇప్పటి వరకు కేవలం 7 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేసిందని అధికారుల లెక్కలే చెబుతున్నాయని విమర్శించారు. యాదవులకు గొర్రెల పంపిణీ, నగదు బదిలీ పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు చేతులెత్తేశారని మండిపడ్డారు. బీసీలకు మంత్రివర్గంలో తగిన ప్రాధాన్యత కల్పించలేదని, అసెంబ్లీ వేదికగా తాము ఈ విషయమై ప్రభుత్వాన్ని నిలదీశామని గుర్తు చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం దొడ్డి కొమురయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించి బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడిందని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు.



సంక్షేమ మనసర్కార్ Follow: manasarkar
శనివారం | హైదరాబాద్
04.04.2026
www.manasarkar.com

# ఇదేంటి.. విజయ్?



**చెన్నై (ఏడీఎన్ఎన్):**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు, నటుడు విజయ్‌కి నామినేషన్ల పర్వంలో ఊహించని చిక్కులు ఎదురయ్యాయి. ఆయన పోటీ చేస్తున్న రెండు నియోజకవర్గాల్లో సమర్పించిన ఎన్నికల అఫిడవిట్లలోని సమాచారం పరస్పర విరుద్ధంగా ఉండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ తేడాల వల్ల ఆయన నామినేషన్ల చెల్లుబాటుపై న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తే ప్రమాదం కనిపిస్తోంది. విజయ్ పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ స్థానాల నుంచి పోటీకి సిద్ధమయ్యారు. అయితే ఆయా అఫిడవిట్లలో క్రిమినల్ కేసుల ప్రస్తావన భిన్నంగా ఉంది. పెరంబూర్‌లో సమర్పించిన పత్రాల్లో తనపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని పేర్కొన్న ఆయన, తిరుచ్చి ఈస్ట్ నామినేషన్‌లో మాత్రం తనపై రెండు ఎఫ్ఐఆర్‌లు పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించారు. ఒకే వ్యక్తి రెండు వేర్వేరు అఫిడవిట్లలో కేసుల విషయంలో రెండు రకాలుగా పేర్కొనడం గమనార్హం.మరోవైపు ఎన్నికల ఖర్చు కోసం వినియోగించే బ్యాంకు ఖాతాల వివరాల్లోనూ స్పష్టత కొరవడింది. పెరంబూర్ అఫిడవిట్‌లో ఒక బ్యాంకు ఖాతా ఉందని, అందులో రూ. లక్ష జమ చేసినట్లు చూపగా, తిరుచ్చి అఫిడవిట్‌లో మాత్రం రెండు బ్యాంకు ఖాతాలు ఉన్నట్లు పేర్కొన్నట్లు సమాచారం. ఈ ఆర్థిక వివరాల్లోని వ్యత్యాసాలపై ఎన్నికల అధికారులు ఆరా తీసే అవకాశం ఉంది. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం ఎన్నికల అఫిడవిట్‌లో వాస్తవాలను దాచిపెట్టడం లేదా తప్పుడు సమాచారం ఇవ్వడం తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు. ఈ నేపథ్యంలో విజయ్ సమర్పించిన పత్రాల్లోని వైరుధ్యాలు న్యాయపరమైన చిక్కులకు దారితీస్తాయని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ వీటిని ఉద్దేశపూర్వక ఉల్లంఘనలుగా గుర్తిస్తే ఆయన అభ్యర్థిత్వంపై ప్రభావం చూపే ప్రమాదం కూడా లేకపోలేదు.





## సముద్ర గర్భంలో...
# సైలెంట్ కిల్లర్!

**విశాఖపట్నం (ఏడీఎన్ఎన్):**

భారత నౌకాదళం తన యుద్ధ సామర్థ్యాన్ని మరింత పెంచుకుంటూ మరో శక్తివంతమైన అస్త్రాన్ని చేర్చుకుంది. శత్రువుల రాడార్లకు చిక్కకుండా మెరుపుదాడి చేయగల అత్యాధునిక యుద్ధనౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' శుక్రవారం విశాఖపట్నంలో లాంఛనంగా కమిషన్ అయింది. విశాఖ నేవల్ డాక్‌యార్డులో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ యుద్ధనౌకను జాతికి అంకితం చేశారు. సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, నేవీ చీఫ్ దినేశ్ కే.త్రిపాఠి వంటి ఉన్నతాధికారులు భారత రక్షణ రంగంలో ఇదొక మైలురాయిగా అభివర్ణించారు.

**ప్రాజెక్టు 17-ఏలో భాగంగా నిర్మాణం**

నీలగిరి శ్రేణికి చెందిన 'ప్రాజెక్టు 17ఏ'లో భాగంగా తయారైన నాలుగో ఫ్రిగేట్ ఇది. ముంబయిలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్) ఈ భారీ యుద్ధనౌకను నిర్మించింది. గతేడాది నవంబరులోనే నిర్మాణ పనులు పూర్తి చేసుకుని నౌకాదళంలో చేరిన ఈ నౌక, అన్ని పరీక్షల అనంతరం ఇప్పుడు విధుల్లోకి చేరింది.

**స్వదేశీ పరిజ్ఞానానికి పెద్దపీట**

'ఆత్మనిర్భర్ భారత్'లో భాగంగా ఈ నౌక నిర్మాణంలో 75 శాతానికి పైగా స్వదేశీ పరిజ్ఞానాన్ని ఉపయోగించారు. ముఖ్యంగా దేశంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక సంస్థలు అందించిన రక్షణ ఉత్పత్తులతో దీనిని తయారు చేయడం విశేషం. ఇది భారత పారిశ్రామిక రక్షణ రంగానికి దక్కిన గొప్ప గౌరవంగా నేవీ వర్గాలు పేర్కొన్నాయి.

**శత్రువుల కళ్లుగప్పే 'స్టెల్త్' టెక్నాలజీ**

ఈ యుద్ధనౌక ప్రధాన బలం దాని 'స్టెల్త్' సాంకేతికత, సముద్రంలో ప్రయాణిస్తున్నప్పుడు శత్రువుల రాడార్లు దీని ఉనికిని గుర్తించడం అసాధ్యం. నిశ్శబ్దంగా ప్రయాణిస్తూ, శత్రువులను కోలుకోలేని దెబ్బతీయడం దీని ప్రత్యేకత. అందుకే దీన్ని భారత సముద్ర సరిహద్దుల రక్షణలో కీలక ఆయుధంగా భావిస్తున్నారు.

**బ్రహ్మోస్ క్షిపణులతో భీకర శక్తి**

ఈ నౌకలో 6,670 టన్నుల బరువుండే అత్యంత విధ్వంసకరమైన ఆయుధాలు ఉన్నాయి. గగనతల ముప్పులను అడ్డుకునే 'బరాక్8' క్షిపణులతో పాటు, సముద్రంలో ఎంతటి పెద్ద నౌకనైనా ధ్వంసం చేయగల 8 'బ్రహ్మోస్' క్షిపణులను ఇందులో అమర్చారు. గంటకు 28 నాట్స్ వేగంతో ప్రయాణించగల సామర్థ్యం దీనికి ఉంది.

**నిఘా, రక్షణ వ్యవస్థ:**

కేవలం దాడులు చేయడమే కాకుండా, శత్రువుల సబ్‌మెరైన్లను (జలాంతర్గాములు) వేటాడే యాంటీ సబ్‌మెరైన్ వార్ఫేర్ వ్యవస్థ ఇందులో ఉంది. అత్యాధునిక రాడార్లు, సెన్సార్ల ద్వారా సుదూర ప్రాంతాల నుంచే శత్రువుల రాకను పసిగట్టి, తక్షణమే అప్రమత్తం చేసేలా దీనిని తీర్చిదిద్దారు.



## నా గళాన్ని
# అణచివేయలేరు

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

తన నోరు నొక్కి అణచివేయాలనుకుంటే అది పార్టీ విజయం కాదని, ప్రజా సమస్యలపై గళమెత్తడం నేరమా? అని ఎంపీ రాఘవ్ చద్దా సూటిగా ప్రశ్నించారు.రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఉపనేత పదవి నుంచి తనను తొలగించడంపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.ఈ మేరకు శుక్రవారం ఆయన ప్రజా గొంతుకను అడ్డుకుంటారా? అంటూ ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. పార్లమెంట్‌లో గిగ్ వర్కర్ల కష్టాలు, విమానాశ్రయాల్లో అధిక ధరలు, టోల్ ప్లాజా దోపిడీ వంటి అంశాలపై తాను మాట్లాడటం పార్టీకి ఎలా నష్టం కలిగిస్తుందని చద్దా ప్రశ్నించారు. తన ప్రసంగాలను అడ్డుకోవాలని పార్టీ స్వయంగా రాజ్యసభ సెక్రటరీకి లేఖ రాయడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రాఘవ్ చద్దా స్థానంలో ఎంపీ అశోక్ మిత్తల్‌ను ఆప్ డిప్యూటీ లీడర్‌గా నియమించింది. చద్దా గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాగా రాఘవ్ చద్దా త్వరలో భారతీయ జనతా పార్టీలో చేరబోతున్నారనే ఊహాగానాలు రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో పార్టీకి, చద్దాకు మధ్య మొదలైన ఈ మాటల యుద్ధం పంజాబ్, ఢిల్లీ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.

## గ్యాస్ వినియోగదారులకు
# ఐఓసీ భరోసా



**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎల్‌పీజీ సిలిండర్ల కొరత ఏర్పడుతుందనే ఆందోళనలపై ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ స్పష్టతనిచ్చింది. దేశవ్యాప్తంగా గ్యాస్ సరఫరా అత్యంత స్థిరంగా ఉందని, వినియోగదారుల అవసరాలకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. అనవసరమైన ఆందోళనతో 'ప్యానిక్ బుకింగ్'లకు గానీ, అక్రమ నిల్వలకు గానీ పాల్పడవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం దేశంలో ప్రతిరోజూ సుమారు 28 లక్షల ఎల్‌పీజీ సిలిండర్లను డెలివరీ చేస్తున్నామని, యుద్ధానికి ముందు ఏ విధంగా సరఫరా సాగిందో ఇప్పుడూ అలాగే కొనసాగుతోందని ఐఓసీ వివరించింది. పారదర్శకత కోసం 87 శాతం రీఫిల్ బుకింగ్‌లు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే జరుగుతున్నాయని, ఓటీపీ (OTP) ఆధారిత విధానం ద్వారానే సిలిండర్లు నేరుగా కస్టమర్లకు చేరుతున్నాయని పేర్కొంది. అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై ప్రస్తుత పరిణామాలు ప్రభావం చూపుతున్నప్పటికీ, భారత్‌లో గృహావసరాలకు ఎటువంటి అంతరాయం కలగకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించింది.అక్రమాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నట్లు ఐఓసీ స్పష్టం చేసింది. నిబంధనలు ఉల్లంఘించిన 141 మంది డిస్ట్రిబ్యూటర్లపై ఇప్పటికే చర్యలు తీసుకోగా, ఐదుగురిని సస్పెండ్ చేసినట్లు తెలిపింది. గ్యాస్ బుకింగ్ కోసం ఎస్ఎంఎస్, ఐవీఆర్ఎస్ వంటి డిజిటల్ మార్గాలను ఉపయోగించాలని సూచించింది. గృహ వినియోగదారుల అవసరాలకే తమ మొదటి ప్రాధాన్యమని, కృత్రిమ కొరత సృష్టించే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరిం

## పుదుచ్చేరిలో
# మోదీపై
# పూలవర్షం



**పుదుచ్చేరి (ఏడీఎన్ఎన్) :**

నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్ కి మద్దతు కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుదుచ్చేరిలో భారీ రోడ్‌షో నిర్వహించారు. శుక్రవారం ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి, పాండిచ్చేరి హోం మంత్రి ఎ.నమశ్శివాయం సైతం ఈ రోడ్‌షోలో పాల్గొన్నారు. రెండు కిలోమీటర్ల మేర పూలవర్షంతో గంటసేపు రోడ్‌షో జరిగింది. సాంస్కృతిక ప్రదర్శనలు, సాంప్రదాయ నృత్యాలతో ముందుకు సాగగా, బీజేపీ కార్యకర్తలు, అల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ జెండాలతో పెద్దఎత్తున ఈ రోడ్ షోలో పాల్గొన్నారు. అంతకు ముందు, పుదుచ్చేరిలో ప్రధానమంత్రికి బీజేపీ మద్దతుదారులు ఘనస్వాగతం పలికారు. 'జైశ్రీరామ్' 'భారత్ మాతా కీ జై' అంటూ నినాదులు హోరెత్తించారు. ప్రధాని కాన్వాయ్‌పై పూలజల్లు కురిపించారు. పుదుచ్చేరిలో ఎఐఎన్ఆర్‌సీబీజేపీ కూటమి మరోసారి అధికారంలోకి తెచ్చేందుకు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఈ తరుణంలో మోదీ రోడ్‌షోతో ప్రచారం మరింత ఊపందుకుంది. ఇటీవల పుదుచ్చేరి బీజేపీ కార్యకర్తలతో వర్చువల్ మీట్ లో మోదీ పాల్గొని వారిని మరింత ఉత్సాహపరిచారు. ఈ ఎన్నికల్లో సీట్ల పంపకాల్లో భాగంగా ఏఐఎన్ఆర్‌సీ 16 స్థానాల్లోనూ, బీజేపీ 10 స్థానాల్లోనూ పోటీ చేస్తున్నాయి. కూటమిలో ఇతర భాగస్వాములుగా ఉన్న అన్నాడీఎంకే, లాట్చియ జననాయగ కట్చి (ఎల్‌జేకే) చెరో రెండు స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. పుదుచ్చేరి అసెంబ్లీకి ఏప్రిల్ 9న పోలింగ్, మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

## భారత్ పై అమెరికా ఫార్మా బాంబు

**మొదటిపేజీ తరువాయి....**

యుద్ధాలు లేదా అంతర్జాతీయ ఉద్రిక్తతల సమయంలో ప్రాణరక్షక మందుల కోసం ఇతర దేశాలపై ఆధారపడటం ప్రమాదకరమని భావించిన ట్రంప్, ఈ రక్షణాత్మక చర్యకు ఉపక్రమించారు. క్యాన్సర్, అరుదైన వ్యాధులు , క్లిష్టమైన ఇన్ఫెక్షన్లకు వాడే మందుల విషయంలో ఈ నిబంధనలు అత్యంత కఠినంగా ఉండనున్నాయి. అమెరికా ప్రభుత్వం నిర్దేశించిన ధరల ఒప్పందాలకు తలొగ్గని లేదా అమెరికాలో తమ ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పని కంపెనీలపై ఈ భారీ సుంకాల భారం పడనుంది. ఇప్పటికే 13 ప్రధాన అంతర్జాతీయ ఫార్మా కంపెనీలు ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకోగా, మిగిలిన పెద్ద కంపెనీలకు 120 రోజులు, ఇతరులకు 180 రోజుల గడువును వైట్ హౌస్ విధించింది. కొత్త సుంకాల వ్యవస్థ ప్రకారం, "మోస్ట్ ఫేవరడ్ నేషన్" ధరల ఒప్పందంపై సంతకం చేసి, అమెరికాలోనే ఫ్యాక్టరీలు నిర్మించే కంపెనీలకు సుంకం సున్నా శాతంగా ఉంటుంది. అమెరికాలో ప్లాంట్లు నిర్మిస్తూ ధరల ఒప్పందానికి అంగీకరించని వారికి మొదట 20 శాతం సుంకం విధిస్తారు. ఇది నాలుగేళ్లలో 100 శాతానికి పెరుగుతుంది. ఈ నిర్ణయం భారతీయ ఫార్మా రంగంపై మిశ్రమ ప్రభావాన్ని చూపనుంది. ప్రస్తుతానికి భారతీయ సంస్థలు ఆధిపత్యం చెలాయించే 'జెనరిక్' మందులు , బయోసిమిలర్లకు ఈ సుంకాల నుంచి తాత్కాలిక మినహాయింపు ఇవ్వడం మన ఎగుమతులకు ఊరటనిచ్చే అంశం. ఏడాది తర్వాత జెనరిక్ దిగుమతులను కూడా జాతీయ భద్రతా చట్టం కింద సమీక్షిస్తామని ప్రకటించడం భారత్‌కు తీవ్ర హెచ్చరిక వంటిదే. భవిష్యత్తులో సంక్లిష్ట జెనరిక్‌లు, ఇంజెక్టబుల్స్ పై ఈ ప్రభావం పడే అవకాశం ఉంది. అమెరికా ఇచ్చే భారీ ప్రోత్సాహకాల ఆశతో డాక్టర్ రెడ్డీస్, సన్ ఫార్మా, బయోకాన్ వంటి అగ్రశ్రేణి భారతీయ కంపెనీలు తమ పరిశోధన ఉత్పత్తి కేంద్రాలను భారత్ నుంచి అమెరికాకు తరలించే ప్రమాదం కనిపిస్తోంది. భారత్‌లో మేధో సంపత్తి ఉద్యోగ అవకాశాలు దెబ్బతినవచ్చు. పేటెంట్ ఉత్పత్తుల జోలికి వెళ్లే భారతీయ సంస్థలు, భారీ ధరల ఒత్తిడిని లేదా నిబంధనల ఖర్చులను భరించాల్సి ఉంటుంది. అమెరికా తీసుకున్న ఈ చర్యలు భారత ఫార్మా రంగం తన ఎగుమతుల వ్యూహాన్ని మార్చుకోవాలని, అమెరికాలోనే నేరుగా ఉత్పత్తి కేంద్రాలను పెంచుకోవాలని లేదా ప్రత్యామ్నాయ మార్కెట్లను వెతుక్కోవాలని స్పష్టం చేస్తున్నాయి. రాబోయే నెలల్లో అమెరికా అనుసరించే తదుపరి అడుగులు భారత ఫార్మా దిగ్గజాల భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

## పేదల ఇళ్లు కూల్చేవారు..?

**మొదటిపేజీ తరువాయి....**

ప్రధాని మోదీని, కేరళ సీఎం పినరయి విజయన్‌ను 'మోదీ బ్రదర్స్' అని సంబోధిస్తూ రేవంత్ చేసిన వ్యాఖ్యలకు, విజయన్ అంతే ఘాటుగా సమాధానమిచ్చారు. కేరళ పాలనను 'చీకటి యుగం'గా అభివర్ణించిన రేవంత్ రెడ్డికి, విజయన్ తనదైన శైలిలో గణాంకాలను సాక్ష్యంగా చూపుతూ సోషల్ మీడియా వేదికగా చురకలంటించారు.తెలంగాణలో పేదల ఇళ్లను కూల్చివేస్తూ బుల్డోజర్ల రాజకీయం చేస్తున్న వారు, కేరళ అభివృద్ధి గురించి మాట్లాడటం హాస్యాస్పదమని పినరయి విజయన్ మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి కేరళ అభివృద్ధిపై కనీస అవగాహన లేదని, ఎవరో ఇచ్చిన తప్పుడు సమాచారంతో ఆయన ఇక్కడ మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. నీతి ఆయోగ్ సుస్థిర అభివృద్ధి సూచీ (2023-24) ప్రకారం కేరళ దేశంలోనే అత్యంత తక్కువ అవినీతి కలిగిన రాష్ట్రంగా అగ్రస్థానంలో ఉందని, తెలంగాణ కేవలం 6వ స్థానంలో మాత్రమే ఉందని విజయన్ గుర్తు చేశారు. ఒక పారదర్శకమైన వ్యవస్థపై విమర్శలు చేసే ముందు తమ సొంత రాష్ట్ర పరిస్థితిని సమీక్షించుకోవాలని హితవు పలికారు.కేరళలో పేదరికం రేటు కేవలం 0.55 శాతం మాత్రమేనని, ఇది దేశంలోనే అత్యల్పమని పినరయి విజయన్ వివరించారు. అక్షరాస్యత, శిశు మరణాల రేటును తగ్గించడంలో కేరళ ప్రపంచ స్థాయి ప్రమాణాలను అందుకుందని, ఈ విషయాల్లో తెలంగాణ కంటే తాము ఎంతో మెరుగ్గా ఉన్నామని గణాంకాలతో సహా వివరించారు. సొంత రాష్ట్రంలో ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు కూడా సక్రమంగా చెల్లించలేని స్థితిలో ఉన్న ప్రభుత్వం, దేశానికే దిక్సూచిలా ఉన్న కేరళను విమర్శించడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. కేరళ నుంచి పాలనా పాఠాలు నేర్చుకోవాల్సింది రేవంత్ రెడ్డే తప్ప, తమకు ఆయన నుంచి నేర్చుకోవాల్సింది ఏమీ లేదని విజయన్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.

## నాశనం చేయాలని చూస్తే...

**మొదటిపేజీ తరువాయి....**

ఈ విజయాన్ని ఐదు కోట్ల ఆంధ్రుల విజయంగా అభివర్ణించారు. ఈ చారిత్రాత్మక నిర్ణయానికి సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభ స్పీకర్ మరియు రాజ్యసభ ఛైర్మన్‌లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాజధాని అమరావతిని నాశనం చేయాలని గత ప్రభుత్వం చూస్తే, తాము అదే అమరావతిని రాజధానిగా చేస్తూ శాసనం చేశామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విభజన సమయంలో రాజధాని లేక పడిన కష్టాలను గుర్తుచేసుకుంటూ, నాడు ఒక ప్రభుత్వ కార్యాలయమే తన పాలనా కేంద్రమైందని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి వికేంద్రీకరణే తెలుగుదేశం పార్టీ సిద్ధాంతమని, అమరావతిని అభివృద్ధి చేస్తూనే విశాఖపట్నం, తిరుపతి వంటి నగరాలను పారిశ్రామికంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. గతంలో సైబరాబాద్ అభివృద్ధిని విమర్శించిన వారే ఇప్పుడు దాని ప్రాముఖ్యతను చూస్తున్నారని, అమరావతి కూడా భవిష్యత్తులో అలాగే వెలుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ తీరుపై చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంటులో ఈ బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు తెలిపినా, వైసీపీ మాత్రం వ్యతిరేకించడం ద్వారా రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేసిందని విమర్శించారు. ఎన్నికల్లో ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా ఆ పార్టీ నేతలకు బుద్ధి రాలేదని మండిపడ్డారు. సింగపూర్ వంటి అంతర్జాతీయ భాగస్వాములపై అసత్య ఆరోపణలు చేసి రాష్ట్రం నుంచి తరిమేసిన చరిత్ర వైసీపీదని దుయ్యబట్టారు. పెట్టుబడులు రాకుండా అడ్డుకుంటూ రాష్ట్ర ఉనికిని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను తెలంగాణకు ఎప్పుడూ వ్యతిరేకం కాదని చంద్రబాబు స్పష్టం చేశారు. సమైక్యాంధ్రప్రదేశ్ సీఎంగా ఉన్నప్పుడు తెలుగుజాతి గౌరవం కోసమే హైదరాబాద్‌ను అభివృద్ధి చేశానని గుర్తుచేశారు. పోలవరం ముంపు మండలాల విలీనం కోసం నాడు తాను పట్టుబట్టిన విషయాన్ని ప్రస్తావిస్తూ, తెలుగు ప్రజల ప్రయోజనాలే తనకు ముఖ్యమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల గౌరవానికి భంగం కలిగే పనిని తాను ఎన్నడూ చేయనని, రెండు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలన్నదే తన ఆకాంక్షని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు.

## అభ్యర్థిగా కాకుండా
# వ్యూహకర్తగా అన్నామలై



**చెన్నై (ఏడీఎన్ఎన్):**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ ప్రకటించిన అభ్యర్థుల జాబితా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. పార్టీ రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్న మాజీ అధ్యక్షుడు కె. అన్నామలై పేరు ఈ జాబితాలో లేకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గత కొంతకాలంగా రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రలు చేస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసిన అన్నామలై వంటి అగ్రనేత ఎన్నికల బరిలో లేకపోవడం వెనుక బీజేపీ అధిష్ఠానం పెద్ద వ్యూహమే పన్నినట్లు కనిపిస్తోంది.కూటమి రాజకీయాలు , సీట్ల కేటాయింపులో తలెత్తిన సంక్లిష్టతలే అన్నామలై పేరు జాబితాలో లేకపోవడానికి ప్రధాన కారణమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మిత్రపక్షాలతో పొత్తు చర్చలు నడుస్తున్న తరుణంలో, పార్టీ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆయన పోటీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఒక నియోజకవర్గానికి అభ్యర్థిగా పరిమితం కావడం కంటే, రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం నిర్వహించి కూటమి అభ్యర్థుల విజయం కోసం పనిచేయడం మిన్న అని ఆయన భావిస్తున్నట్లు సమాచారం.

## అధికారం ఇస్తే...
# మేమేంటో చూపిస్తాం

**మొదటిపేజీ తరువాయి....**

తిరిగి తాము అధికారంలోకి వస్తే అక్రమ చొరబాటుదారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. గిరిజనుల భివృద్ధికి పీఎం నరేంద్ర మోదీ, అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ సమగ్ర ప్రణాళిక సిద్ధం చేశారని అమిత్‌షా తెలిపారు. దీనిని ముందుకు తీసుకువెళ్లేందుకు బీజేపీకే ప్రజలు ఓటు వేయాలని కోరారు. మోదీ నాయకత్వంలో తొలిసారి గిరిజన మహిళ రాష్ట్రపతి అయిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నడూ ఆదివాసీ మహిళలను రాష్ట్రపతి చేయలేదన్నారు. మోదీ వచ్చాక ద్రౌపది ముర్ము దేశానికి తొలి పౌరురాలు అయ్యారని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో యూసీసీని బలవంతంగా రుద్దుతున్నారంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారంలో నిజం లేదన్నారు. యూసీసీ నుంచి ఆదివాసీ ప్రాంతాలను మినహాయిస్తామని చెప్పారు. మేఘాలయలో చొరబాటుదారులు ఇటీవల గరో హిల్స్ అటానమస్ జిల్లా కౌన్సిల్‌లో గిరిజన మహిళలను పెళ్లాడి రాజకీయ పలుకుబడిని సంపాదించే ప్రయత్నం చేశారని హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఇది ఉద్రిక్తతలకు దారితీసిందని చెప్పారు. అస్సాంలో తమకు మరో ఐదేళ్లు అధికారం ఇయ్యాలని కోరారు. అప్పుడే యూజీసీని అమలు చేసి చొరబాటుదారుల నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పిస్తామని అన్నారు. అస్సాంలో శాంతిని బీజేపీ పునరుద్ధరించిందన్నారు. కాంగ్రెస్ తిరిగి వస్తే రాష్ట్రంలో అస్థిరత నెలకొంటుందని హెచ్చరించారు. అస్సాం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

## దక్షిణాసియా వస్త్ర రాజధానిగా
# మన తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి....**

మన సంస్కృతిలో భాగమైన చేనేత కళను ఆధునిక సాంకేతికతతో జోడించి, రాష్ట్రాన్ని దక్షిణాసియాకే వస్త్ర రాజధానిగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించారు. నిజాం కాలం నాటి వర్తక వాణిజ్యాల నుండి నేటి అత్యాధునిక పరిశ్రమల వరకు తెలంగాణ ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకమని, టెక్స్‌టైల్ రంగం మన డీఎన్ఏలోనే ఉందన్న ముఖ్యమంత్రి మాటలు రాష్ట్ర వారసత్వానికి అద్దం పడుతున్నాయి.రాష్ట్రం నిర్దేశించుకున్న 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను చేరుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వరంగల్‌లో ఉన్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ఇప్పుడు అంతర్జాతీయ ప్రమాణాలతో విరాజిల్లుతోందని, ఇక్కడి నుంచి ఉత్పత్తి అయ్యే దుస్తులు లండన్, పారిస్ వంటి ఫ్యాషన్ నగరాల్లో మెరవాలని సీఎం ఆకాంక్షించారు. నాణ్యమైన పత్తి ఉత్పత్తిలో తెలంగాణ ఇప్పటికే అగ్రస్థానంలో ఉండటం మనకు కలిసొచ్చే అంశమని, దీనిని పూర్తిస్థాయిలో వినియోగించుకుని అంతర్జాతీయ మార్కెట్‌లో మనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేయాలని పిలుపునిచ్చారు. ఇది కేవలం పారిశ్రామిక వృద్ధి మాత్రమే కాకుండా, లక్షలాది మందికి ఉపాధి కల్పించే గొప్ప మార్గమని ఆయన అభిప్రాయపడ్డారు.సినిమా రంగానికి , ఫ్యాషన్ ప్రపంచానికి ఉన్న విడదీయలేని బంధాన్ని గుర్తిస్తూ, హైదరాబాద్‌ను గ్లోబల్ ఫ్యాషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నారు. టాలీవుడ్, బాలీవుడ్ మాత్రమే కాకుండా అంతర్జాతీయ నెట్‌ఫ్లిక్స్ సంస్థల రాకతో హైదరాబాద్ హాలీవుడ్ స్థాయికి చేరుతోందని, ఈ క్రమంలో సినిమా రంగానికి అవసరమైన కాస్ట్యూమ్ డిజైనింగ్ , ఫ్యాషన్ అవసరాలను తెలంగాణ నుంచే సరఫరా చేసేలా ప్రోత్సాహం అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. గ్రీన్ టెక్నాలజీకి ప్రాధాన్యత ఇస్తూ పర్యావరణ హితమైన 'గ్రీన్ టెక్స్‌టైల్ హబ్'లను ఏర్పాటు చేయడం ద్వారా స్థిరమైన అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. ఇది పర్యావరణ పరిరక్షణతో పాటు ఆధునిక ప్రపంచ డిమాండ్‌ను కూడా తీరుస్తుంది.మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, వస్త్ర రంగంలో వారికి అధునాతన డిజైనింగ్ , స్టిచింగ్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేవలం యంత్రాలు మాత్రమే కాకుండా, నైపుణ్యం కలిగిన మానవ వనరులే పరిశ్రమ విజయానికి పునాదులని సీఎం రేవంత్ రెడ్డి నొక్కి చెప్పారు. వినూత్న ఆలోచనలు ,విజన్ ఉన్న పెట్టుబడిదారులకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, భూమి, విద్యుత్, నీరు వంటి మౌలిక సదుపాయాలతో పాటు వేగవంతమైన అనుమతులు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. పారదర్శకమైన విధానాలతో వ్యాపార అనుకూల వాతావరణాన్ని సృష్టించడం ద్వారా ప్రపంచ స్థాయి కంపెనీలను ఆకర్షించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచానికి అవసరమైన వ్యాక్సిన్లు , సాంకేతిక పరికరాలను అందిస్తున్న తెలంగాణ, భవిష్యత్తులో ప్రపంచం ధరించే మేలైన దుస్తులను కూడా అందిస్తుందని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. గత పాలకుల వారసత్వాన్ని స్వీకరిస్తూనే, భవిష్యత్తు తరాల కోసం ఒక శక్తివంతమైన పారిశ్రామిక వ్యవస్థను నిర్మించాలన్న పట్టుదల సీఎం ప్రసంగంలో స్పష్టంగా కనిపించింది. ఐటీ హబ్‌గా ఎదిగిన తెలంగాణ, ఇప్పుడు 'టెక్స్‌టైల్ హబ్'గా రూపాంతరం చెందుతూ దక్షిణాసియాలోనే కీలక ఆర్థిక కేంద్రంగా అవతరించబోతోంది. రండి, ఈ నూతన భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తూ సదస్సును ఉత్తేజితం చేశారు.

## సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
# తెలంగాణకు రాక



**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తెలంగాణ రాష్ట్రంలో ఇవాళ పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన హైదరాబాద్‌లోని తెలంగాణ హైకోర్టులో నిర్వహించే పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొంటారు. సీజేఐ హోదాలో జస్టిస్ సూర్యకాంత్ తెలంగాణ హైకోర్టును సందర్శించి, అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ కోర్టులు, ఇతర మౌలిక సదుపాయాలను ప్రారంభించే అవకాశం ఉంది. రాష్ట్రంలోని న్యాయవ్యవస్థ తీరుతెన్నులు, పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం గురించి అడిగి తెలుసుకోనున్నారు. న్యాయమూర్తుల ఖాళీల భర్తీపై చర్చించే అవకాశం ఉంది. నల్సార్ ద్వారా చేపడుతున్న న్యాయ విజ్ఞాన సదస్సుల్లో భాగంగా పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించే దిశగా దిశానిర్దేశం చేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా గవర్నర్, ముఖ్యమంత్రితో కూడా మర్యాదపూర్వక సమావేశాలు జరిగే అవకాశం ఉంది. జస్టిస్ సూర్యకాంత్ గారు 24 నవంబర్ 2025న భారత 53వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన రాక సందర్భంగా తెలంగాణ హైకోర్టు ప్రాంగణంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. న్యాయ వ్యవస్థలో సాంకేతికతను పెంపొందించడం, సామాన్యులకు త్వరితగతిన న్యాయం అందించడమే తన లక్ష్యమని ఆయన ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో, ఈ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.



## అమెరికా 'అటామిక్' సాహసం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఇరాన్‌తో శాంతి చర్చల అవకాశాలను పూర్తిగా పక్కనపెట్టిన ట్రంప్, ఆధునిక యుద్ధ చరిత్రలోనే అత్యంత ప్రాణాంతకమైన మిషన్‌కు రంగం సిద్ధమైంది. ఇరాన్ అణు కేంద్రాల్లో గత దాడుల వల్ల శిథిలాల కింద కూరుకుపోయిన యురేనియం నిల్వలను తవ్వి తీసి, వాటిని అమెరికాకు తరలించాలని ఆయన సైన్యాన్ని ఆదేశించారు. తన ఆధిపత్యం కోసం వేలాది మంది అమెరికా సైనికులను 'రసాయన మృత్యువు' ముంగిట నిలబెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నా, ట్రంప్ మాత్రం తన పంతం నెగ్గించుకోవడమే లక్ష్యం దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ ఆపరేషన్ వివరాలు వింటేనే ఒళ్లు గగుర్పొడుస్తోంది. ఇస్ఫహాన్, నతాంజ్ ప్రాంతాల్లోని పర్వత శిథిలాల కింద సుమారు 450 కిలోగ్రాముల (1000 పౌండ్లు) యురేనియం హెక్సాఫ్లోరైడ్ నిల్వలు ఉన్నట్లు సమాచారం. వీటిని బాంబులతో నాశనం చేయడం కాకుండా, భౌతికంగా స్వాధీనం చేసుకోవాలని ట్రంప్ భావిస్తున్నారు. ఈ యురేనియం గాలితో కలిస్తే అత్యంత విషపూరితమైన హైడ్రోఫ్లోరిక్ ఆమ్లంగా మారుతుంది. ఇది సైనికుల ఊపిరితిత్తులను కాల్చివేయడమే కాకుండా, శరీరంలోని ఎముకలను సైతం కరిగించేసే శక్తి కలిగి ఉంటుంది. పైగా 60 శాతానికి పైగా శుద్ధి చేసిన ఈ యురేనియం నుంచి వెలువడే గామా కిరణాలు సెకన్ల వ్యవధిలో ప్రాణాలు తీయగలవు. ఏ మాత్రం చిన్న పొరపాటు జరిగినా, అది కేవలం సైనికులకే కాకుండా ఆ ప్రాంతం మొత్తానికి రేడియోధార్మిక ముప్పుగా మారుతుంది. ఈ అత్యంత క్లిష్టమైన మిషన్ కోసం అమెరికాకు చెందిన '82వ ఎయిర్‌బోర్న్ డివిజన్', 'రేంజర్స్' వంటి ఎలైట్ దళాలు ఇరాన్ గడ్డపైకి పారాచూట్ల ద్వారా దిగాల్సి ఉంటుంది. అక్కడ తాత్కాలికంగా ఒక విమానాశ్రయాన్ని నిర్మించి, భారీ క్రేన్లతో తవ్వకాలు జరపడం అనేది వారాల తరబడి సాగే ప్రక్రియ. ఇరాన్ నిరంతరం క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేస్తున్న తరుణంలో, అమెరికా సైనికులు యుద్ధ క్షేత్రం మధ్యలో తిష్టవేసి ఈ పనులు చేయడం ఆత్మహత్యాసదృశ్యమేనని రిటైర్డ్ జనరల్ జోసెఫ్ వోటెల్ వంటి నిపుణులు హెచ్చరిస్తున్నారు. "ఇరాన్ వద్ద మిగిలింది అణు ధూళి మాత్రమే, దాన్ని కూడా వదిలిపెట్టం" అని ట్రంప్ తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ ఆపరేషన్ విజయవంతమైతే ట్రంప్ పంతం నెగ్గుతుంది, కానీ విఫలమైతే మాత్రం వేలాది మంది అమెరికా సైనికుల ప్రాణాలు గాలిలో కలిసిపోవడంతో పాటు ప్రపంచం ఒక భారీ అణు విపత్తును చూడాల్సి ఉంటుంది.



## చైనాకు మళ్లిన చమురు నౌక

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారత్ ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న ఇరాన్ ముడి చమురు సరఫరాలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. దాదాపు ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత్‌కు రావాల్సిన ఇరాన్ చమురు ట్యాంకర్ 'పింగ్ షున్', తన గమ్యస్థానాన్ని మార్చుకొని చైనా వైపు వెళ్తున్నట్లు షిప్ ట్రాకింగ్ వెబ్‌సైట్ కెప్లర్ వెల్లడించింది. వాస్తవానికి ఈ నెల 4వ తేదీన గుజరాత్‌లోని వడినార్ నౌకాశ్రయానికి చేరుకోవాల్సిన ఈ నౌక, చైనాలోని డోగియింగ్‌కు వెళ్తున్నట్లు సంకేతాలు పంపుతోంది. గత నెల 4న ఇరాన్‌లోని ఖర్గ్ ద్వీపం వద్ద సుమారు 6,00,000 బ్యారెళ్ల చమురును లోడ్ చేసుకున్న ఈ ట్యాంకర్, భారత్ సరిహద్దులకు సమీపంలో ఉండగా అకస్మాత్తుగా దారి మళ్లడం దౌత్యపరంగా పెను దుమారం రేపుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలను తగ్గించే ఉద్దేశంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్‌పై ఉన్న ఆంక్షలను 30 రోజుల పాటు తాత్కాలికంగా ఎత్తివేసిన సంగతి తెలిసిందే. ఈ వెసులుబాటుతో 2019 తర్వాత మొదటిసారిగా ఇరాన్ నుంచి భారత్‌కు చమురు దిగుమతులు పునఃప్రారంభమయ్యాయని అంతా భావించారు. ఒకప్పుడు భారత్ తన మొత్తం చమురు అవసరాల్లో 11.5 శాతం ఇరాన్ నుంచే పొందేది. తాజా పరిణామం భారత్ ఇంధన భద్రతపై ప్రభావం చూపే అవకాశం ఉంది. చైనా తన ఇంధన నిల్వలను పెంచుకునే క్రమంలో ఇరాన్ నుంచి అధిక ధరకు ఈ సరుకును కొనుగోలు చేసి ఉండొచ్చని లేదా భద్రతా కారణాల దృష్ట్యా నౌక దారి మార్చుకొని ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ పరిణామంపై ఇరాన్ లేదా భారత అధికారిక వర్గాల నుంచి ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

## భారత్‌కు రష్యా చమురు భరోసా



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారత్ అవసరాలకు సరిపడా క్రూడ్ ఆయిల్ , సహజ వాయువును నిరంతరాయంగా సరఫరా చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని రష్యా ప్రకటించింది. భారత పర్యటనలో ఉన్న రష్యా మొదటి ఉప ప్రధాని డెనిస్ మంటురోవ్ ఈ మేరకు ఉన్నత స్థాయి భేటీల్లో స్పష్టమైన హామీ ఇచ్చింది. అంతర్జాతీయ ఇంధన మార్కెట్లు అస్థిరంగా మారిన తరుణంలో భారత్‌కు రష్యా చమురుపై భరోసా ప్రతిపాదన చేసింది. ఈ నెల 2 న దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన సమావేశాల్లో మంటురోవ్.. భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రధాని నరేంద్ర మోదీతో గురువారం భేటీ అయి రష్యా అధ్యక్షుడు పుతిన్ తరపున ద్వైపాక్షిక సహకారంపై చర్చలు జరిపారు. "భారత మార్కెట్‌కు స్థిరంగా , అదనపు పరిమాణంలో చమురు, ఎల్ఎన్‌జీ సరఫరా చేసే సామర్థ్యం రష్యన్ కంపెనీలకు ఉంది" అని మంటురోవ్ పేర్కొన్నట్లు రష్యా అధికారికంగా వెల్లడించింది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయ సరఫరా గొలుసు దెబ్బతిన్న నేపథ్యంలో, రష్యా నుంచి రాయితీ ధరలకు లభించే ఇంధనం భారత్ ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఊరటగా మారనుంది. గణాంకాల ప్రకారం, ఈ ఏడాది జనవరిలో రష్యా నుంచి దిగుమతులు స్వల్పంగా తగ్గినప్పటికీ, గత నెల మార్చి నాటికి భారత్ తన కొనుగోళ్లను 94 శాతం పెంచి రికార్డు సృష్టించింది. కేవలం ఇంధనం మాత్రమే కాకుండా, గత ఏడాది భారత్‌కు ఎరువుల సరఫరాను 40 శాతం పెంచామని, రాబోయే రోజుల్లో రక్షణ, టెక్నాలజీ , కనెక్టివిటీ రంగాల్లోనూ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తామని మంటురోవ్ తెలిపారు. హర్మూజ్ జలసంధి మూతపడటంతో తలెత్తిన ఇంధన భద్రతా సవాలును అధిగమించడానికి రష్యా అందిస్తున్న ఈ మద్దతు భారత్‌కు దౌత్యపరంగా ,ఆర్థికంగా గొప్ప అండగా నిలవనుంది.

# దమ్ముంటే వీటిని కాపాడుకో..

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అత్యంత ఎత్తైన 'బి1' వంతెనను అమెరికా,ఇజ్రాయెల్ దళాలు కూల్చివేయడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రతికారంగా "దమ్ముంటే వీటిని కాపాడుకో" అంటూ డొనాల్డ్ ట్రంప్‌కు ఇరాన్ ఒక సవాల్ ను విసిరింది. గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా మిత్రదేశాలకు చెందిన 8 కీలక వంతెనల జాబితాను గురువారం విడుదల చేసింది. టెహ్రాన్ ,కరాజ్ నగరాలను అనుసంధానించే 136 మీటర్ల ఎత్తైన బి1 వంతెనను అమెరికా క్షిపణులు నేలమట్టం చేశాయి. ఈ ప్రమాదంలో 8 మంది ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది గాయపడ్డారు. ఈ ఘటనపై స్పందించిన ట్రంప్, "ఇరాన్ అతిపెద్ద వంతెన కూలిపోయింది. ఇంకా చాలా జరగాల్సి ఉంది" అంటూ సోషల్ మీడియాలో హెచ్చరికలు జారీ చేశారు. దీనికి కౌంటర్‌గా ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ తమ తదుపరి లక్ష్యాలను ప్రకటిస్తూ ఒక హిట్ లిస్ట్‌ను జారీ చేసింది. ఇందులో కువైట్‌లోని షేక్ జాబేర్ అల్అహ్మద్ అల్‌సబా బ్రిడ్జ్, యూఏఈలోని ప్రసిద్ధ షేక్ జాయెద్, అల్ మక్తా ,షేక్ ఖలీఫా వంతెనలు ఉన్నాయి. అలాగే సౌదీ అరేబియాను బహ్రెయిన్‌తో కలిపే అత్యంత వ్యూహాత్మక 'కింగ్ ఫహద్ కాజ్‌వే'తో పాటు జోర్డాన్‌లోని కింగ్ హుస్సేన్, దామియా ,అబ్దౌన్ వంతెనలను కూడా ఇరాన్ తన లక్ష్యాలుగా పేర్కొంది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మాట్లాడుతూ, పౌర మౌలిక సదుపాయాలపై దాడులు చేయడం అమెరికా నైతిక పతనానికి నిదర్శనమని, తమను లొంగదీసుకోవడం ఎవరి వల్ల కాదని తేల్చి చెప్పారు. ఈ పరిణామాలు చూస్తుంటే యుద్ధం కేవలం సైనిక స్థావరాలకే పరిమితం కాకుండా, గల్ఫ్ దేశాల ఆర్థిక వెన్నెముకలైన రవాణా మార్గాలను దెబ్బతీసే 'బ్రిడ్జ్ వార్'గా మారుతోంది. ఇది ప్రపంచ చమురు సరఫరా రవాణా రంగాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం కనిపిస్తోంది.




# F-35 ఫైటర్ జెట్ ను కూల్చిన టెహ్రాన్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అమెరికా అత్యాధునిక ఎఫ్-35 ఫైటర్ జెట్‌ను తమ సైనిక దళాలు కూల్చివేసినట్లు టెహ్రాన్ సంచలన ప్రకటన చేసింది. తమ భూభాగంలోకి అక్రమంగా ప్రవేశించిన అమెరికా యుద్ధ విమానాన్ని క్షిపణి ద్వారా నేలమట్టం చేశామని ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ ధ్రువీకరించింది. యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి ఇరాన్ రెండు ఎఫ్-35 విమానాలను కూల్చివేయడం అగ్రరాజ్య సైనిక సామర్థ్యానికే పెద్ద సవాలుగా మారింది. ఒకవైపు ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవివ్ , పోర్ట్ సిటీ అయిలట్‌లపై ఇరాన్ లాంగ్ రేంజ్ మిసైల్స్, డ్రోన్లతో విరుచుకుపడుతోంది. ఈ దాడులను అడ్డుకునేందుకు ఇజ్రాయెల్ తన అధునాతన డిఫెన్స్ సిస్టమ్‌ను యాక్టివేట్ చేసింది. ఎఫ్35 కూల్చివేతపై అమెరికా సెంట్రల్ కమాండ్ ఎటువంటి అధికారిక వివరణ ఇవ్వకపోవడం గమనార్హం. గతంలో గత నెల 2న జరిగిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో కువైట్ సైన్యం జరిపిన ఫ్రెండ్లీ ఫైర్‌లో మూడు ఎఫ్ 15ఈ జెట్స్ కూలిపోయిన ఘటనను సెంట్రమ్ ధ్రువీకరించింది. గత నెల 31న కమాండర్ బ్రాడ్ కూపర్ మాట్లాడుతూ.. ఇరాన్ నేవీ, ఎయిర్ బేస్‌లపై అమెరికా సైన్యం దిగ్విజయంగా దాడులు చేస్తోందని పేర్కొన్నప్పటికీ, తాజా ఎఫ్-35 నష్టం అమెరికాలో కలకలం రేపుతోంది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హార్మూజ్ జలసంధిని వెంటనే తెరవాలని, లేనిపక్షంలో ఇరాన్‌ను 'శిలా యుగానికి' పంపిస్తామని హెచ్చరించినప్పటికీ ఇరాన్ ఏమాత్రం తగ్గడం లేదు. అగ్రరాజ్యంలో అంతర్గత రాజకీయాలు కూడా వేడెక్కాయి. తాజాగా అమెరికా ఆర్మీ చీఫ్ జనరల్‌ను పదవి నుంచి తొలగించడంతో అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్ షరతులకు తలొగ్గకుండా యుద్ధాన్ని తీవ్రతరం చేయడమే లక్ష్యంగా ట్రంప్ సర్కార్ అడుగులు వేస్తోంది. ఈ గగనతల పోరు మరింత రక్తపాతానికి దారితీస్తుందని రక్షణ రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# యుద్ధ విరమణకు ఐక్యరాజ్యసమితి పిలుపు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ప్రపంచం మొత్తాన్ని ఒక భారీ వినాశనం అంచుకు నెట్టేస్తున్నాయని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. న్యూయార్క్ లో జరిగిన అత్యవసర సమావేశంలో యూఎన్ ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం జరుగుతున్న ఘర్షణలు "మరణం , విధ్వంసం యొక్క విషవలయం"లా మారాయని అభివర్ణించారు. అమెరికా, ఇజ్రాయెల్ తమ సైనిక చర్యలను వెంటనే నిలిపివేయాలని, ఇరాన్ తన పొరుగు దేశాలపై జరుపుతున్న దాడులను ఆపాలని ఆయన గట్టిగా విజ్ఞప్తి చేశారు. యుద్ధం మరింత విస్తరిస్తే అది అదుపు చేయలేని స్థాయికి చేరుతుందని ఆంటోనియో గుటెరస్ హెచ్చరించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఈ ఘర్షణల వల్ల మానవీయ నష్టం ఊహించని రీతిలో పెరుగుతోందని గుటెరస్ ఆవేదన వ్యక్తం చేశారు. నిరపరాధ పౌరుల మరణాలు, ఆసుపత్రులు, పాఠశాలలు వంటి పౌర మౌలిక సదుపాయాల ధ్వంసం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ఈ యుద్ధ ప్రభావం అంతర్జాతీయ వాణిజ్యంపై పడిందని, హర్మూజ్ జలసంధి సమస్య ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మరణ శాసనంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సముద్ర మార్గం మూతపడితే, ఇంధన ,ఆహార ధరలు ఆకాశాన్ని తాకుతాయని, దీనివల్ల ఫిలిప్పీన్స్ నుంచి శ్రీలంక, మొజాంబిక్ వరకు ఉన్న పేద దేశాల ప్రజలు కనీసం శ్వాస తీసుకోలేని స్థితికి చేరుకుంటారని ఆయన ఆందోళన చెందారు. యుద్ధం కేవలం క్షిపణులకు సంబంధించింది మాత్రమే కాదని, అది కోట్లాది మంది సామాన్యుల కడుపు కొట్టే అంశమని ఆయన నాయకులకు గుర్తుచేశారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఐక్యరాజ్యసమితి దౌత్యపరమైన వేగాన్ని పెంచింది. గుటెరస్ తన వ్యక్తిగత ప్రతినిధి జీన్ ఆర్నాల్ట్‌ను శాంతి చర్చల కోసం పశ్చిమాసియాకు పంపుతున్నట్లు ప్రకటించారు. గల్ఫ్ సహకార మండలి ఇరాన్ చర్యలను తీవ్రంగా ఖండించింది. విమానాశ్రయాలు, చమురు క్షేత్రాలు , దౌత్య కార్యాలయాలే లక్ష్యంగా ఇరాన్ దాడులు చేయడం గల్ఫ్ దేశాల సార్వభౌమత్వానికి గొడ్డలి పెట్టు అని జీసీసీ ప్రధాన కార్యదర్శి జాసిమ్ అల్‌బుదైవీ విమర్శించారు. బహ్రెయిన్ విదేశాంగ మంత్రి అబ్దుల్లతీఫ్ అల్‌జయానీ మాట్లాడుతూ, తమ రక్షణ వ్యవస్థలు ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లు, మిస్సైళ్లను సమర్థంగా అడ్డుకున్నాయని వెల్లడించారు. ఇదే సమయంలో, అమెరికాఇజ్రాయెల్ దాడుల వల్ల తమ దేశంలోని చారిత్రక, సాంస్కృతిక వారసత్వ ప్రాంతాలు దెబ్బతింటున్నాయని ఆరోపిస్తూ ఇరాన్ యునెస్కోను ఆశ్రయించింది.యుద్ధం స్వయంగా ముగిసిపోదని, నాయకులు విధ్వంసం కంటే సంభాషణను ఎంచుకున్నప్పుడే శాంతి సాధ్యమని గుటెరస్ ఉద్ఘాటించారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా సమస్యలను పరిష్కరించుకోకపోతే, రాబోయే రోజుల్లో ప్రపంచం చూడబోయే ఆర్థిక , మానవీయ సంక్షోభానికి ఎవరూ బాధ్యత వహించలేరని ఆయన స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ , ఇరాన్ సుప్రీం నాయకత్వం ఐక్యరాజ్యసమితి పిలుపుకు ఎలా స్పందిస్తారనేది ప్రపంచ భవిష్యత్తును నిర్ణయించనుంది.



# ట్రంప్ 'క్లీన్ అప్' ఆపరేషన్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన పరిపాలనా యంత్రాంగంలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టారు. అమెరికా అటార్నీ జనరల్ పామ్ బాండీ పై వేటు వేశారు. అమెరికా అటార్నీ జనరల్ పామ్ బాండీపై వేటు పడిన కొన్ని గంటల వ్యవధిలోనే, సైనిక చీఫ్ జనరల్ ర్యాండీ జార్జ్ తన పదవికి రాజీనామా చేశారు. రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ఆదేశాల మేరకు ఆయన బాధ్యతల నుంచి వైదొలిగినట్లు తెలుస్తోంది. గత ఏడాది హోంల్యాండ్ సెక్యూరిటీ చీఫ్ క్రిస్టీ నోయెమ్‌ను తొలగించిన ట్రంప్, తన 'క్లీన్ అప్' ఆపరేషన్‌ను వేగవంతం చేశారు. ఈ ప్రక్షాళన జాబితాలో ఎఫ్బీఐ డైరెక్టర్ కాశ్ పటేల్ , డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ తులసీ గబ్బార్డ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. కాశ్ పటేల్ వ్యక్తిగత అవసరాల కోసం ఎఫ్బీఐ జెట్లను వాడారనే ఆరోపణలు ఆయన పదవికి ఎసరు తెచ్చేలా ఉన్నాయి. ఇక భారత సంతతికి చెందిన తులసీ గబ్బార్డ్ విషయంలో ట్రంప్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. తన వ్యూహాలకు అనుగుణంగా పనిచేయని, వివాదాల్లో చిక్కుకున్న ఉన్నతాధికారులపై వేటు వేస్తూ ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తున్నారు. యుద్ధం క్లైమాక్స్‌కు చేరుతున్న తరుణంలో ట్రంప్ తీసుకుంటున్న ఈ నిర్ణయాలు అగ్రరాజ్య రక్షణ దౌత్య వర్గాల్లో పెను మార్పులకు సంకేతంగా కనిపిస్తున్నాయి. ఇరాన్ అణు కార్యకలాపాలపై ట్రంప్ ప్రకటనలకు భిన్నంగా ఆమె వ్యాఖ్యలు చేయడమే దీనికి ప్రధాన కారణమని తెలుస్తోంది. "ఇరాన్ తన అణు కేంద్రాలపై దాడుల తర్వాత తిరిగి కార్యకలాపాలు ప్రారంభించిన దాఖలాలు లేవు" అని ఆమె చేసిన వ్యాఖ్యలు ట్రంప్ యుద్ధ వ్యూహానికి అడ్డంకిగా మారాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ట్రంప్ ఈ స్థాయిలో అధికారులను తొలగించడం వెనుక ఆయన రాజకీయ గ్రాఫ్ పడిపోవడమే ప్రధాన కారణమని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇరాన్‌తో యుద్ధాన్ని మెజారిటీ అమెరికన్లు వ్యతిరేకిస్తుండటంతో, తాజా పోల్స్‌లో ట్రంప్ ప్రజాదరణ కేవలం 33 శాతానికి పడిపోయింది. ఈ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి , యుద్ధ వ్యూహాన్ని కఠినతరం చేయడానికి ఆయన తన కార్యవర్గాన్ని పునర్వ్యవస్థీకరిస్తున్నారు. ఇరాన్‌కు ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' వేదికగా మరోసారి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. "ప్రపంచంలోనే శక్తిమంతమైన అమెరికా సైన్యం ఇరాన్‌లో ఇంకా అసలైన విధ్వంసాన్ని మొదలుపెట్టనేలేదు. ముందు వంతెనలు, ఆ తర్వాత విద్యుత్ ప్లాంట్‌లను లక్ష్యంగా చేసుకుంటాం. ఏం చేయాలో ఇరాన్ కొత్త నాయకత్వానికి బాగా తెలుసు" అని ఆయన హెచ్చరించారు.ఇరాన్ సైతం వెనక్కి తగ్గడం లేదు. అమెరికా తమ విద్యుత్ కేంద్రాలను తాకితే పర్షియన్ గల్ఫ్ అంతటా మైన్‌లు అమర్చుతామని, గల్ఫ్ దేశాల్లోని పర్యాటక ప్రాంతాలపై విరుచుకుపడతామని హెచ్చరించింది. అటు వైట్ హౌస్‌లో అధికారుల వేటు, ఇటు పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు అగ్రరాజ్యాన్ని అనిశ్చితిలోకి నెట్టేస్తున్నాయి. తులసీ గబ్బార్డ్, కాశ్ పటేల్ వంటి అధికారుల తొలగింపు అధికారికంగా ఖరారైతే, ట్రంప్ పరిపాలనలో ఇది ఒక అతిపెద్ద రాజకీయ సంక్షోభానికి దారితీసే అవకాశం ఉంది.



# పాకిస్తాన్ లో పెట్రో బాదుడు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ఆకాశాన్ని తాకడంతో, దివాళా అంచున ఉన్న పాక్ ప్రభుత్వం సామాన్యులపై ఊహించని రీతిలో పెను భారాన్ని మోపింది. నెల రోజులు తిరగకముందే రెండోసారి పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచుతూ గురువారం అర్ధరాత్రి పాక్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. తాజా పెంపుతో డీజిల్ ధర 55 శాతం, పెట్రోల్ ధర 43 శాతం మేర పెరగడంతో ప్రజా ఆగ్రహం పెల్లుబికింది. కొత్త ధరల ప్రకారం, పాకిస్తాన్ లో లీటర్ డీజిల్ ధర 520.35 రూపాయలకు (పాకిస్తానీ కరెన్సీ), లీటర్ పెట్రోల్ ధర 458.40 రూపాయలకు చేరుకుంది. శుక్రవారం నుంచే ఈ భారీ ధరలు అమలులోకి వచ్చాయి. అమెరికా,ఇరాన్ మధ్య యుద్ధం కారణంగా గ్లోబల్ మార్కెట్‌లో సరఫరా గొలుసు పూర్తిగా దెబ్బతిన్నదని, అందుకే ధరలు పెంచక తప్పలేదని పాక్ పెట్రోలియం శాఖ మంత్రి అలీ పర్వైజ్ మాలిక్ స్పష్టం చేశారు. గత నెలలోనూ ఇజ్రాయెల్,ఇరాన్ ఉద్రిక్తతల సాకుతో ధరలను 20 శాతం పెంచిన ప్రభుత్వం, మరోసారి పెట్రో బాదుడు మొదలుపెట్టడంతో పాక్ ప్రజలు వీధులకెక్కుతున్నారు. ఆకాశాన్ని తాకిన ద్రవ్యోల్బణంతో అల్లాడుతున్న సామాన్యులకు ఈ నిర్ణయం గొడ్డలిపెట్టుగా మారింది. పెరిగిన ధరల నుంచి కొంత ఉపశమనం కలిగించేందుకు ఆర్థిక మంత్రి ముహమ్మద్ ఔరంగజేబ్ కొన్ని నామమాత్రపు రాయితీలను ప్రకటించారు. టూ వీలర్ వాహనదారులకు నెలకు 20 లీటర్ల వరకు, లీటరుకు 100 రూపాయల సబ్సిడీని మూడు నెలల పాటు ఇవ్వనున్నారు. చిన్న రైతులకు ఎకరానికి 1,500 రూపాయల చొప్పున ఒకేసారి ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. ఖజానా ఖాళీ కావడంతో భారీ స్థాయిలో సబ్సిడీలు ఇవ్వడం ఇకపై సాధ్యం కాదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. రాబోయే రోజుల్లో చమురు ధరలు లీటర్ రూ. 600 దాటినా ఆశ్చర్యం లేదని మరోవైపు ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.





## బంగ్లాదేశ్ లో లాక్‌డౌన్ ఆంక్షలు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

దేశీయ ఇంధన అవసరాల కోసం ఏకంగా 95 శాతం ఇతర దేశాలపైనే ఆధారపడే బంగ్లాదేశ్, తీవ్రమైన విద్యుత్ , చమురు సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితులను అధిగమించేందుకు ప్రధాని తారిఖ్ రెహ్మాన్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ తరహా కఠిన ఆంక్షలను అమలులోకి తీసుకువచ్చారు. ఇంధన పొదుపే లక్ష్యంగా తీసుకున్న ఈ నిర్ణయాలు బంగ్లాదేశ్ పౌరుల జీవనశైలిని పూర్తిగా మార్చేశాయి. ప్రభుత్వ , ప్రైవేట్ కార్యాలయాల పనివేళలను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకే పరిమితం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాణిజ్య వర్గాలపైనా దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా షాపింగ్ మాల్స్, మార్కెట్లను సాయంత్రం 6 గంటలకే మూసివేయాలని ఆదేశించింది. బ్యాంకింగ్ సేవలు మధ్యాహ్నం 3 గంటలకే ముగియాలని స్పష్టం చేయగా, వైద్యం ,ఆహార విక్రయ కేంద్రాలకు మాత్రమే ఈ ఆంక్షల నుంచి మినహాయింపు లభించింది. ప్రభుత్వ యంత్రాంగంపై కూడా కఠినమైన ఆంక్షలు అమలువుతున్నాయి. ఇంధన , విద్యుత్ బడ్జెట్‌లో ఏకంగా 30 శాతం కోత విధిస్తున్నట్లు ప్రకటించడమే కాకుండా, కొత్త వాహనాలు, విమానాలు లేదా నౌకల కొనుగోలుపై తాత్కాలిక నిషేధం విధించింది. పండగలు లేదా బహిరంగ వేడుకల్లో అలంకరణ విద్యుత్ దీపాల వాడకాన్ని పూర్తిగా నిషేధించింది. ఈ క్లిష్ట సమయంలో బంగ్లాదేశ్ అంతర్జాతీయ సంస్థల నుంచి 2.5 బిలియన్ డాలర్ల అత్యవసర ఆర్థిక సాయాన్ని కోరుతోంది. తక్షణ ఇంధన అవసరాల కోసం భారత్ వైపు చూస్తున్న బంగ్లాదేశ్ అభ్యర్థనకు స్పందిస్తూ, భారత్ స్నేహపూర్వకంగా 5,000 టన్నుల అదనపు డీజిల్‌ను సరఫరా చేసింది. బంగ్లాదేశ్ మాత్రమే కాకుండా మాల్దీవులు, శ్రీలంక వంటి దేశాలు కూడా ఇంధన భద్రత కోసం భారత్‌పై ఆధారపడుతున్నాయి. పశ్చిమాసియా యుద్ధం ఇలాగే కొనసాగితే, దక్షిణాసియా దేశాల ఆర్థిక వ్యవస్థలు కుదేలయ్యే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అక్టోబర్ నాటికి అంతర్జాతీయ సరఫరా గొలుసు సాధారణ స్థితికి రాకపోతే, బంగ్లాదేశ్ వంటి దేశాలు కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టమవుతోంది.



## గల్ఫ్ దేశాలపై క్షిపణి దాడులు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఇరాన్ తన క్షిపణి , డ్రోన్ దాడులను తీవ్రతరం చేయడంతో యూఏఈ, కువైట్ వంటి దేశాల్లోని మౌలిక సదుపాయాలే లక్ష్యంగా మారాయి. అబుదాబిలోని గ్యాస్ ప్లాంట్‌పై జరిగిన తాజా క్షిపణి దాడిలో ఐదుగురు భారతీయులు గాయపడటం ఆందోళన కలిగిస్తోంది. యూఏఈ రాజధాని అబుదాబిలోని ఒక గ్యాస్ ప్లాంట్‌ను శుక్రవారం లక్ష్యంగా చేసుకుని ఇరాన్ క్షిపణులతో దాడుల వర్షం కురిపించింది. యూఏఈ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ వీటిని సకాలంలో గుర్తించి గాలిలోనే అడ్డుకున్నాయి. ఈ క్రమంలో క్షిపణి శకలాలు కిందపడటంతో మొత్తం 12 మంది గాయపడగా, వారిలో ఐదుగురు భారతీయులు, ఆరుగురు నేపాల్ పౌరులు ఉన్నట్లు అబుదాబి మీడియా కార్యాలయం ధృవీకరించింది. గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గత నెల 26న కూడా అబుదాబిలోని స్వీహాన్ ప్రాంతంలో జరిగిన ఇటువంటి ప్రమాదంలో ఒక భారతీయుడు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. వరుసగా జరుగుతున్న ఈ దాడులు గల్ఫ్ లో ఉన్న లక్షలాది మంది భారతీయ కార్మికుల భద్రతపై నీలి నీడలు కమ్ముకునేలా చేస్తున్నాయి. కువైట్‌లోని అతిపెద్ద చమురు శుద్ధి కర్మాగారంపై ఇరాన్ డ్రోన్లతో విరుచుకుపడటం అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌ను కలవరపెడుతోంది. కువైట్‌లోని చమురు కేంద్రమైన మీనా అల్అహ్మది రిఫైనరీపై ఇరాన్ డ్రోన్లతో దాడికి తెగబడింది. ప్రపంచంలోని అతిపెద్ద చమురు శుద్ధి కర్మాగారాల్లో ఒకటిగా పేరొందిన దీనిపై దాడి జరగడంతో అక్కడ భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ప్రకటించింది. అమెరికా స్థావరాలు , మిత్ర దేశాల ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టడమే లక్ష్యంగా ఇరాన్ తన దాడులను విస్తరిస్తోంది. హర్మూజ్ జలసంధి మూతపడటంతో ఈ తాజా దాడుల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరా వ్యవస్థ సంక్షోభంలో పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.



## యుద్ధ విమానం నుంచి దూకిన పైలట్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అమెరికాకు చెందిన అత్యాధునిక యుద్ధ విమానాన్ని నైరుతి ఇరాన్ ప్రాంతంలో కూల్చివేసినట్లు ఇరాన్ మీడియా ప్రకటింటింది. కూలిన విమానం నుంచి పైలట్ పారాచూట్ సహాయంతో క్షేమంగా కిందకు దూకినట్లు వార్తలు వస్తుండటంతో, పైలట్ ను పట్టుకునేందుకు ఇరాన్ సైన్యం , స్థానిక పౌరులు భారీ ఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. అమెరికా యుద్ధ విమానాలను ఒక్కొక్కటిగా నేలమట్టం చేస్తున్నామని ఇరాన్ చేస్తున్న ప్రకటనలతో అగ్రరాజ్యం వ్యూహాత్మక ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. ఇరాన్ ప్రభుత్వ అధికారిక ఛానెల్ ఐఆర్ఐబి ఈ ఘటనపై ప్రత్యేక కథనాలను ప్రసారం చేస్తూ, శత్రు పైలట్‌ను సజీవంగా పట్టుకుని అప్పగిస్తే భారీ బహుమతి అందజేస్తామని ప్రకటించింది. దీంతో వందలాది మంది పౌరులు తమ వ్యక్తిగత వాహనాల్లో ఘటనా స్థలానికి చేరుకుని పైలట్ కోసం వెతుకుతున్నారు. ఇరాన్ మీడియా కథనాల ప్రకారం, ఈ పోరులో అమెరికాకు చెందిన F-35 స్టెల్త్ ఫైటర్ జెట్ , బ్రిటన్‌లోని ఆర్ఏఎఫ్ లేకెన్‌హీత్ నుంచి వచ్చిన F-15E స్ట్రైక్ ఈగిల్ యుద్ధ విమానాలను ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ పేల్చివేసింది. దీనికి సంబంధించి విమాన తోక భాగం , ఇతర శకలాల చిత్రాలను కూడా ఇరాన్ విడుదల చేయడం గమనార్హం.ఇరాన్ చేస్తున్న ఈ ఆరోపణలను అమెరికా సెంట్రల్ కమాండ్ తీవ్రంగా ఖండించింది. తమ యుద్ధ విమానాలన్నీ క్షేమంగా ఉన్నాయని, ఏ ఒక్కటీ అదృశ్యం కాలేదని స్పష్టం చేసింది. గతంలోనూ ఇరాన్ ఇటువంటి తప్పుడు ప్రకటనలు అరడజను సార్లు చేసిందని సెంటకామ్ ఎద్దేవా చేసింది. ప్రస్తుతానికి పెంటగాన్ లేదా వైట్ హౌస్ నుంచి ఎటువంటి అధికారిక ధృవీకరణ రాలేదు.



# రాజధాని నిర్మాణం ఒక 'బేతాళ కథ'

**కడప(ఏడీఎన్ఎన్) :**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి రాజధాని అమరావతి నిర్మాణంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కడపలో మీడియాతో మాట్లాడిన ఆయన, అమరావతి అనేది కేవలం ఒక 'బేతాళ కథ' అని, రాజధాని పేరుతో లక్షల కోట్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. 2014లో 'దేవతల రాజధాని' నిర్మిస్తామంటూ మొదలుపెట్టిన ఈ ప్రాజెక్టు, వాస్తవానికి చంద్రబాబు నాయుడు భూ దోపిడీకి పాల్పడేందుకు సృష్టించిన వేదిక అని ఆయన మండిపడ్డారు. 50 వేల ఎకరాల భూమి కావాలని పట్టుబట్టి, బంగారు పంటలు పండే రైతుల భూములను దుర్మార్గంగా లాక్కున్నారని రాచమల్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.లక్ష ఎకరాల భూమిలో రాజధానిని నిర్మిస్తామని నోటిఫికేషన్ ఇచ్చి రైతులను వంచించారని ఆయన పేర్కొన్నారు. రెండు లక్షల కోట్ల వ్యయంతో రాజధాని నిర్మిస్తామన్న బాబు, గత ఏడేళ్లలో కేవలం 80 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని విమర్శించారు. ఈ వేగంతో వెళ్తే రాజధాని పూర్తి కావడానికి 200 ఏళ్లయినా సరిపోదని ఆయన ఎద్దేవా చేశారు. రాజధాని నిర్మాణం ఒక సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టు అని నమ్మబలికిన చంద్రబాబు, ఇప్పుడు వేల కోట్ల రూపాయల అప్పులు చేస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కుప్పకూలుస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే రాజధాని కోసం 47 వేల కోట్లు అప్పు చేశారని, ఇటీవలే మరో 13 వేల కోట్లు అప్పు తెచ్చారని ఆయన వివరించారు.నిర్మాణ వ్యయం విషయంలో కూడా భారీ అవినీతి జరుగుతోందని రాచమల్లు ధ్వజమెత్తారు. సాధారణంగా భవన నిర్మాణానికి చదరపు అడుగుకు 4 వేల రూపాయలు ఖర్చవుతుంటే, ప్రభుత్వం మాత్రం 14 వేల రూపాయలు ఖర్చు చేస్తోందని ఆరోపించారు. గత 22 నెలల కాలంలో ప్రజల పేరుతో ఏకంగా 3 లక్షల 41 వేల కోట్లు అప్పు చేశారని ఆయన విమర్శించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నన్ని రోజులు రాజధాని నిర్మాణం ఎప్పటికీ పూర్తి కాదని, ఆయన చెప్పే మాటలన్నీ కాలయాపన చేసే బేతాళ కథలేనని రాచమల్లు స్పష్టం చేశారు. కేవలం అప్పులు చేస్తూ ప్రజలపై భారం మోపడమే ఈ ప్రభుత్వ విధానమని ఆయన విమర్శించారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గందరగోళంలోకి నెట్టి, రాజధాని పేరుతో సాగిస్తున్న ఈ దోపిడీపై ఆంధ్రప్రదేశ్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఒక ప్రాంతం పేరు చెప్పి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టడం సరికాదని, ఈ పరిణామాలు భవిష్యత్తు తరాలకు శాపంగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాచమల్లు శివప్రసాద్ రెడ్డి చేసిన ఈ ఘాటు వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

# అనంతపురంలో నూతన మోడల్ పోస్టాఫీస్

**న్యూఢిల్లీ(ఏడీఎన్ఎన్) :**



అనంతపురం నగరంలోని పాతూరు ప్రాంతంలో శిథిలావస్థకు చేరిన పోస్టాఫీస్ భవనం స్థానంలో సరికొత్త 'మోడల్ పోస్టాఫీస్' నిర్మించాలని అనంతపురం లోక్‌సభ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఢిల్లీలో కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి అధికారికంగా వినతిపత్రం అందజేశారు. అనంతపురం పాతూరులోని పోస్టాఫీస్ భవనం బ్రిటీష్ కాలంలో, అంటే 1905వ సంవత్సరంలో నిర్మించబడింది. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ భవనం ప్రస్తుతం పూర్తిగా పాడైపోయి, వినియోగానికి ఏమాత్రం అనుకూలంగా లేదని ఎంపీ అంబికా కేంద్ర మంత్రికి వివరించారు. భవనం పైకప్పు పెచ్చులూడి పడుతుండటంతో అటు సిబ్బందికి, ఇటు వచ్చే ప్రజలకు ప్రమాదకరంగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఈ పోస్టాఫీస్ కేవలం పాతూరు ప్రజలకే కాకుండా, సమీపంలోని బుక్కరాయసముద్రం మండల ప్రజలకు కూడా ప్రధాన సేవా కేంద్రంగా ఉందని ఎంపీ పేర్కొన్నారు. వేలాది మంది ప్రజలు పెన్షన్లు, పొదుపు పథకాలు , ఇతర పోస్టల్ సేవల కోసం ఈ కార్యాలయంపైనే ఆధారపడి ఉన్నారని, భవనం సరిగా లేకపోవడం వల్ల సేవలు అందించడంలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ప్రస్తుత కాలంలో పోస్టాఫీసులు కేవలం ఉత్తరాల బట్వాడాకే పరిమితం కాకుండా, బ్యాంకింగ్ , డిజిటల్ సేవలను కూడా అందిస్తున్నాయని ఎంపీ అంబికా గుర్తు చేశారు. నేటి అవసరాలకు అనుగుణంగా, ఆధునిక వసతులు , బ్యాంకింగ్ వ్యవస్థకు తగ్గట్లుగా పాతూరులో 'మోడల్ పోస్టాఫీస్' భవనాన్ని నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అందజేసిన ప్రతిపాదనను కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సానుకూలంగా పరిశీలించారు. ప్రజలకు మెరుగైన పోస్టల్ సేవలు అందించేందుకు తన శాఖ తరపున తక్షణ చర్యలు తీసుకుంటానని, భవన నిర్మాణ ప్రక్రియను త్వరితగతిన పట్టాలెక్కించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు.

# ఏపీఎస్పీడీసీఎల్‌లో నకిలీ సర్టిఫికెట్ల కలకలం

**తిరుపతి (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్ర ప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్)లో నకిలీ విద్యార్హత పత్రాలతో ఉద్యోగాలు పొందిన వ్యవహారం కలకలం రేపింది. ఐటీఐ చదవకుండానే దొంగ సర్టిఫికెట్లు సమర్పించి షిఫ్ట్ ఆపరేటర్లుగా విధుల్లో చేరిన 69 మంది ఉద్యోగులపై ఏపీఎస్పీడీసీఎల్ ఉక్కుపాదం మోపింది. అంతర్గత విచారణలో వీరి అక్రమాలు స్పష్టంగా తేలడంతో, ఉన్నతాధికారులు సదరు సిబ్బందిని తక్షణమే విధుల్లోంచి తొలగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగాల కోసం అడ్డదారి తొక్కిన వీరిపై శాఖాపరమైన కఠిన చర్యలకు కూడా ఆదేశాలు అందాయి.ఈ భారీ తొలగింపు ప్రక్రియలో అత్యధికంగా కడప జిల్లాకు చెందిన వారే ఉండటం గమనార్హం. ఆ జిల్లా నుంచి ఏకంగా 38 మంది ఉద్యోగులు నకిలీ పత్రాలతో పట్టుబడగా, కర్నూలు జిల్లాలో 16 మందిపై వేటు పడింది. వీరితో పాటు చిత్తూరు , నెల్లూరు జిల్లాల్లో నలుగురు చొప్పున, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో ముగ్గురు చొప్పున, అన్నమయ్య జిల్లాలో ఒకరిని సర్వీసు నుంచి తొలగించారు. జిల్లాల వారీగా జరిగిన లోతైన తనిఖీల్లో ఈ నకిలీ సర్టిఫికెట్ల బాగోతం బట్టబయలైంది. నియామక ప్రక్రియ పూర్తయిన తర్వాత అభ్యర్థులు సమర్పించిన ఐటీఐ సర్టిఫికెట్లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించగా, అవి ఏ గుర్తింపు పొందిన విద్యాసంస్థ నుంచి జారీ కాలేదని నిర్ధారణ అయ్యింది. దీంతో విద్యుత్ శాఖ ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రవర్తించిన ఈ 69 మందిని తొలగించడమే కాకుండా, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.

# ఇరిగేషన్ అధికారులపై మంత్రి సీరియస్

**విజయవాడ(ఏడీఎన్ఎన్) :**



ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ అధికారుల తీరుపై మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడలో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కాలువల్లో తూడు, గుర్రపుడెక్క తొలగింపు , పూడికతీత పనులకు సంబంధించిన అంచనాల తయారీలో అధికారులు చూపుతున్న అలసత్వంపై మంత్రి మండిపడ్డారు. ఏప్రిల్, మే నెలల్లోనే పూర్తి చేయాల్సిన పనులకు సంబంధించి ఇప్పటి వరకు అంచనాలు రూపొందించకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని అధికారులను గట్టిగా హెచ్చరించారు. గత ప్రభుత్వం అనుసరించిన పాత పద్ధతులను ఇకపై సాగనివ్వబోమని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు. "గత ప్రభుత్వంలో ఏప్రిల్, మే నెలల్లో చేయాల్సిన పనులకు జూన్ నెలలో అనుమతులు ఇచ్చేవారు. ఇప్పుడు కూడా అదే తీరును కొనసాగిస్తామంటే కుదరదు," అని ఆయన హితవు పలికారు. అధికారులు తమ పని తీరును మార్చుకోవాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. ఆదివారం సాయంత్రంలోగా పెండింగ్‌లో ఉన్న అన్ని నియోజకవర్గాల అంచనాలను సమర్పించాలని సీఈలకు డెడ్ లైన్ విధించారు. ఒకవేళ గడువులోగా నివేదికలు ఇవ్వని పక్షంలో, సోమవారం నాడు అమరావతి సచివాలయానికి వచ్చి వ్యక్తిగతంగా సంజాయిషీ ఇచ్చుకోవాల్సి ఉంటుందని ఆయన కఠిన ఆదేశాలు జారీ చేశారు.రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని మంత్రి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. గత ఐదేళ్ల పాలనలో కాలువలకు సరైన మరమ్మతులు చేయకపోవడం వల్ల తూడు, గుర్రపుడెక్క పేరుకుపోయి సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అత్యవసర పనుల కింద నిధులను కేటాయించి, ప్రతి సాగు భూమికి, చివరి ఎకరం వరకు నీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. కాలువల మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, అధికారుల నిర్లక్ష్యం వల్ల ఏ ఒక్క రైతుకు నష్టం వాటిల్లినా సహించేది లేదని మంత్రి స్పష్టం చేశారు.ఈ కీలక సమావేశానికి ఈఎన్సీ నరసింహమూర్తితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చీఫ్ ఇంజనీర్లు ,నీటిపారుదల శాఖకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరికలతో ఇరిగేషన్ శాఖలో ఒక్కసారిగా కదలిక వచ్చింది. సోమవారానికి సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి రాకుండా ఉండేందుకు, క్షేత్రస్థాయి అధికారులు , సీఈలు యుద్ధ ప్రాతిపదికన పనుల అంచనాలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. రైతుల సాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, అధికారులు దానికి అనుగుణంగా వేగంగా స్పందించాలని మంత్రి ఆదేశించారు.

# కేసులకు భయపడను.. జైలు నుంచైనా ప్రశ్నిస్తా !

**మచిలీపట్నం(ఏడీఎన్ఎన్) :**



మచిలీపట్నంలో పేదల ఇళ్ల కూల్చివేతను అడ్డుకుని బాధితులకు అండగా నిలిచినందుకు తనపై , తన కుమారుడు పేర్ని కిట్టుపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడంపై మాజీ మంత్రి పేర్ని నాని తీవ్రంగా స్పందించారు. శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, ఈ కేసులు కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యల్లో భాగమేనని మండిపడ్డారు. పోలీసు వ్యవస్థలోని కొందరు అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా మారి నియంత పాలన సాగిస్తున్నారని, దోపిడీ దారులను నిలదీయడమే తమ కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టి జైల్లో వేసినా తన పోరాటం ఆగదని, అవసరమైతే జైలు లోపల నుంచైనా నిలదీస్తూనే ఉంటానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.పోలీసుల తీరుపై విరుచుకుపడిన పేర్ని నాని, యూనిఫాం వేసుకుని కూడా కొందరు అధికారులు బార్లలో మందు తాగుతూ రాజకీయ నాయకుల కాళ్ల దగ్గర పడి ఉంటున్నారని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడే అధికారులను ప్రశ్నిస్తే అది పోలీసు వ్యవస్థను కించపరచడం ఎలా అవుతుందని ఆయన నిలదీశారు. గతంలో కంకిపాడులో పేకాట ఆడిస్తూ సస్పెండ్ అయిన పరమేశ్వర్ వంటి వారు ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ప్రభుత్వం 'రెడ్ బుక్' రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని, అధికార దుర్వినియోగం చేస్తూ ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు.గతంలో మంత్రి కొల్లు రవీంద్ర పోలీసుల పట్ల అమర్యాదగా ప్రవర్తించినప్పుడు మౌనంగా ఉన్న అధికారులు, ఇప్పుడు తనపై కేసులు పెట్టడం విడ్డూరంగా ఉందని పేర్ని నాని విమర్శించారు. కుమ్మరిగూడెంలో పేదల ఇళ్లను కూల్చడానికి పోలీసులు ఏ ప్రాతిపదికన బందోబస్తు ఇచ్చారో చెప్పాలని, మున్సిపల్ కమిషనర్ సంతకం లేని ఫోర్జరీ లెటర్లతో హడావిడి చేస్తున్నారని ఆరోపించారు. అలాగే, పామర్రు పోలీస్ స్టేషన్‌లో ఒక దళిత యువతిని పోలీసులు దారుణంగా కొట్టారని, ఆ సీసీటీవీ ఫుటేజీని బహిర్గతం చేయాలని సవాల్ విసిరారు. ఒకవేళ ఆ యువతే పోలీసులను కొట్టినట్లు నిరూపిస్తే తాను క్షమాపణ చెబుతానని స్పష్టం చేశారు.తనపై హత్యాయత్నం జరిగితే ఇప్పటికీ ఆ కేసు ముందుకు సాగడం లేదని, కానీ ఆరేళ్ల క్రితం సోషల్ మీడియాలో పెట్టిన పాత పోస్టుల కోసం ఇప్పుడు అరెస్టులు చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. తనకు ఎవరైనా మేలు చేస్తే విశ్వాసంలో కుక్కతో పోటీపడతానని, అయితే తప్పుడు పనులు చేసే వారిని మాత్రం వదిలిపెట్టనని హెచ్చరించారు. పోలీసు అధికారులు వృత్తి ధర్మాన్ని మర్చిపోయి రాజకీయ నాయకుల కళ్లలో ఆనందం కోసం పని చేయడం మానుకోవాలని హితవు పలికారు. అక్రమ కేసులు కోర్టుల్లో నిలబడవని, చట్టం ముందు అందరూ సమానమేనని పేర్ని నాని పునరుద్ఘాటించారు.

# 11 కు పరిమితం చేసినా జగన్‌లో మార్పు రాలేదు

**విశాఖపట్నం(ఏడీఎన్ఎన్) :**



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రస్తుత వ్యవహారశైలిపై టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు తీవ్ర విమర్శలు గుప్పించారు. విశాఖపట్నంలో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, జగన్ మానసిక పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. రాజధాని విషయంలో గతంలో విశాఖను మాత్రమే ఏకైక రాజధానిగా చేస్తామని ఊదరగొట్టిన జగన్, ఇప్పుడు అకస్మాత్తుగా 'మావిగన్' (MAVIGUN) అంటూ కొత్త రాగం అందుకోవడం ఆయన అస్థిరతకు నిదర్శనమని మండిపడ్డారు. జగన్ తన మానసిక స్థితిని ఒక్కసారి పరిశీలించుకోవాలని, రాజధానిపై నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదని ఎద్దేవా చేశారు.రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి అంతా తానే చేశానని జగన్ చెప్పుకోవడంపై గంటా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో భోగాపురం ఎయిర్‌పోర్టును ఉద్దేశించి "ఎర్రబస్సు కూడా రాని చోట ఎయిర్ బస్సు ఎందుకు?," అని హేళన చేసిన జగన్, ఇప్పుడు ఆ ప్రాజెక్టును తానే తెచ్చానని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. అలాగే, నిన్నగాక మొన్న శంకుస్థాపన జరిగిన ప్రతిష్టాత్మక ఆర్సెలార్ మిత్తల్ కంపెనీ క్రెడిట్‌ను కూడా తన ఖాతాలో వేసుకోవాలని చూడటం జగన్ దివాళాకోరుతనానికి నిదర్శనమని విమర్శించారు. గత ఎన్నికల్లో ప్రజలు వైసీపీని కేవలం 11 సీట్లకే పరిమితం చేసినా జగన్‌లో మార్పు రాలేదని, ఇదే తీరు కొనసాగితే రాష్ట్రంలో ఆ పార్టీ కనుమరుగవ్వడం ఖాయమని హెచ్చరించారు.కూటమి ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్రకు మహర్దశ పడుతుందని గంటా శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు. ఈ నెలలోనే రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన జరగనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇది రాష్ట్ర ఐటీ రంగానికి పెద్ద ఊపునిస్తుందని పేర్కొన్నారు. జూన్ నెలలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం లాంఛనంగా ప్రారంభమై ప్రజలకు అందుబాటులోకి వస్తుందని, దీని వల్ల ఉత్తరాంధ్ర పారిశ్రామికంగా, ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని వివరించారు. ఎయిర్ పోర్టు ప్రారంభమయ్యాక ఈ ప్రాంతం రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అమరావతి రాజధాని బిల్లుకు పార్లమెంటులో మద్దతు పలికిన అన్ని రాజకీయ పార్టీలకు గంటా శ్రీనివాసరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అమరావతికి లభించిన ఈ చట్టబద్ధత ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు భరోసానిస్తుందని, రాజధాని నిర్మాణం ఇకపై శరవేగంగా జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. జగన్ ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ప్రజల ఆకాంక్ష అయిన అమరావతి విజయం సాధించిందని, ఇది ఐదు కోట్ల ఆంధ్రుల విజయమని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధిని అడ్డుకోవాలని చూసే వారికి ఈ పరిణామాలు గట్టి చెంపపెట్టు అని గంటా శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు.

# జెట్ స్పీడ్ తో మూలపేట పోర్టు పనులు

**శ్రీకాకుళం(ఏడీఎన్ఎన్) :**



శ్రీకాకుళం జిల్లాలోని ప్రతిష్టాత్మక మూలపేట పోర్టు నిర్మాణ పనులపై రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో నత్తనడకన సాగిన ఈ ప్రాజెక్టు పనులు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 'జెట్ స్పీడ్'తో దూసుకుపోతున్నాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చే ఈ పోర్టును రికార్డు సమయంలో పూర్తి చేస్తామని స్పష్టం చేస్తూ, పనుల ఆలస్యంపై వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలకు గణాంకాలతో సహా గట్టి కౌంటర్ ఇచ్చారు. మే 2024 నాటికి ఉన్న పరిస్థితిని, మార్చి 2026 నాటికి సాధించిన పురోగతిని పోల్చి చూపిస్తూ తమ ప్రభుత్వ చిత్తశుద్ధిని ఆయన చాటిచెప్పారు.ముఖ్యంగా పోర్టు రక్షణకు కీలకమైన బ్రేక్ వాటర్ నిర్మాణ పనుల్లో అనూహ్యమైన మార్పు వచ్చిందని మంత్రి వివరించారు. మే 2024 నాటికి దక్షిణ బ్రేక్ వాటర్ పనులు కేవలం 1750 మీటర్ల కోర్ ప్లేసింగ్‌తో నిలిచిపోగా, మార్చి 2026 నాటికి ఏకంగా 26.20 లక్షల మెట్రిక్ టన్నుల రాక్ ప్లేసింగ్ మరియు 47 వేలకు పైగా కాంక్రీట్ ఆర్మర్ పనులను పూర్తి చేశామని వెల్లడించారు. అలాగే ఉత్తర బ్రేక్ వాటర్ పనులను గతంలో జరిగిన స్వల్ప స్థాయి నుంచి మార్చి 2026 నాటికి 100 శాతం పూర్తి స్థాయికి తీసుకొచ్చామని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ వేగం గతానికి, ఇప్పటికీ ఉన్న తేడాకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.బెర్త్ పనులు, ఇతర మౌలిక సదుపాయాల విషయంలోనూ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అసలు ప్రారంభమే కాని కోల్ బెర్త్, క్యాంటీన్, కస్టమ్స్ బిల్డింగ్ , గేట్ కాంప్లెక్స్ వంటి ఆన్‌షోర్ ఇన్ఫ్రా పనులు ఇప్పుడు శరవేగంగా సాగి తుది దశకు చేరుకున్నాయని వివరించారు. జనరల్ కార్గో బెర్త్ పనుల్లో కూడా పైలింగ్ స్థాయి నుంచి స్లాబ్ పనుల వరకు వేగవంతమైన పురోగతిని సాధించామని ఆయన గణాంకాలను విడుదల చేశారు. దీనివల్ల పోర్టు కార్యకలాపాలు త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.పోర్టుకు కనెక్టివిటీని ఇచ్చే ఎక్స్టర్నల్ రోడ్, రైలు మార్గాలు ,వాటర్ సప్లై పనుల్లోనూ రికార్డు స్థాయి పురోగతి నమోదైందని అచ్చెన్నాయుడు వెల్లడించారు. మే 2024 నాటికి నామమాత్రంగా ఉన్న ఎక్స్టర్నల్ రోడ్ పనులు ఇప్పుడు 30 శాతానికి పైగా పూర్తయ్యాయని, గతంలో సున్నాగా ఉన్న రైల్ ఎంబ్యాంక్మెంట్ , 20 కిలోమీటర్ల మేర పైపులైన్ పనులను పట్టాలెక్కించామని చెప్పారు. తమది మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వమని నిరూపిస్తూ.. ఇచ్చిన మాట ప్రకారం మూలపేట పోర్టును అందుబాటులోకి తెచ్చి ఉత్తరాంధ్ర నిరుద్యోగులకు భారీగా ఉపాధి కల్పిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు పునరుద్ఘాటించారు.



# చట్టబద్ధత చూసి డిప్రెషన్‌లోకి జగన్

**విజయవాడ(ఏడీఎన్ఎన్) :**

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం తర్వాత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మానసిక స్థితి అస్థిరంగా మారిందని బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్ తీవ్ర విమర్శలు చేశారు. విజయవాడలో ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన డప్పు కళాకారుల రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజధాని అమరావతికి పార్లమెంటులో లభించిన చట్టబద్ధతను చూసి జగన్ తీవ్రమైన 'డిప్రెషన్'లోకి వెళ్లారని ఎద్దేవా చేశారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే అది చూసి ఓర్వలేక జగన్ అసత్య ప్రచారాలకు దిగుతున్నారని మండిపడ్డారు.రాజధాని అంశంపై జగన్ ఇటీవల ప్రస్తావించిన 'మావిగన్' (MAVIGUN) ప్రతిపాదనను మాధవ్ ఒక అర్థం లేని రాగంగా అభివర్ణించారు. అమరావతికి చట్టబద్ధత రావడం జగన్‌కు అస్సలు మింగుడుపడటం లేదని, అందుకే ఏమాత్రం అర్థం లేకుండా ఇలాంటి కొత్త రాగాలు అందుకుంటున్నారని విమర్శించారు. జగన్ చేస్తున్న అవాకులు చవాకులే ఆయన అస్థిర మానసిక స్థితికి నిదర్శనమని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ హయాంలో జరుగుతున్న రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవాలని చూసే జగన్ ప్రయత్నాలు ఇకపై సాగవని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.అమరావతి రాజధాని చట్టబద్ధత బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందడం పట్ల మాధవ్ హర్షం వ్యక్తం చేస్తూ, ఇది ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు ఒక బలమైన పునాది అని పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయానికి సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా , ఇతర కేంద్ర నాయకత్వానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అమరావతి నిర్మాణం ఇకపై శరవేగంగా జరుగుతుందని మాధవ్ పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో ఎస్సీ మోర్చా నాయకులు, కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీఆర్ నాయుడిని తక్షణమే తొలగించాలి

**తాడేపల్లి(ఏడీఎన్ఎన్) :**



వైసీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ ముఖ్య నేతలతో తాడేపల్లిలో శుక్రవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. తిరుమల పవిత్రత రోజురోజుకీ దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేస్తూ, టీటీడీ ఛైర్మన్‌గా ఉన్న బీఆర్ నాయుడిని ఆ పదవి నుంచి తక్షణమే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం భక్తుల మనోభావాలను బేఖాతరు చేస్తోందని విమర్శించిన సజ్జల, ఈ డిమాండ్‌తో శనివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దేవాలయాల పవిత్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.రాజధాని అంశంపై వైసీపీకి స్పష్టమైన వైఖరి ఉందని సజ్జల పునరుద్ఘాటించారు. అమరావతి పేరుతో చంద్రబాబు శాశ్వతంగా దోచుకోవాలనే ప్రయత్నం చేస్తున్నారని, అక్కడ పెడుతున్న ఖర్చు , అప్పులు రాష్ట్రంపై తీరని భారంగా మారుతున్నాయని మండిపడ్డారు. దీనికి ప్రత్యామ్నాయంగా జగన్ మోహన్ రెడ్డి ఆలోచనల ప్రకారం, మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు ప్రాంతాలను కలిపి ఒక 'గ్రోత్ కారిడార్'గా, మెగా సిటీగా అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. ఈ 'ప్లాన్‌బి' ద్వారా తక్కువ ఖర్చుతోనే నిజమైన రాజధాని సాధ్యమవుతుందని, ఈ విషయాన్ని గ్రామస్థాయి వరకు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులకు సూచించారు. ఓటర్ల జాబితా , సభ్యత్వ నమోదు ప్రక్రియపై సజ్జల ప్రత్యేక దృష్టి సారించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటర్ల జాబితాలో జరిగే మార్పులు చేర్పులపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బీఎల్‌వోలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేస్తూ కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను జాగ్రత్తగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పార్టీలో 18 లక్షల క్రియాశీల సభ్యత్వమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే 13 లక్షల మంది డేటా అందిందని తెలిపారు. త్వరలోనే వీరందరికీ ఐడీ కార్డులు పంపిణీ చేస్తామని, సోషల్ మీడియా వేదికగా పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని పేర్కొన్నారు.ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో పార్టీ నేతలు ఐక్యంగా ముందుకు సాగాలని సజ్జల పిలుపునిచ్చారు. పార్టీ కమిటీల నిర్మాణం దాదాపు పూర్తవుతోందని, గ్రామస్థాయి నుంచి సోషల్ మీడియా వరకు క్యాంపెయినింగ్ పెంచడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు. అధికార పక్షం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలని, పార్టీ శ్రేణులు నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలపై పోరాడాలని ఆయన సూచించారు.

# 'మావిగన్' ప్రతిపాదనతో టీడీపీలో వణుకు

**తాడేపల్లి(ఏడీఎన్ఎన్) :**



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రస్తావించిన 'మావిగన్' గ్రోత్ కారిడార్ ప్రతిపాదన అధికార కూటమిలో, ముఖ్యంగా టీడీపీలో వణుకు పుట్టిస్తోందని మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యానించారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.అమరావతి రాజధాని నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొందని అంబటి విమర్శించారు. "అమరావతిలో కేవలం రూ. 2 లక్షల కోట్లతో రోడ్లు వేయడం తప్ప, అక్కడ ఒక సంపూర్ణమైన నగరం ఏర్పడే అవకాశం లేదు. ఈ క్రమంలోనే జగన్ మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, కలుపుతూ 'మావిగన్' అనే గ్రోత్ కారిడార్‌ను ప్రస్తావించారు. ఈ ప్రతిపాదనపై ఇప్పుడు ప్రజలు కూడా సీరియస్‌గా ఆలోచన చేస్తున్నారు," అని ఆయన పేర్కొన్నారు. జగన్ ప్రవేశపెట్టిన ఈ కొత్త ఆలోచన ప్రజల్లోకి బలంగా వెళ్తుండటంతో టీడీపీ నాయకులు భయపడుతున్నారని అంబటి ఆరోపించారు. రాజధాని పేరుతో సాగుతున్న కాలయాపన కంటే, ఇప్పటికే అభివృద్ధి చెందిన నగరాలను అనుసంధానం చేస్తూ గ్రోత్ కారిడార్ నిర్మించడమే వాస్తవానికి దగ్గరగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సరికొత్త అభివృద్ధి నమూనాను చూసి తట్టుకోలేకే అధికార పక్షం విమర్శలకు దిగుతోందని మండిపడ్డారు.రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జగన్ చేసిన ఈ ప్రతిపాదన రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయాల్లో మరిన్ని మార్పులకు సంకేతమని అంబటి రాంబాబు స్పష్టం చేశారు.



# మళ్ళీ మేమే వస్తాం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

తెలంగాణ రాజకీయాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గాంధీ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ తన ఉనికిని పూర్తిగా కోల్పోయిందని, అలాగే బీజేపీకి ఇక్కడ ఏమాత్రం స్థానం లేదని ధ్వజమెత్తారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా, ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న నమ్మకం చెక్కుచెదరలేదని, ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ రాష్ట్రంలో ఇప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసి, 100కు పైగా సీట్లు సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ పార్టీ అంతర్గత కలహాలతో కొట్టుమిట్టాడుతోందని మహేశ్ గౌడ్ విమర్శించారు. ముఖ్యంగా కేసీఆర్ కుటుంబంలో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయని, కవిత వేరు కుంపటి పెట్టుకోవడంతో ఆ పార్టీ పరిస్థితి రోడ్డున పడిందని ఎద్దేవా చేశారు. పార్టీలో కేటీఆర్, హరీశ్ రావు మధ్య ఆధిపత్య పోరు సాగుతోందని, మాజీ సీఎం కేసీఆర్ రాజకీయాలకు దూరమై కేవలం తన ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని ఆరోపించారు. ఒకప్పుడు అధికారంలో వెలిగిన పార్టీ ఇప్పుడు ముక్కలు ముక్కలై ఖాళీ అవుతోందని ఆయన విశ్లేషించారు.మరోవైపు బీజేపీ తీరుపై కూడా ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా దేవుళ్ల పేరు చెప్పి ఓట్లు అడగడమే ఆ పార్టీ నైజమని, ఈ విషయాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మతపరమైన రాజకీయాలను ప్రజలు తిరస్కరిస్తున్నారని, అందుకే బీజేపీకి రాష్ట్రంలో చోటు లేదని స్పష్టం చేశారు. కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, రాబోయే రోజుల్లో తమ పార్టీ మరింత పటిష్టంగా ఎదుగుతుందని మహేశ్ కుమార్ గౌడ్ పునరుద్ఘాటించారు.



## ఆ బిల్లు ఆమోదం
# చరిత్రాత్మకం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

ప్రధాని నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో దేశం విశ్వసనీయమైన, ప్రజానుకూల పాలన దిశగా శరవేగంగా అడుగులు వేస్తోందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు కొనియాడారు. పార్లమెంటులో తాజాగా 'జన్ విశ్వాస్ బిల్లు2026' ఆమోదం పొందడం ఒక చారిత్రాత్మక ఘట్టమని ఆయన అభివర్ణించారు. ఈ బిల్లు ద్వారా పౌరులు, వ్యాపారవేత్తలపై ఉన్న అనవసరమైన చట్టపరమైన భారాన్ని మోదీ ప్రభుత్వం తొలగించిందని ఆయన తన ఫేస్‌బుక్ వేదికగా పేర్కొన్నారు. సుమారు 79 కేంద్ర చట్టాల్లోని 784 నిబంధనలను సవరించడం ద్వారా, గతంలో నేరాలుగా పరిగణించబడే 1000కి పైగా చిన్నపాటి ఉల్లంఘనలను నేరాల జాబితా నుంచి తొలగించినట్లు రామచందర్ రావు వివరించారు. దీనివల్ల సామాన్య పౌరులతో పాటు వ్యవస్థాపకులకు కూడా పెద్ద ఊరట లభిస్తుందని, కోర్టులపై అనవసర కేసుల భారం తగ్గుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేస్తూ , ప్రజల జీవన సౌలభ్యాలను మెరుగుపరచడంలో ఈ నిర్ణయం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈ విప్లవాత్మక నిర్ణయం 'వికసిత్ భారత్' సంకల్పాన్ని మరింత బలోపేతం చేసే దిశగా వేసిన గొప్ప ముందడుగు అని రామచందర్ రావు ప్రశంసించారు. పాతకాలపు కఠిన చట్టాల స్థానంలో నమ్మకంతో కూడిన పాలనను తీసుకురావడమే బీజేపీ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## మందుబాబులపై
# యుద్ధం ఎఫెక్ట్

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :



మిడిల్ ఈస్ట్ లో కొనసాగుతున్న యుద్ధ పరిణామాలు భారతీయ మద్యం రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. అంతర్జాతీయంగా సరఫరా వ్యవస్థలో తలెత్తిన ఆటంకాలు, ముఖ్యంగా గ్యాస్ కొరత కారణంగా ఈ వేసవిలో మద్యం ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. భారత్ తన సహజవాయువు అవసరాల కోసం దాదాపు 40 శాతం వరకు ఖతార్‌పైనే ఆధారపడుతోంది. అయితే యుద్ధం కారణంగా గ్యాస్ సరఫరాకు ఆటంకం ఏర్పడటంతో, మద్యం బాటిళ్లను తయారు చేసే గాజు ఫర్నేస్ (కొలిమి)లను మండించడం కంపెనీలకు భారంగా మారింది. దీనివల్ల గాజు బాటిళ్ల తయారీ ఖర్చు ఇప్పటికే 15 నుంచి 20 శాతం వరకు పెరిగినట్లు అంచనా.మద్యం తయారీలో ముడి సరుకు కంటే ప్యాకేజింగ్ ఖర్చే ఇప్పుడు కంపెనీలకు ప్రధాన సమస్యగా మారింది. సాధారణంగా బీర్ తయారీ ఖర్చులో ప్యాకేజింగ్ వాటా 40 శాతం ఉండగా, విస్కీ, బ్రాండీ వంటి స్పిరిట్స్ లో ఇది 20 శాతం వరకు ఉంటుంది. గ్యాస్ ధరలు పెరగడం, షిప్పింగ్ చార్జీలు తోడవడంతో మద్యం బాటిళ్ల ఉత్పత్తిపై నేరుగా ప్రభావం పడుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో గాజు బాటిళ్ల ధరలు పెరగడమే కాకుండా, అల్యూమినియం ధరలు కూడా 15 శాతం వరకు పెరగడం మద్యం పరిశ్రమను ఆందోళనకు గురి చేస్తోంది. దీంతో ఈ అదనపు భారాన్ని తగ్గించుకోవడానికి మద్యం ధరలను కనీసం 10 నుంచి 15 శాతం వరకు పెంచాలని తయారీ కంపెనీలు భావిస్తున్నాయి.ఒకవేళ గ్యాస్ సరఫరాలో ఇబ్బందులు ఇలాగే కొనసాగితే, వేసవిలో పెరిగే డిమాండ్‌కు సరిపడా బాటిళ్ల సరఫరా ఉండకపోవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గాజు ఫర్నేస్‌లు పూర్తి సామర్థ్యంతో పని చేయకపోతే బాటిళ్ల కొరత ఏర్పడి, మార్కెట్‌లో మద్యం లభ్యత కూడా తగ్గే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలు అసోసియేషన్లు ధరల పెంపునకు మొగ్గు చూపుతుండటంతో, ఈ వేసవిలో చల్లగా చిల్ అవుదామనుకునే మద్యం ప్రియుల జేబులకు చిల్లు పడటం ఖాయంగా కనిపిస్తోంది. యుద్ధం ఎక్కడో జరుగుతున్నా, దాని ప్రభావం మాత్రం ఇక్కడి మందుబాబుల మాడు పగలగొట్టేలా ఉండటం గమనార్హం.

# రాష్ట్రంలో పాడి పరిశ్రమ బలోపేతమే లక్ష్యం

## ఎన్డీడీబీ చైర్మన్‌తో కీలక భేటీ



హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని ముఖ్యమంత్రి నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ చైర్మన్ డాక్టర్ మీనేష్ షా, మదర్ డెయిరీ ఢిల్లీ చైర్మన్ జయతీర్థా చారి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో తెలంగాణ రాష్ట్రంలో పాడి పరిశ్రమను మరింత బలోపేతం చేయడం, పాడి రైతుల సంక్షేమం కోసం చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై లోతుగా చర్చించారు. రాష్ట్రంలో డెయిరీ రంగాన్ని విస్తరించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ఎలా మెరుగుపరచవచ్చనే అంశాలపై ముఖ్యమంత్రి వారికి దిశానిర్దేశం చేశారు.ఈ కీలక సమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ మరియు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతో పాటు రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తిని పెంచడానికి అవసరమైన సాంకేతిక సహకారం, మౌలిక సదుపాయాల కల్పనపై ఎన్డీడీబీ చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ప్రాధాన్యతలను అనుసరించి పాడి పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ ఇలంబర్తి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి కూడా పాల్గొని రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులను, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. పాడి రైతులకు మద్దతు ధరతో పాటు మార్కెటింగ్ సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా తెలంగాణను పాల ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# ఎస్టీల సంక్షేమంపై కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :



గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్టీ కార్పొరేషన్ ద్వారా వేల కోట్ల రూపాయల నిధులను వెచ్చించి గిరిజనుల అభ్యున్నతికి కృషి చేసిందని మాజీ మంత్రి హరీశ్ రావు గుర్తు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని తిమ్మారెడ్డి పల్లిలో శుక్రవారం పర్యటించిన మాజీ మంత్రి హరీశ్ రావు, రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కనీసం విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను కూడా విడుదల చేయడం లేదని ఆక్షేపించారు. కేవలం ఓట్ల కోసమే గిరిజనులను వాడుకుంటున్నారని, వారి సంక్షేమాన్ని గాలికొదిలేశారని ఆయన మండిపడ్డారు.ప్రభుత్వం ప్రకటించిన హామీలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు పొంతన లేదని హరీశ్ రావు విమర్శించారు. ముఖ్యంగా సంత్ సేవాలాల్ కార్పొరేషన్‌కు వంద కోట్ల రూపాయలు కేటాయిస్తున్నట్లు ప్రకటించి, ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విదిల్చలేదని ధ్వజమెత్తారు. ఎస్టీల ఓట్లు కావాలి కానీ, వారి అభివృద్ధికి నిధులు ఇవ్వరా అని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడిందని, ప్రజలు తమ హక్కుల కోసం ఎదురుచూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇతర రాష్ట్రాల్లో చేస్తున్న ప్రచారాన్ని హరీశ్ రావు తప్పుబట్టారు. కేరళ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న ముఖ్యమంత్రి, తెలంగాణలో ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేశామని అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ఇక్కడ పథకాలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, బయట రాష్ట్రాల్లో బడాయి మాటలు చెప్పడం రేవంత్ రెడ్డికే చెల్లిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన స్పష్టం చేశారు.తెలంగాణలో వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో, రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గత ప్రభుత్వం రైతు బంధు వంటి పథకాలతో రైతాంగాన్ని ఆదుకుంటే, ప్రస్తుత ప్రభుత్వం రైతు భరోసా అమలులో జాప్యం చేస్తోందని విమర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేసి, అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోకుండా చూడాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలని ఆయన కోరారు.చివరగా, ఐఏఎస్ అధికారుల కుటుంబ సభ్యులు డ్రగ్స్ కేసుల్లో పట్టుబడటం వంటి అంశాలను ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పాలనపై దృష్టి సారించకుండా కేవలం రాజకీయ ప్రచారాలకే పరిమితం కావడం సరికాదని హితవు పలికారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధి చూపకపోతే భవిష్యత్తులో ప్రజలే గుణపాఠం చెబుతారని హరీశ్ రావు హెచ్చరించారు.

# ఇక్కడ ఏం చేశారని అక్కడ గొప్పలు?

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :



కేరళ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారతీయ జనతా పార్టీపై చేసిన విమర్శలను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్‌లో మీడియాతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ , రేవంత్ రెడ్డి కేరళ వేదికగా బీజేపీపై అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో అధికారంలోకి రావడానికి ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏ మేరకు అమలు చేసిందో సమాధానం చెప్పాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సొంత రాష్ట్రంలో హామీలను నెరవేర్చకుండా, పొరుగు రాష్ట్రానికి వెళ్లి అబద్ధపు ప్రచారాలు చేయడం సరికాదని ఆయన హితవు పలికారు.గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఏ విధంగానైతే ప్రజలను మాటలతో మభ్యపెట్టారో, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో పయనిస్తున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. ముఖ్యంగా వెనుకబడిన తరగతుల సంక్షేమం విషయంలో కాంగ్రెస్ పార్టీకి మాట్లాడే నైతిక హక్కు లేదని ఆయన స్పష్టం చేశారు. "బీసీలకు బీజేపీ అన్యాయం చేసిందని మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి, అసలు కాంగ్రెస్ పార్టీ గత దశాబ్దాలుగా బీసీలకు ఏంచేసిందో చెప్పగలరా?" అని నిలదీశారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడకుండా కాలయాపన చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు.రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు అమలు కాక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, కేరళలో మాత్రం అన్నీ పూర్తి చేశామని రేవంత్ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. భవిష్యత్తులో తెలంగాణలో కూడా ఇలాగే అబద్ధపు లెక్కలు చెప్పి ప్రజలను మరోసారి మోసం చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు అడ్డుతగులుతూ, రాజకీయ లబ్ధి కోసం రాష్ట్ర ప్రయోజనాలను కాంగ్రెస్ పక్కన పెడుతోందని ఆయన ఆరోపించారు.

# ఎక్సైజ్ కానిస్టేబుళ్లకు జగ్గారెడ్డి బాసట

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :



ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు తమ సొంత జిల్లాల్లో పని చేయకూడదనే నిబంధనను వెంటనే ఎత్తివేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు . ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేకంగా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఐదు రోజుల క్రితం ఎక్సైజ్ శాఖ జారీ చేసిన కొత్త నిబంధనల వల్ల క్షేత్రస్థాయి ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, కింది స్థాయి సిబ్బందిపై ఇలాంటి పరిమితులు విధించడం సరైంది కాదని ఆయన అభిప్రాయపడ్డారు.సంగారెడ్డి జిల్లాకు చెందిన సుమారు 150 మంది ఎక్సైజ్ సిబ్బంది తనను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారని జగ్గారెడ్డి తెలిపారు. ఈ నిబంధన అమలైతే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3 వేల మంది కానిస్టేబుళ్లు, వారి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రెండేళ్లలో పదవీ విరమణ చేయబోయే హెడ్ కానిస్టేబుళ్లకు కూడా ఈ నిబంధన వర్తింపజేయడం వల్ల వారు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, పిల్లల చదువులపై కూడా ఇది తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. మానవతా దృక్పథంతో ఈ '8 ఎఫ్' నిబంధనను వెంటనే తొలగించి, ఎవరికీ ఇబ్బంది కలగకుండా బదిలీలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# బకాయిలు చెల్లించకుంటే రాళ్లతో కొట్టిస్తాం



హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల విడుదలపై రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు కలిసి పేద విద్యార్థుల చదువుపై కుట్ర చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కావాలనే దురుద్దేశంతోనే ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదని ఆయన ఆరోపించారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే మంత్రులు, ఎమ్మెల్యేలను రోడ్లపై తిరగనివ్వబోమని, ప్రజలతో కలిసి రాళ్లతో కొట్టిస్తామని ఆయన హెచ్చరించారు.దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేద విద్యార్థుల కోసం ఎంతో ముందుచూపుతో ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టారని కృష్ణయ్య గుర్తు చేశారు. అప్పట్లో వేల కోట్లలో ఉన్న బకాయిలను నేటి ప్రభుత్వం కేవలం పన్నెండు కోట్లకు పరిమితం చేయడం దారుణమని ధ్వజమెత్తారు. రాష్ట్ర ఖజానాను అందరూ కలిసి దోచుకుంటున్నారని, కానీ పేద విద్యార్థుల చదువు కోసం నాలుగైదు వేల కోట్లు కేటాయించడానికి మనసు రావడం లేదని విమర్శించారు. తాము ఈ అంశంపై వందలాది సార్లు ధర్నాలు, పోరాటాలు చేశామని, ఇప్పటికీ ప్రభుత్వం మొండివైఖరి వీడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఫీజు రీయింబర్స్ మెంట్ వంటి కీలక అంశంపై ప్రతిపక్షాలు సరైన రీతిలో స్పందించలేదని, కనీసం వాకౌట్ కూడా చేయకపోవడం శోచనీయమని కృష్ణయ్య వ్యాఖ్యానించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ప్రభుత్వ తీరును నిరసిస్తూ తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఫీజులు చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీనివల్ల వేలాది మంది విద్యార్థులు పైచదువులకు మరియు ఉద్యోగాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



# రెండేళ్లకే వ్యతిరేకత

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

తెలంగాణ రాజకీయాల్లో సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. జగిత్యాలలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో కేసీఆర్ పాలన పోవాలని ప్రజలు ఎలాగైతే మార్పు కోరుకున్నారో, ఇప్పుడు రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనలోనే అటువంటి పరిస్థితి మళ్లీ వచ్చిందని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన తర్వాత ఆయన చేసిన ఈ విమర్శలు రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తున్నాయి. పార్టీలో తన ఎదుగుదలను అడ్డుకోవడానికే నామినేటెడ్ పదవుల భర్తీలో జాప్యం చేశారని ఆయన నేరుగా ఆరోపించారు.కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యాన్ని జీవన్ రెడ్డి ఎండగట్టారు. కాళేశ్వరంపై జరుగుతున్న చర్చలు కేవలం రాజకీయ విమర్శలకే పరిమితమయ్యాయని, క్షేత్రస్థాయిలో మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీల మరమ్మతులకు ప్రభుత్వం పూనుకోవడం లేదని మండిపడ్డారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక ఇచ్చినప్పటికీ, కేవలం 500 కోట్ల రూపాయలతో పూర్తయ్యే పనులను ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. బడ్జెట్‌లో కేవలం 152 కోట్ల రూపాయల కేటాయింపులు చూస్తుంటే ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యమని అర్థమవుతోందని విమర్శించారు.తెలంగాణకు జీవనాధారమైన కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడుకోకపోతే రాష్ట్రం ఎడారిగా మారే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. హైదరాబాద్ నగరానికి తాగునీరు, పారిశ్రామిక అవసరాలు మరియు మూసీ ప్రక్షాళన వంటి కీలకమైన అంశాలన్నీ మేడిగడ్డ పునరుద్ధరణతోనే ముడిపడి ఉన్నాయని గుర్తు చేశారు. ప్రాణహిత నది జలాలను సద్వినియోగం చేసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని, సరైన డిజైన్ కూడా రూపొందించలేకపోవడం శోచనీయమని అన్నారు. వెంటనే బ్యారేజీల పునరుద్ధరణ పనులు చేపట్టకపోతే 18 లక్షల ఎకరాల ఆయకట్టు ఎండిపోయే అవకాశం ఉందని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.జీవన్ రెడ్డి తన భవిష్యత్తు రాజకీయ నిర్ణయాలపై స్పందిస్తూ, ప్రజాసేవలో కొనసాగాలంటే ఏదో ఒక పార్టీలో ఉండాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.



## రైతు ఆనందం
# అందులోనే ఉంది

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

రైతు ఆనందం కేవలం తన సంపాదనలోనే ఉండదని, ఎదుటివారి ఆకలి తీర్చడంలోనే అసలైన తృప్తి ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా రైతు సంక్షేమంపై ఆయన శుక్రవారం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సమాజానికి వెన్నెముకగా నిలిచి అందరి కడుపు నింపుతున్న అటువంటి రైతన్నను కాపాడుకోవడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని కేటీఆర్ స్పష్టం చేశారు. స్వతంత్ర భారత దేశపు 75 ఏళ్ల చరిత్రలో ఏ నాయకుడూ ఆలోచించని విధంగా, కేసీఆర్ ఒక గొప్ప పథకాన్ని రూపొందించారని కొనియాడారు.రైతుబంధు పథకం ఒక విప్లవాత్మకమైన ముందడుగని , ఇది రైతు వర్గాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే కాకుండా వారి జీవితాల్లో వెలుగులు నింపిందని ఆయన వివరించారు. పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలకు నేరుగా ఆర్థిక సహాయాన్ని అందిస్తూ, ఈ పథకం వారిని సాధికారత వైపు నడిపించిందని కేటీఆర్ తన ఫేస్‌బుక్ ఖాతాలో పేర్కొన్నారు.



## ఐఏఎస్ కుమారుడికి
# 'డ్రగ్ పాజిటివ్'

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

కొండాపూర్‌లోని 'క్వాక్ ఎరీనా' పబ్‌పై సైబరాబాద్ పోలీసులు శుక్రవారం మెరుపు దాడులు నిర్వహించారు . ఈ దాడుల్లో ఒక ఉన్నత స్థాయి మహిళా ఐఏఎస్ అధికారి కుమారుడు డ్రగ్స్ పార్టీలో పట్టుబడటం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పబ్‌లో సోదాలు నిర్వహించిన పోలీసులు, అక్కడ ఉన్న సుమారు 64 మంది అనుమానితులకు తక్షణమే డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా, సదరు మహిళా ఐఏఎస్ కుమారుడికి డ్రగ్స్ వినియోగించినట్లు 'పాజిటివ్' అని తేలింది. శాస్త్రీయంగా నిర్ధారణ కావడంతో పోలీసులు అతడిని వెంటనే అదుపులోకి తీసుకున్నారు.ఈ వ్యవహారంపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారణ అయిన ఐఏఎస్ కుమారుడితో పాటు మరో ఏడుగురిని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వీరిపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. సమాజంలో బాధ్యతాయుతమైన హోదాలో ఉన్న వారి పిల్లలే ఇలాంటి వ్యసనాలకు బానిసవ్వడం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఉన్నత స్థాయి కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో ఈ కేసు ఇప్పుడు రాజకీయ, అధికార వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.నిబంధనలను తుంగలో తొక్కి డ్రగ్స్ పార్టీలు నిర్వహిస్తున్న పబ్ యాజమాన్యాలపై పోలీసులు సీరియస్ అయ్యారు. క్వాక్ ఎరీనా పబ్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలో డ్రగ్స్ రహిత వాతావరణం కల్పించేందుకు ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు. ఐఏఎస్ అధికారి కుమారుడి అరెస్టుతో ఈ డ్రగ్స్ రాకెట్ వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో విచారణ ముమ్మరం చేశారు.

## రాశి ఫలాలు

**04-04-2026 శనివారం**

**మేషం:**
ఉద్యోగంలో అనుకూల వాతావరణం ఉంటుంది. వృత్తి, వ్యాపారాల్లో లాభాలు అందుకుంటారు. ఆస్తి, ఆర్థిక వ్యవహారాల మీద దృష్టి పెడతారు. ముఖ్యమైన వ్యక్తిగత సమస్య ఒకటి పరిష్కారం అవుతుంది.ఆర్థికపరిస్థితి బాగా మెరుగ్గా ఉంటుంది.వృథా ఖర్చులు తగ్గించుకోవడం మంచిది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

**వృషభం:**
వృత్తి, ఉద్యోగాల్లో మీ ప్రతిభకు, శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. ముఖ్యమైన వ్యవహారాల్లో కుటుంబ సహాయాన్ని కూడా తీసుకోవడం మంచిది. వ్యాపారాల్లో అంచనాలను మించి లాభాలు అందుకుం టారు. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.

**మిథునం:**
వృత్తి, వ్యాపారాల్లో కార్యకలాపాలు బాగా పెరుగుతాయి. ఆస్తి వివాదాలు సానుకూలంగా చక్కబడతాయి. కొద్దిపాటి అనారోగ్య సమస్యలున్నా ముఖ్యమైన పనుల్ని పట్టు దలగా పూర్తి చేస్తారు. వ్యక్తిగత సమస్యలకు సరైన పరిష్కారం లభిస్తుంది. ఆర్థిక పరిస్థితి బాగానే ఉంటుంది.

**కర్కాటకం:**
ఉద్యోగంలో లక్ష్యాలు, బాధ్యతలను సంతృప్తికరంగా పూర్తి చేస్తారు. వ్యాపారంలో మరింత మెరుగైన పరిస్థితు లుంటయి. రావలసిన డబ్బు చేతికి అందుతుంది. మొండి బాకీలు వసూలవుతాయి. ఎక్కువగా దైవ కార్యాల్లో పాల్గొంటారు. సమాజంలో ఉన్నతస్థాయి వ్యక్తులతో పరిచయాలు ఏర్ప డతాయి.

**సింహం:**
వృత్తి, వ్యాపారాల్లో శుభ పరిణామాలు చోటు చేసుకుంటాయి. ధనపరంగా అనుకూల వాతావరణం ఉంటుంది. కొన్ని వ్యక్తిగత సమస్యలు ఇబ్బంది కలిగిస్తాయి. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా మంచిది. నిరుద్యోగులు అనుకున్నది సాధిస్తారు. ఆదాయం బాగానే ఉంటుంది. ఖర్చులు పెరుగుతాయి.

**కన్య:**
వృత్తి, ఉద్యోగాల్లో పదోన్నతులకు అవకాశం ఉంది. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. నిరుద్యో గులకు ఆశించిన ఆఫర్లు అందుతాయి.కుటుంబసభ్యులతోకలిసిదైవదర్శనాలుచేసుకుంటారు. ఆర్థిక, వ్యక్తిగత సమస్యల నుంచి చాలావరకు బయటపడతారు.

**తుల:**
జీతభత్యాల విషయంలో ఉద్యోగులకు శుభ వార్తలు అందుతాయి. వృత్తి, వ్యాపారాలు ప్రోత్సాహ కరంగా సాగుతాయి. కొందరు ఇష్టమైన బంధుమిత్రులతో కాలక్షేపం చేస్తారు. నిరుద్యోగుల ప్రయ త్నాలు సక్సెస్ అవుతాయి. ఆదాయానికి, ఆరోగ్యానికి ఇబ్బంది ఉండదు. ఆర్థిక లావాదేవీలు లాభాలనిస్తాయి.

**వృశ్చికం:**
వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలు అనుకూలంగా సాగుతాయి. దీర్ఘకాలిక అనారోగ్యం నుంచి కాస్తంత ఉప శమనం లభిస్తుంది. ఒకటి రెండు వ్యక్తిగత సమస్యలు పరిష్కారం అవుతాయి. కొద్దిపాటి వ్యయ ప్రయాసలతో ముఖ్యమైన వ్యవహారాలు, పనులు పూర్తవుతాయి.

**ధనస్సు:**
వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలు అనుకూలంగా సాగుతాయి. దీర్ఘకాలిక అనారోగ్యం నుంచి కాస్తంత ఉప శమనం లభిస్తుంది. ఒకటి రెండు వ్యక్తిగత సమస్యలు పరిష్కారం అవుతాయి. కొద్దిపాటి వ్యయ ప్రయాసలతో ముఖ్యమైన వ్యవహారాలు, పనులు పూర్తవుతాయి.

**మకరం:**
వృత్తి, ఉద్యోగాలు బాగా ఉత్సాహంగా పురోగమిస్తాయి. వ్యాపారాల్లో కొత్త వ్యూహాలు, ఆలోచనలు అమలు చేస్తారు. గృహ, వాహన సౌకర్యాలకు సంబంధించి ఆలోచనలు చేస్తారు. చిన్ననాటి మిత్రుల్ని కలుసుకుంటారు. సమాజంలో పెద్దల పరిచయాలు విస్తృతం అవుతాయి.

**కుంభం:**
వృత్తి, వ్యాపారాలు ఆశాజనకంగా ముందుకు సాగుతాయి. ఉద్యోగంలో శుభ పరిణామాలు చోటు చేసుకుంటాయి. ఇష్టమైన బంధుమిత్రుల్ని కలుసు కుంటారు. ఇంటా బయటా మాటకు విలువ పెరుగుతుంది. బంధువుల నుంచి ఆశించిన శుభవార్త వింటారు.

**మీనం:**
ఉద్యోగంలో మంచి గుర్తింపు లభిస్తుంది. వృత్తి, వ్యాపారాలు సజావుగా సాగిపోతాయి. ఇంటా బయటా బాధ్యతలు పెరుగుతాయి. మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఒకటి రెండు వ్యక్తిగత సమస్యలు పరిష్కారమవుతాయి. ముఖ్యమైన వ్యవహారాలను పట్టుదలగా పూర్తి చేస్తారు.



## పారిశుధ్య కార్మికులకు పాద పూజ

**చిత్తూరు జిల్లా (ఏడీఎన్ఎన్) :**

చిత్తూరు జిల్లాలోని వెంకటగిరి కోట మేజర్ పంచాయతీలో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. పారిశుద్ధ్య కార్మికులకు ఆ ఊరు సర్పంచ్ పీఎన్ లక్ష్మీ పాదపూజ చేశారు. గ్రామ సచివాలయంలో శుక్రవారం సర్పంచ్ కు వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు, పంచాయతీ అధికారులతో పాటు పారిశుద్ధ్య కార్మికులు కూడా హాజరయ్యారు. సర్పంచ్ లక్ష్మి తన పదవికాలం ముగిసే ముందు పారిశుద్ధ్య కార్మికులకు రూ. 15 వేలు వేతనాలు పెంచుతూ తీర్మానం చేసింది. అలాగే గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నందుకు వారిని అభినందించింది. ఆమె తన కుమారుడితో కలిసి పారిశుద్ధ్య కార్మికుల పాదాలకు స్వయంగా పాదపూజ చేయడం పలువురిని మెప్పించింది. అనంతరం 21 మంది వార్డు సభ్యులకు, పంచాయతీ సిబ్బందికి సత్కారం చేశారు. సమాజంలో అట్టడుగున ఉన్న వారికిచ్చే గౌరవమే అసలైన మానవీయతకు నిదర్శనం అని గ్రామస్తులు ఆమెను మెచ్చుకున్నారు.

# కలుషిత మూసీలో పూజా స్థలాలు వద్దు

**సీఎం కు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ**

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుద్ధరణ నిర్ణయాన్ని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ స్వాగతించింది. అయితే, నదిని పూర్తిగా శుద్ధి చేయకముందే అందులో ఆలయాలు, మసీదులు, గురుద్వారాలు వంటి పూజా స్థలాల నిర్మాణాన్ని ప్రారంభించడం సరైన నిర్ణయం కాదని సంస్థ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక లేఖ రాశారు. గతంలో మూసీ ప్రక్షాళన కోసం చేసిన ఖర్చు, నిర్మించిన రబ్బర్ డ్యామ్ వంటి ప్రయత్నాలేవీ ఆశించిన ఫలితాలను ఇవ్వలేదని, ఇప్పటికీ మూసీ ఒక పెద్ద డ్రైనేజీ నాలాగా మారిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నివేదికల ప్రకారం మూసీ అత్యంత కలుషితమైన నదిగా ఉందని, ఫార్మా కంపెనీలు మరియు పరిశ్రమల నుంచి వచ్చే ప్రమాదకర రసాయనాలు నదిలో కలుస్తున్నాయని పద్మనాభరెడ్డి గుర్తు చేశారు. ఇటువంటి కలుషిత జలాల మధ్య శివుడి విగ్రహాన్ని లేదా ఇతర ఆధ్యాత్మిక కట్టడాలను ఏర్పాటు చేయడం సముచితం కాదని ఆయన పేర్కొన్నారు. నదిలోకి మురుగునీరు చేరకుండా అడ్డుకట్ట వేయడం, మురుగునీటి శుద్ధి వ్యవస్థలను బలోపేతం చేయడం ద్వారా నదిని నిర్మలంగా మార్చడానికే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. మూసీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసిన తర్వాతే ఇతర నిర్మాణాల గురించి ఆలోచించాలని ఆయన తన లేఖలో కోరారు.

# డొమెస్టిక్ సిలిండర్లతో దందా చేస్తే జైలుకే

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్రంలో వంట గ్యాస్ సిలిండర్ల కొరత రాకుండా పౌరసరఫరాల శాఖ పకడ్బందీ చర్యలు చేపట్టింది. ముఖ్యంగా గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లను వాణిజ్య అవసరాలకు మళ్లించి బ్లాక్ మార్కెట్ లో విక్రయిస్తున్నారన్న ఫిర్యాదులతో విజిలెన్స్ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా ముమ్మర తనిఖీలు చేపట్టారు. గత నెల 12వ తేదీ నుంచి ఈ నెల 3వ తేదీ వరకు జరిపిన సోదాల్లో భాగంగా 3,699 గృహ వినియోగ సిలిండర్లతో పాటు 70 చిన్న సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ. 1.10 కోట్లు ఉంటుందని పౌరసరఫరాల శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది.అక్రమ విక్రయాలకు పాల్పడుతున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు 1,275 మందిపై 6A కేసులు నమోదు చేయగా, వివిధ పోలీస్ స్టేషన్లలో 216 ఎఫ్ఐఆర్లు నమోదయ్యాయి. మధ్య ప్రాచ్య దేశాల్లో యుద్ధ వాతావరణం కారణంగా ప్రపంచవ్యాప్తంగా గ్యాస్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తినప్పటికీ, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాయి. ఈ క్రమంలో కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించాలని చూసే గ్యాస్ ఏజెన్సీలు లేదా యజమానులపై కఠినంగా వ్యవహరిస్తామని, అవసరమైతే కనెక్షన్లను కూడా రద్దు చేస్తామని అధికారులు హెచ్చరించారు. వాణిజ్య అవసరాల కోసం హోటళ్లు, లాడ్జీల నిర్వాహకులు ఒక్కో సిలిండర్‌ను రూ. 1,800 వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నట్లు విచారణలో తేలింది. గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ల సిబ్బంది సహకారంతో ఈ బ్లాక్ దందా జోరుగా సాగుతోందని గుర్తించిన అధికారులు, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలను ముమ్మరం చేశారు. నిజమైన లబ్ధిదారులకే గ్యాస్ సిలిండర్లు అందేలా చూడటమే తమ లక్ష్యమని, అక్రమ మార్గాల్లో సొమ్ము చేసుకోవాలని చూస్తే కఠిన శిక్షలు తప్పవని పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది.

# వసూళ్లలో జీహెచ్ఎంసీకి కాసుల వర్షం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**




హైదరాబాద్ మహానగరంలో నిర్మాణ రంగం సరికొత్త పుంతలు తొక్కుతుండటంతో జీహెచ్ఎంసీ ఖజానాకు కాసుల వర్షం కురుస్తోంది. భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీ ద్వారా 202526 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ. 1,172.08 కోట్ల ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. గతేడాది (202425) వచ్చిన రూ. 1,138.44 కోట్లతో పోలిస్తే, ఈసారి అదనంగా రూ. 34.36 కోట్ల ఆదాయం పెరగడం గమనార్హం. ముఖ్యంగా 'బిల్డ్ నౌ' పోర్టల్ ద్వారా అనుమతుల ప్రక్రియను సరళతరం చేయడం వల్ల మార్చి నెలలోనే రికార్డు స్థాయిలో 15,536 నిర్మాణాలకు అనుమతులు మంజూరయ్యాయి. ఏడాది పొడవునా మొత్తం 2,427 ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లను జారీ చేసినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.మరోవైపు, ఆస్తి పన్ను వసూళ్లలోనూ జీహెచ్ఎంసీ , దాని పరిధిలోని మున్సిపల్ కార్పొరేషన్లు దూసుకుపోతున్నాయి. క్యూర్ అర్బన్ రీజియన్ పరిధిలో మొత్తం రూ. 2,558.8 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది. ఇందులో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ రూ. 1,000.36 కోట్లతో అగ్రస్థానంలో నిలవగా, జీహెచ్ఎంసీ పరిధిలో రూ. 995.82 కోట్లు, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ. 562.62 కోట్లు పన్ను వసూలైంది. ఒక్క మార్చి నెలలోనే అధికారులు లక్ష్యానికి అనుగుణంగా రూ. 453.98 కోట్ల పన్నును వసూలు చేశారు. ఆర్థిక సంవత్సరం చివరి రోజైన మార్చి 31వ తేదీన జీహెచ్ఎంసీ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, ఒక్క రోజే ఏకంగా రూ. 162.94 కోట్ల పాత బకాయిలను వసూలు చేయడం విశేషం. నగర విస్తరణ వేగంగా జరుగుతుండటం, ఐటీ మరియు రియల్ ఎస్టేట్ రంగాలు బలోపేతం కావడంతో ఆస్తి పన్ను , నిర్మాణ ఫీజుల రూపంలో వచ్చే ఆదాయం ఏటా పెరుగుతూ వస్తోంది. పెరిగిన ఈ ఆదాయాన్ని నగరంలోని మౌలిక సదుపాయాల కల్పన , అభివృద్ధి పనులకు వెచ్చించనున్నట్లు అధికారులు తెలిపారు.



## క్రమశిక్షణ అతిక్రమిస్తే సహించేది లేదు

**నరసరావుపేట (ఏడీఎన్ఎన్) :**

నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు ఇటీవల ఎస్పీ కార్యాలయంలో లీగల్ అడ్వైజర్ నియామకం విషయంలో వ్యవహరించిన తీరుపై తెలుగుదేశం పార్టీ అధిష్టానం తీవ్రంగా స్పందించింది. ఈ ఘటనకు సంబంధించి వివరణ ఇచ్చేందుకు ఎమ్మెల్యే మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం 'ఎన్టీఆర్ భవన్'లో ఏపీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిశారు. గత ప్రభుత్వ హయాంలో తాము ఎదుర్కొన్న ఇబ్బందులు, స్థానిక రాజకీయ పరిస్థితుల వల్ల కొంత భావోద్వేగానికి లోనై అలా ప్రవర్తించాల్సి వచ్చిందని అరవింద బాబు తన వివరణను ఇచ్చుకున్నారు. అయితే, ఎమ్మెల్యే ఇచ్చిన వివరణపై పల్లా శ్రీనివాసరావు సంతృప్తి వ్యక్తం చేయలేదు. వ్యక్తిగత కారణాలు ఏవైనా ఉండవచ్చు కానీ, పార్టీ క్రమశిక్షణను అతిక్రమిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని ఆయన ఖరాకండిగా చెప్పారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ప్రభుత్వానికి లేదా పార్టీకి చెడ్డపేరు తెచ్చే ఏ చర్యలనైనా ఉపేక్షించబోమని ఘాటుగా హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు సమాజంలో హుందాతో వ్యవహరించాలని, అధికారుల పనితీరుపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత వేదికలపై ఫిర్యాదు చేయాలే తప్ప, ఇలాంటి వివాదాస్పద ఘటనలకు తావు ఇవ్వకూడదని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు పాలనలో సానుకూల మార్పును కోరుకుంటున్నారని పల్లా శ్రీనివాసరావు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇలాంటి వివాదాలు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రతికూల ప్రభావం చూపుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదని, ప్రతి ఒక్కరూ పార్టీ నియమావళికి కట్టుబడి ఉండాలని పల్లా శ్రీనివాసరావు ఎమ్మెల్యేకు స్పష్టం చేశారు.



## విశాఖ తీరంలో విద్యార్థిని కాపాడిన మెరైన్ పోలీసులు

**విశాఖ జిల్లా (ఏడీఎన్ఎన్) :**

విశాఖ జిల్లాలోని రేవుపోలవరం తీరంలో అలల ఉధృతికి సముద్రంలో కొట్టుకపోతున్న పదవ తరగతి విద్యార్థిని తీర ప్రాంత రక్షణ పోలీసులు శుక్రవారం కాపాడారు. మాకవరపాలెం మండలం, జి కోడూరుకు చెందిన 15 ఏళ్ల చవాకుల శ్రీనివాస్ గా గుర్తించారు. ఆంధ్రప్రదేశ్ లో పదవతరగతి పరీక్షలు ముగియడంతో స్నేహితులతో కలిసి రేవుల పోలవరం తీరంలో ఈత కొట్టడానికి శ్రీనివాస్ వచ్చాడు. తీరంలో స్నేహితులతో కలిసి ఈత కొడుతుండగా అలల ఉధృతికి సముద్రంలో మునిగిపోయాడు. వెంటనే స్నేహితులు కేకలు వేయడంతో దగ్గరలో ఉన్న మెరైన్ పోలీసులు ఏఎస్సై కృష్ణ, కానిస్టేబుల్ చినబాబు, హోంగార్డులు అప్పలరాజు, శ్రీను విద్యార్థిని బయటకు తీసుకువచ్చి ప్రథమ చికిత్స చేశారు.



## మాచర్ల ఆగంతకున్ని గుర్తించిన పోలీసులు

**మాచర్ల (ఏడీఎన్ఎన్) :**

మాచర్ల మహిళా ఉద్యోగి అత్యాచార ఘటనలో పోలీస్ శాఖ పురోగతి సాధించింది. ఎట్టకేలకు నిందితున్ని పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనను ఏపీ పోలీసులు సీరియస్ గా తీసుకున్నారు. సీసీటీవీ ఫుటేజ్ లో అనుమానితుడిని గుర్తించారు. క్లూస్ టీమ్ సాక్ష్యాలు సేకరించింది. నిందితుడిని పట్టుకునేందుకు అదనపు ఎస్పీ స్థాయి అధికారితో శుక్రవారం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. గురువారం మాచర్లలో ఒంటరిగా ఉన్న మహిళ కాళ్లూ చేతులు కట్టేసి, నోట్లో గుడ్డలు కుక్కి అత్యాచారానికి పాల్పడిండు ఓ దుర్మార్గుడు. ఆమెపై అత్యంత పాశవికంగా ప్రవర్తించాడు. గుడ్ ఫ్రైడే సందర్భంగా సత్తెనపల్లికి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా గుర్తుతెలియని వ్యక్తి ఆమె ఇంటి తలుపులు కొట్టాడు. ఆమె తలుపు తీయగానే ఇంట్లోకి ప్రవేశించాడు. ఆమెను కత్తితో బెదిరించి ఆపై ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం దుస్తుల్లేకుండా చేశాడు. కాళ్లూచేతులు కట్టేసి, అమానుషంగా గాయపరిచి పరారయ్యాడు. ఈ ఘటనతో ఏపీ ఒక్కసారి ఉలిక్కిపడింది.

## గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్



**ఆసిఫాబాద్ జిల్లా (ఏడీఎన్ఎన్) :**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని పెంచికలపేట మండలం ఎల్లూరు గురుకుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఫుడ్ పాయిజన్ అయింది. ఐదుగురు విద్యార్థులతోపాటు ఒక టీచర్ అస్వస్థతకు గురయ్యారు. టీచర్ బాలాజీ, పదవ తరగతి విద్యార్థులు నలుగురు, ఒక తొమ్మిదవ విద్యార్థి రాత్రి మిగిలిన అన్నం, సాంబార్ తిన్నారు. తిన్న కాసేపటికే విద్యార్థులు, ఉపాధ్యాయుడు బాలాజీ అస్వస్థత చెందారు. విషయం తెలుసుకున్న తోటి ఉపాధ్యాయులు టీచర్ తోపాటు 5గురు విద్యార్థులను వెంటనే పెంచికలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో హుటాహుటిన కాగజ్ నగర్ పీహెచ్ సీకి తరలించి చికిత్స అందించారు.



## నా కులాన్ని రాజకీయం చేయొద్దు

**నర్సీపట్నం (ఏడీఎన్ఎన్) :**

నర్సీపట్నం పండగలో డప్పు కొడుతున్న సమయంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు తనపై చేయిచేసుకున్నట్లు వస్తున్న వార్తలపై ఎత్తుల భాస్కరరావు స్పందించారు. ఈ ఘటనను కొందరు కావాలని రాజకీయం చేస్తున్నారని, తన కులాన్ని అడ్డుపెట్టుకుని విమర్శలు చేయడం సరికాదని ఆయన మండిపడ్డారు. "మేము చిన్నప్పటి నుంచి అయ్యన్నపాత్రుడి వద్దే ఉంటున్నాం. ఆయనతో మాకు ఒకే కుటుంబం లాంటి సంబంధం ఉంది. జాతరను ఆయన చాలా గొప్పగా జరిపించారు. ఊరంతా జాతర గురించి ఎంతో గొప్పగా చెప్పుకుంటున్నారు. ఇలాంటి సమయంలో జరిగిన చిన్న విషయాన్ని పెద్దది చేసి రాజకీయం చేయవద్దు," అని భాస్కరరావు రిక్వెస్ట్ చేశారు. ఆ సమయంలో అసలు ఏం జరిగిందో భాస్కరరావు వివరించారు. "జాతర సందడిలో నా వల్ల పొరపాటున అయ్యన్నపాత్రుడి కాలుకి దెబ్బ తగిలింది. ఆ నొప్పి వల్ల కలిగిన అసహనంతోనే ఆయన నాపై చేయిచేసుకున్నారు. అంతే తప్ప అందులో వేరే ఉద్దేశం ఏమీ లేదు," అని ఆయన స్పష్టం చేశారు. తమ మధ్య ఉన్న సాన్నిహిత్యాన్ని అర్థం చేసుకోకుండా, దళితుడు అనే పేరుతో రాజకీయం చేయాలని చూస్తున్న వారికి ఆయన గట్టి కౌంటర్ ఇచ్చారు. ఈ వివరణతో గత రెండు రోజులుగా నర్సీపట్నంలో సాగుతున్న వివాదానికి ముగింపు పడినట్లయింది.

## సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుపై ఏసీబీ రైడ్

**వరంగల్ (ఏడీఎన్ఎన్) :**

వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ ఆకస్మిక దాడులు నిర్వహించింది. తనిఖీల్లో లెక్కలు లేని రూ. 47,450 నగదు, 70 దస్త్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దాడులు నిర్వహించిన సమయంలో కార్యాలయంలో 20 మంది అనధికార ఏజెంట్లు, డాక్యుమెంట్ రైటర్లు ఉన్నారని ఏసీబీ అధికారులు తెలిపారు. డాక్యుమెంట్ రైటర్ల సెల్ ఫోన్ లు, వారి ఫోన్ పే లావాదేవీలను పరిశీలించారు. ఒక ఏడాదిలో రూ.42 లక్షల ఫోన్ పే లావాదేవీలు జరిగినట్టు అధికారులు గుర్తించారు. లంచం ఇవ్వలేదని 204 డెలివరీ కాని డాక్యుమెంట్లు సబ్ రిజిస్ట్రార్ అదికారి దగ్గర లభించాయని తేల్చారు. ఎస్ ఆర్ వోల ఇళ్లల్లో రూ. 24.61 లక్షల నగదు, 820 గ్రాముల బంగారం, 2.6 కిలోల వెండి ఆభరణాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

## భారీ వర్ష సూచన



**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ శుక్రవారం వెల్లడించింది. రాగల మూడు గంటల్లో అల్లూరి, పోలవరం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. మన్యం, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. సుమారు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తు సంస్థ సూచించింది. చెట్ల కింద నిలబడవద్దని పిడుగులు పడే అవకాశం ఉందని ప్రజలకు స్పష్టం చేసింది. ఈ మేరకు ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ ఒక ప్రకటన విడుదల చేశారు.




## కొడుకు మరణం... కోడలికి నో ఎంట్రీ

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

కన్నకొడుకు మరణించాడని కోడలిని, మనవలు, మనవరాళ్లను ఇంట్లోకి రానివ్వడం లేదు అత్తమామలు. మాదాపూర్ పరిధిలో బాధితురాలు దీనకుమారి తన పిల్లలతో అత్తమామ ఇంటి ఎదుటే బయట ఉంటోంది. తన భర్త మరణించిన తర్వాత అత్తమామలు తమను పట్టించుకోవడం లేదని ఆమె వాపోయింది. కొడుకు పోయాక నీతో మాకేం సంబంధం? అంటూ ఇంట్లోకి రాకుండా గేట్లు మూసేస్తున్నారని తెలిపింది. వారసులుగా పుట్టిన మనవలు, మనవరాళ్లను సైతం అత్తగారి కుటుంబం గుర్తించడానికి నిరాకరిస్తోందని తెలియజేసింది. పిల్లల భవిష్యత్తు కోసం దీన కుమారి గత 20 రోజులుగా అత్తగారింటి ముందే చలిలో, ఎండలో గడుపుతున్నామని ఆవేదనతో అంది. ఎన్నిసార్లు వేడుకున్నా అత్తగారి వైపు నుంచి స్పందన రావడంలేదు. ఇద్దరు పిల్లలతో తాను ఎక్కడికి వెళ్లాలని, పోలీసులు, మహిళా సంఘాలు స్పందించాలని దీన కుమారి వేడుకుంటోంది.

సంక్షేమ
# మనసర్కార్
Follow: manasarkar





## ముంబై టీమ్‌లో
## కివీస్ స్టార్ ఎంట్రీ

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్ పై ఘనవిజయం సాధించిన ముంబై ఇండియన్స్‌కు మరింత ఉత్సాహాన్నిచ్చే వార్త అందింది. ఢిల్లీ క్యాపిటల్స్ తో జరగనున్న కీలక పోరుకు ముందే న్యూజిలాండ్ స్టార్ ఆల్‌రౌండర్ మిచెల్ శాంట్నర్ జట్టుతో చేరాడు. వ్యక్తిగత కారణాల వల్ల తొలి మ్యాచ్‌కు దూరమైన ఆయన రాకతో హార్దిక్ సేన బౌలింగ్ విభాగం మరింత బలోపేతం కానుంది. కివీస్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ ఇప్పటికే ఢిల్లీ చేరుకుని జట్టు శిబిరంలో చేరారు. అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగే ఎనిమిదో మ్యాచ్‌లో ఆయన బరిలోకి దిగే అవకాశం ఉంది. గత మ్యాచ్‌లో భారీగా పరుగులు సమర్పించుకున్న ఆఫ్ఘన్ స్పిన్నర్ అల్లా మహమ్మద్ గజన్‌ఫర్ స్థానంలో శాంట్నర్‌ను తుది జట్టులోకి తీసుకోవాలని యాజమాన్యం భావిస్తోంది. టీ20ల్లో శాంట్నర్ ఎకానమీ రేటు ఎనిమిది కంటే తక్కువగా ఉండటం విశేషం. 138 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 142 వికెట్లు తీసిన అనుభవం ముంబైకి కొండంత అండ. శాంట్నర్ రాకతో బౌలింగ్‌తో పాటు లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్ విభాగం కూడా పటిష్టం కానుంది. గత సీజన్‌లో ముంబై తరపున 13 మ్యాచ్‌ల్లో 10 వికెట్లు తీసి ఆయన సత్తా చాటారు. మరో విదేశీ స్టార్ విల్ జాక్స్ కూడా త్వరలోనే జట్టుతో చేరాల్సి ఉంది. జస్ప్రీత్ బుమ్రా మినహా మిగిలిన బౌలర్లు గత మ్యాచ్‌లో తడబడిన నేపథ్యంలో, శాంట్నర్ వంటి అనుభవజ్ఞుడైన స్పిన్నర్ రాక ముంబై బౌలింగ్ దళానికి కొత్త రూపాన్ని ఇస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.



## అభిషేక్ శర్మకు ఐపీఎల్ షాక్..
## మ్యాచ్ ఫీజులో కోత!

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

సన్‌రైజర్స్ హైదరాబాద్ విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మకు ఐపీఎల్ గవర్నింగ్ కమిటీ భారీ జరిమానా విధించింది. మ్యాచ్ రిఫరీ నిబంధనలను ఉల్లంఘించినందుకు అతడి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధిస్తూ నిర్ణయం తీసుకుంది. జరిమానాతో పాటు అతడి ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్‌ను కూడా చేర్చారు. ముజరబాని వేసిన తొమ్మిదో ఓవర్‌లో 48 పరుగుల వద్ద ఉన్న అభిషేక్.. భారీ షాట్‌కు ప్రయత్నించి వరుణ్ చక్రవర్తికి క్యాచ్ ఇచ్చాడు. ఫీల్డ్ అంపైర్లు దీనిని థర్డ్ అంపైర్‌కు నివేదించగా, రిప్లేలను పరిశీలించిన అంపైర్ 'ఔట్'గా ప్రకటించారు. అంపైర్ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన అభిషేక్, మైదానాన్ని వీడుతూ కొన్ని వ్యాఖ్యలు చేశాడు. ఇది ఐపీఎల్ ప్రవర్తనా నియమావళి (కోడ్ ఆఫ్ కండక్ట్) లోని ఆర్టికల్ 2.3 కింద లెవల్ 1 తప్పిదంగా పరిగణించబడింది. మ్యాచ్ రిఫరీ విధించిన ఈ శిక్షను అభిషేక్ అంగీకరించాడు. లెవల్ 1 నేరాల విషయంలో రిఫరీ నిర్ణయమే అంతిమం కావడంతో ఈ జరిమానా ఖరారైంది. అయితే, రిప్లేలో బంతి నేలను తాకినట్లు కనిపిస్తోందని, థర్డ్ అంపైర్ నిర్ణయం సరికాదని సోషల్ మీడియాలో సన్‌రైజర్స్ అభిమానులు పెద్ద ఎత్తున చర్చించుకుంటున్నారు



## బంగారం అమ్మకానికి
## నిపుణుల సూచనలు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

భారతీయులకు బంగారం కేవలం సెంటిమెంట్ మాత్రమే కాదు, ఒక బలమైన ఆర్థిక ఆసరా. అయితే, గరిష్ట లాభాల కోసం బంగారాన్ని ఎప్పుడు విక్రయించాలో నిపుణులు కొన్ని కీలక సూత్రాలను వివరిస్తున్నారు. మీ మొత్తం పెట్టుబడుల్లో బంగారం వాటా 10 నుండి 15 శాతం మించకూడదు. మార్కెట్ ఒడిదుడుకుల వల్ల ఈ వాటా 20శాతం దాటితే, కొంత విక్రయించి ఇతర రంగాల్లో (స్టాక్స్ లేదా FDలు) పెట్టుబడి పెట్టడం శ్రేయస్కరం. పిల్లల చదువులు, ఇల్లు కొనుగోలు లేదా వైద్య అత్యవసరాల కోసం డబ్బు అవసరమైనప్పుడు, ధరలు ఇంకా పెరుగుతాయనే ఆశతో వేచి చూడకుండా విక్రయించడం మంచిది. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి లేదా యుద్ధ భయాల వల్ల ధరలు విపరీతంగా పెరిగినప్పుడు లాభాలను స్వీకరించడం మేలు. ఆభరణాల కంటే డిజిటల్ గోల్డ్, ETFలు విక్రయించడం లాభదాయకం. ఆభరణాలపై తరుగు, మజూరీల వల్ల కొంత నష్టం వాటిల్లవచ్చు. సావరిన్ గోల్డ్ బాండ్లను మెచ్యూరిటీ వరకు ఉంచితే పన్ను మినహాయింపుతో పాటు గరిష్ట లాభం లభిస్తుంది. సరైన సమయంలో, సరైన వ్యూహంతో విక్రయించినప్పుడే బంగారు పెట్టుబడికి అసలైన విలువ దక్కుతుందని చెప్తున్నారు.

## సీఎస్కేను చిత్తు చేసిన పంజాబ్ కింగ్స్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ఐపీఎల్ 19వ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ తమ జైత్రయాత్రను కొనసాగిస్తూ వరుసగా రెండో విజయాన్ని సొంతం చేసుకుంది. తొలి మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ ను ఓడించిన ఉత్సాహంతో బరిలోకి దిగిన పంజాబ్, ఈసారి ఐదుసార్లు ఛాంపియన్ అయిన చెన్నై సూపర్ కింగ్స్ ను వారి సొంత మైదానం చెపాక్‌లోనే మట్టికరిపించింది. 210 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగినప్పటికీ, పంజాబ్ బ్యాటర్లు ఏమాత్రం తడబడకుండా మరో 8 బంతులు మిగిలి ఉండగానే 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించారు. ఈ విజయంతో సీఎస్కేపై గత ఎనిమిది మ్యాచుల్లో ఏడో విజయంతో పంజాబ్ తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది. ముందుగా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నై సూపర్ కింగ్స్ యువ ఆటగాళ్లు మైదానంలో పరుగుల వరద పారించారు. ఓపెనర్ ఆయుష్ మాత్రే (73) సుడిగాలి ఇన్నింగ్స్ తో చెపాక్ స్టేడియాన్ని హోరెత్తించి జట్టుకు భారీ స్కోరు దిశగా బలమైన పునాది వేశాడు. అతనికి తోడుగా సర్ఫరాజ్ ఖాన్ (32) పంజాబ్ బౌలర్లకు దడ పుట్టించగా, ఇన్నింగ్స్ చివరలో శివం దూబే (45 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఈ ముగ్గురి విధ్వంసకర బ్యాటింగ్‌తో చెన్నై నిర్ణీత ఓవర్లలో 210 పరుగుల భారీ స్కోరును సాధించి పంజాబ్‌కు కఠినమైన సవాల్ విసిరింది. అయితే, ఇంతటి భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో పంజాబ్ కింగ్స్ బ్యాటర్లు అద్భుతమైన పోరాట పటిమను కనబరిచారు. ముఖ్యంగా 'ఇంపాక్ట్ సబ్'గా వచ్చిన ప్రియాన్ష్ ఆర్య (39) ఇన్నింగ్స్ ఆరంభంలోనే ఫోర్లు, సిక్సర్లతో చెన్నై బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టాడు. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (43) తో కలిసి తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించి స్కోరు బోర్డును ఉరికించాడు. వీరిద్దరి నిష్క్రమణ తర్వాత కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ తో ఆకట్టుకున్నాడు. కూపర్ కొన్నొల్లి (36), నేహల్ వధేరా (10) సహకారంతో ఇన్నింగ్స్ ను నడిపించిన అయ్యర్ (50), అర్ధ సెంచరీ పూర్తి చేసుకుని జట్టును విజయానికి చేరువ చేసి అవుటయ్యాడు. చివరి నిమిషంలో మార్కస్ స్టోయినిస్ (9) , శశాంక్ సింగ్ (14) ఎటువంటి పొరపాట్లు చేయకుండా మిగిలిన లక్ష్యాన్ని పూర్తి చేశారు. చెన్నై బౌలర్లలో మ్యాట్ హెన్రీ రెండు వికెట్లు తీసినప్పటికీ భారీగా పరుగులు సమర్పించుకోవడం ఆ జట్టును దెబ్బతీసింది. సొంత గడ్డపై గెలిచి బోణీ కొట్టాలనుకున్న రుతురాజ్ సేనకు ఈ ఓటమి తీవ్ర నిరాశను మిగిల్చింది. పంజాబ్ కింగ్స్ వరుస విజయాలతో పాయింట్ల పట్టికలో దూసుకుపోతుండగా, బౌలింగ్ విభాగంలో లోపాలను సరిదిద్దుకోవాల్సిన అవసరం సీఎస్కేకు కనిపిస్తోంది.



## ధోనీ, కపిల్ దేవ్‌లకు యువీ క్షమాపణ

### తండ్రి వ్యాఖ్యలపై ఆవేదన!

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



టీమిండియా మాజీ స్టార్ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ భారత క్రికెట్ దిగ్గజాలు కపిల్ దేవ్, ఎంఎస్ ధోనీలకు బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. తన తండ్రి యోగ్ రాజ్ సింగ్ గతంలో వీరిద్దరిపై చేసిన వివాదాస్పద ఆరోపణల నేపథ్యంలో యువీ ఈ నిర్ణయం తీసుకోవడం క్రీడా వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. యువరాజ్ సింగ్ రిటైర్మెంట్ తర్వాత ఆయన తండ్రి యోగ్ రాజ్ సింగ్ పలు సందర్భాల్లో ధోనీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేశారు. యువీకి కెప్టెన్సీ రాకపోవడానికి ధోనీనే కారణమని ఆరోపించా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న యువరాజ్.. తన తండ్రి చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని స్పష్టం చేశారు. "నేను కపిల్ దేవ్, ఎంఎస్ ధోనీలకు క్షమాపణలు చెప్పాలనుకుంటున్నాను. ఆ వ్యాఖ్యలు సరికాదని మా నాన్నకు కూడా చెప్పాను" అని యువీ పేర్కొన్నారు. బిషన్ సింగ్ బేడీ, కపిల్ దేవ్, ధోనీ వంటి వారు ఆటగాళ్లను గౌరవించలేదని, వారి వల్లే జట్టు నాశనమైందని యోగ్ రాజ్ గతంలో విమర్శలు చేసేవారు. ఒకానొక దశలో కపిల్ దేవ్‌పై కోపంతో ఆయన ఇంటికి పిస్టల్‌తో వెళ్లానని కూడా యోగ్ రాజ్ చెప్పడం అప్పట్లో సంచలనం సృష్టించింది. 2007 టీ20 ప్రపంచకప్, 2011 వన్డే ప్రపంచకప్ విజయాల్లో కీలక పాత్ర పోషించిన యువరాజ్.. 15 ఏళ్ల పాటు భారత క్రికెట్‌కు విశేష సేవలు అందించారు. ధోనీ సారథ్యంలోనే ఆయన అత్యధిక కాలం ఆడారు. తన తండ్రి వ్యక్తిగత కారణాలతో చేసిన విమర్శల వల్ల దిగ్గజ ఆటగాళ్ల ప్రతిష్టకు భంగం కలగకూడదనే ఉద్దేశంతో యువరాజ్ ఈ విధంగా క్షమాపణలు కోరడం పట్ల అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## 'పుల్లెల గోపీచంద్ లీగ్' ప్రారంభం!

### ఎఫ్ఎన్‌సీసీలో బ్యాడ్మింటన్ సందడి

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



హైదరాబాద్‌లోని ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ (FNCC) క్రీడా ఉత్సాహంతో కళకళలాడుతోంది. ఎఫ్ఎన్‌సీసీ, ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'బ్యాడ్మింటన్ లీగ్' ప్రకటన కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ నెల 4, 5 తేదీల్లో ప్రారంభం కానున్న ఈ లీగ్, రాబోయే నాలుగు నుండి ఐదు వారాల పాటు వారాంతాల్లో (శని, ఆదివారాలు) జరగనుంది. ఈ టోర్నమెంట్‌లో దేశవ్యాప్తంగా ఉన్న టాప్10 పురుష, మహిళా బ్యాడ్మింటన్ క్రీడాకారులు పాల్గొనబోతుండటం విశేషం. క్లబ్ సభ్యుల కోసం తొలుత క్లబ్ టోర్నమెంట్, ఆ తర్వాత ఇంటర్ క్లబ్, నేషనల్ లెవల్ పోటీలు నిర్వహించనున్నారు. లీగ్‌లో పాల్గొనే టీమ్ యజమానులు రూ. 10 లక్షల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది, ఆ మొత్తాన్ని విజేతలకు ప్రైజ్ మనీగా అందజేస్తారు. ఎఫ్ఎన్‌సీసీ ప్రెసిడెంట్ కె.ఎస్. రామారావు మాట్లాడుతూ.. తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ చాముండేశ్వరీనాథ్, కమిటీ చైర్మన్ పురుషోత్తం కృషితో ఈ లీగ్‌ను పట్టాలెక్కించినట్లు తెలిపారు. కేవలం క్రికెట్ మాత్రమే కాకుండా అన్ని క్రీడల్లో యువతను ప్రోత్సహించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఎఫ్ఎన్‌సీసీలో ఇప్పటికే సానియా మీర్జా, లియాండర్ పేస్ వంటి అంతర్జాతీయ క్రీడాకారుల భాగస్వామ్యంతో పలు ఈవెంట్స్ జరిగాయని, భవిష్యత్తులో టెన్నిస్, పికిల్ బాల్ పోటీలు కూడా ప్రతి ఏడాది నిర్వహిస్తామని సభ్యులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎన్‌సీసీ సెక్రటరీ తుమ్మల రంగారావు, వైస్ ప్రెసిడెంట్ ఎస్. ఎన్. రెడ్డి, ట్రెజరర్ శైలజ జూజాల, కమిటీ మెంబర్లు కాజా సూర్యనారాయణ, వేణు, ఏడిద రాజా, కోగంటి భవానీ, సోమరాజు తదితరులు పాల్గొని టోర్నమెంట్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

## పాక్‌లో పెట్రో మంటలు.. ఆఫ్రిదిపై నెటిజన్ల ఫైర్!

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ కుదేలవుతోంది. ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతల ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాకు ఆటంకం కలగడం పాక్ పాలిట శాపంగా మారింది. తాజాగా ప్రభుత్వం పెంచిన ఇంధన ధరలు సామాన్య ప్రజల నడ్డి విరుస్తుండగా, దీనిపై మాజీ క్రికెటర్ షాహిద్ ఆఫ్రిది చేసిన వ్యాఖ్యలు ఆ దేశంలో కొత్త వివాదానికి తెరలేపాయి. పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో హర్మూజ్ జలసంధి మూసివేత పాక్ ఇంధన మార్కెట్‌ను అతలాకుతలం చేసింది. గత నెల రోజుల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు 50 శాతానికి పైగా పెరిగాయి. పాక్ కరెన్సీలో లీటర్ పెట్రోల్ రూ.458 కాగా..లీటర్ డీజిల్ ధర రూ .520కి చేరుకుంది. ఇలాంటి క్లిష్ట సమయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ప్రజలందరూ గౌరవించాలని ఆఫ్రిది సోషల్ మీడియా వేదికగా పిలుపునిచ్చారు. "ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం ఉన్నప్పటికీ, ఇతర దేశాలతో పోలిస్తే మన పరిస్థితి మెరుగ్గానే ఉంది. దేశాభివృద్ధి కోసం ప్రభుత్వం చెప్పినట్లు నడుచుకుంటూ, వారికి అండగా నిలవాలి" అని ఆఫ్రిది పేర్కొన్న వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. ఆఫ్రిది వ్యాఖ్యలపై పాక్ ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. "కోట్లు సంపాదించే నీలాంటి సెలబ్రిటీలకు సామాన్యుల బాధలు ఏం తెలుస్తాయి? లీటర్ పెట్రోల్ రూ. 450 దాటితే పరిస్థితి మెరుగ్గా ఉండటం ఏంటి?" అంటూ నెటిజన్లు నిలదీస్తున్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడానికి ప్రభుత్వం నుంచి ఎంత తీసుకున్నావంటూ సామాజిక మాధ్యమాల్లో ఆఫ్రిదిని ఏకిపారేస్తున్నారు. మరోవైపు, అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితుల దృష్ట్యా ధరలు పెంచక తప్పలేదని పాక్ పెట్రోలియం శాఖా మంత్రి అలీ పర్వేజ్ మాలిక్ స్పష్టం చేశారు. అయితే, ధరల భారంతో బతుకు భారమైన పాక్ ప్రజలు మాత్రం ప్రభుత్వంపై, వారికి మద్దతు పలుకుతున్న సెలబ్రిటీలపై ఆగ్రహంతో ఊగిపోతున్నారు.

## టెలికం రంగంలో 'ఎయిర్‌టెల్' హవా

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**




భారత టెలికం మార్కెట్లో కొత్త చందాదారులను ఆకర్షించడంలో భారతి ఎయిర్‌టెల్ తన ఆధిపత్యాన్ని చాటుతోంది. వరుసగా మూడో నెలలోనూ ప్రత్యర్థి సంస్థల కంటే ముందువరుసలో నిలిచింది. ఫిబ్రవరి నెలకు సంబంధించిన గణాంకాల ప్రకారం.. ఎయిర్‌టెల్ రికార్డు స్థాయిలో కొత్త కస్టమర్లను తన నెట్‌వర్క్‌లో చేర్చుకుంది. ఫిబ్రవరిలో ఎయిర్‌టెల్ ఏకంగా 48.5 లక్షల కొత్త మొబైల్ చందాదారులను సంపాదించుకుంది. వైర్‌లైన్ కనెక్షన్లను కూడా కలుపుకుంటే మొత్తం 50.88 లక్షల మంది కొత్త కస్టమర్లు ఎయిర్‌టెల్ గూటికి చేరారు. ఫిబ్రవరిలో ఎయిర్‌టెల్ ఏకంగా 48.5 లక్షల కొత్త మొబైల్ చందాదారులను సంపాదించుకుంది. వైర్‌లైన్ కనెక్షన్లను కూడా కలుపుకుంటే మొత్తం 50.88 లక్షల మంది కొత్త కస్టమర్లు ఎయిర్‌టెల్ గూటికి చేరారు. రిలయన్స్ జియో నికరంగా 17.41 లక్షల మందిని ఆకర్షించింది. దీంతో జియో మొత్తం చందాదారుల సంఖ్య 51.96 కోట్లకు చేరింది. వొడాఫోన్ ఐడియా ఇటీవలి కాలంలో మొదటిసారిగా సానుకూల వృద్ధిని కనబరిచింది. ఫిబ్రవరిలో 21,927 మంది కొత్త కస్టమర్లను సొంతం చేసుకుంది. ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ మాత్రం మరోసారి కస్టమర్లను కోల్పోయింది. ఈ నెలలో 1.01 లక్షల మంది చందాదారులు ఈ నెట్‌వర్క్ నుంచి వైదొలిగారు. అంతర్జాతీయంగా కూడా ఎయిర్‌టెల్ తన సత్తా చాటుతోంది. 65 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లతో ప్రపంచంలోనే రెండో అతి పెద్ద టెలికం ఆపరేటరుగా భారతి ఎయిర్‌టెల్ నిలిచింది. భారత్‌లో 36.8 కోట్ల మంది కస్టమర్లు ఉండగా.. ఆఫ్రికాలో 14 దేశాల్లో కలిపి 17.9 కోట్ల మంది కస్టమర్లు ఉన్నారు. వినూత్న ఆవిష్కరణలు, విశ్వసనీయమైన సేవలే తమ వృద్ధికి కారణమని భారతి ఎయిర్‌టెల్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ గోపాల్ విఠల్ తెలిపారు. మొత్తంగా దేశంలో మొబైల్ ఫిక్స్ డ్ వైర్‌లెస్ కనెక్షన్ల సంఖ్య ఫిబ్రవరి ముగిసే నాటికి 127.33 కోట్లకు పెరగడం గమనార్హం.

## బడ్జెట్ ధరలో బజాజ్ నుంచి 'పల్సర్' పవర్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



ద్విచక్ర వాహన రంగంలో తనదైన ముద్ర వేసిన బజాజ్ ఆటో, యువతకు అత్యంత ఇష్టమైన 'పల్సర్' సిరీస్‌లో కీలక మార్పులు చేస్తోంది. టాక్స్ నిబంధనలను అనుకూలంగా మార్చుకుంటూ, కస్టమర్లకు తక్కువ ధరకే పవర్‌ఫుల్ బైక్‌ను అందించే లక్ష్యంతో Pulsar NS400Z అప్‌డేటెడ్ వెర్షన్‌ను 350cc రేంజ్‌లో లాంచ్ చేసేందుకు సిద్ధమైంది. బజాజ్ తన 373cc ఇంజిన్‌ను 349.13ccకి తగ్గించింది. దీని వెనుక ప్రధానంగా ఆర్థిక కారణాలు ఉన్నాయి. GST 2.0 నిబంధనల ప్రకారం 350cc కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న బైక్‌లపై 40శాతం ట్యాక్స్ పడుతుంది. అదే 350cc లోపు ఉంటే కేవలం 18శాతం ట్యాక్స్ మాత్రమే ఉంటుంది. ఈ భారీ ట్యాక్స్ వ్యత్యాసం వల్ల బైక్ ధర కస్టమర్లకు అందుబాటులోకి రానుంది. ఇంజిన్ సైజు తగ్గడం వల్ల పవర్‌లో స్వల్ప మార్పు ఉంటుంది. కొత్త వెర్షన్ 40.6 PS పవర్, 33.2 Nm టార్క్యూ అందిస్తుంది. 6స్పీడ్ గేర్‌బాక్స్, స్లిప్పర్ క్లచ్ మరియు స్మూత్ రైడింగ్ కోసం ఎలక్ట్రానిక్ థ్రోటిల్ వంటి ఫీచర్లు ఇందులో ఉన్నాయి. లుక్ పరంగా పాత మోడల్ స్టైల్‌నే కొనసాగించారు. అయితే ఇంజిన్‌పై ఉన్న '373cc' మార్కింగ్‌ను తొలగించారు. 43mm USD ఫ్రంట్ ఫోర్క్స్, డ్యూయల్ ఛానల్ ABS, ఫుల్ డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, నావిగేషన్ వంటి నెక్స్ట్ లెవల్ ఫీచర్లు ఇందులో ఉన్నాయి. పవర్‌ఫుల్ ప్రొజెక్టర్ హెడ్‌లైట్‌తో వస్తున్న ఈ బైక్, స్పోర్ట్స్ బైక్ ప్రియులకు ఒక అద్భుతమైన 'బడ్జెట్ ఫ్రెండ్లీ' ఆప్షన్‌గా మారనుంది. ట్యాక్స్ ప్రయోజనాలను కస్టమర్లకు బదిలీ చేస్తూ, తక్కువ ధరకే ప్రీమియం బైక్ అనుభూతిని అందించాలనే బజాజ్ వ్యూహం.






## హిట్‌మ్యాన్ కోసం
## ఆయుష్ మాత్రే సాహసం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. తాజాగా ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడుతున్న యువ ఆటగాడు ఆయుష్ మాత్రే, తన ఆరాధ్య క్రికెటర్ రోహిత్ శర్మను కలిసేందుకు పడిన తపనను గుర్తు చేసుకున్నాడు. పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌కు ముందు సీఎస్కే విడుదల చేసిన ఒక వీడియోలో మాత్రే ఈ ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. "గత ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లేముందు రోహిత్ భాయ్‌ను కలవాలని ఆయనకు మెసేజ్ చేశాను. ఆశ్చర్యకరంగా ఆయనే నాకు ఫోన్ చేసి, ఏం మాట్లాడాలి అనుకుంటున్నావో చెప్పు అన్నారు." "నేను ఇంగ్లాండ్ వెళ్తున్నానని, మిమ్మల్ని నేరుగా కలవాలని ఉందని చెప్పాను. నేను విరార్‌లో ఉంటానని తెలియగానే.. అంత దూరం నుంచి వస్తావా అని ఆయన ఆశ్చర్యపోయారు. వీడియో కాల్‌లో మాట్లాడుకుందాం అని సూచించినా, నేను మాత్రం నేరుగా కలవాలనే పట్టుబట్టాను." "చివరికి ఆయన అడ్రస్ పంపడంతో మరుసటి రోజే వెళ్లి కలిశాను. దాదాపు రెండు గంటల పాటు నాతో మాట్లాడారు. అసలు సమయం ఎలా గడిచిందో కూడా తెలియలేదు. నా ఆరాధ్య క్రికెటర్ అంత సమయం ఇవ్వడం నా కల నెరవేరినట్లు అనిపించింది." అని పేర్కొన్నాడు. మైదానంలోనే కాదు, వెలుపల కూడా యువ ఆటగాళ్లను ప్రోత్సహించడంలో రోహిత్ శర్మ ఎంతటి గొప్ప మనసున్న వ్యక్తి అనేది ఈ ఘటన మరోసారి నిరూపించింది. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.




## ఏఐ రేసులో
## మైక్రోసాఫ్ట్ కొత్త మోడల్స్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ప్రపంచంలో తన ఆధిపత్యాన్ని మరింత సుస్థిరం చేసుకునేందుకు మైక్రోసాఫ్ట్ కీలక ముందడుగు వేసింది. సంస్థ ఏఐ చీఫ్ ముస్తఫా సులేమాన్ నేతృత్వంలోని 'మైక్రోసాఫ్ట్ ఏఐ (MAI)' బృందం అత్యంత శక్తివంతమైన మూడు మోడల్స్ ను డెవలపర్ల కోసం అందుబాటులోకి తెచ్చింది. MAITranscribe1 స్పీచ్ టు టెక్స్ట్ అనేది మాటలను టెక్స్ట్‌గా మార్చే అత్యాధునిక స్పీచ్ రికగ్నిషన్ మోడల్. సుమారు 25 భాషల్లో అత్యంత కచ్చితత్వంతో పనిచేస్తుంది. ఇతర మోడల్స్‌తో పోలిస్తే ఇది 50 శాతం తక్కువ జీపీయూ వనరులను వినియోగించుకోవడం విశేషం. దీనివల్ల సంస్థలకు నిర్వహణ వ్యయం గణనీయంగా తగ్గుతుంది. రెండవది MAIVoice1 వాయిస్ జనరేషన్ టెక్స్ట్‌ను సహజమైన మానవ స్వరంగా మార్చడంలో దిట్ట. కేవలం ఒక సెకను కంటే తక్కువ సమయంలోనే 60 సెకన్ల ఆడియోను సృష్టించగల వేగం దీని సొంతం. కంటెంట్ క్రియేటర్లకు, కస్టమర్ సర్వీస్ విభాగాలకు ఇది ఎంతో కీలకం కానుంది. మూడవది MAI Image2 ఇమేజ్ జనరేషన్. ఇది టెక్స్ట్ ఆదేశాల ద్వారా అత్యున్నత నాణ్యత కలిగిన చిత్రాలను రూపొందించడానికి ఈ మోడల్‌ను తీర్చిదిద్దారు. ఇప్పటివరకు ఓపెన్‌ఏఐ భాగస్వామ్యంపై ఎక్కువగా ఆధారపడిన మైక్రోసాఫ్ట్, ఇప్పుడు సొంతంగా మోడల్స్‌ను అభివృద్ధి చేయడం ద్వారా ఏఐ మార్కెట్లో స్వయం సమృద్ధి సాధించాలనే తన పంథాను స్పష్టం చేసింది. ఈ కొత్త మోడల్స్ ఎంటర్‌ప్రైజ్ కస్టమర్లకు, డెవలపర్లకు వాణిజ్యపరంగా మరిన్ని ప్రయోజనాలను చేకూర్చనున్నాయి. తక్కువ ఖర్చుతో కూడిన వేగవంతమైన ఏఐ సేవలు అందించడమే లక్ష్యంగా మైక్రోసాఫ్ట్ ఈ సాంకేతికతను అందుబాటులోకి తెచ్చింది.




## యాక్సిస్ బ్యాంక్ కస్టమర్లకు
## గుడ్ న్యూస్

### ఇంట్లోనే మొబైల్ నంబర్ మార్చుకోండి!

ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ తమ ఖాతాదారుల కోసం సరికొత్త డిజిటల్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇకపై రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ మార్చుకోవడానికి బ్యాంక్ బ్రాంచ్‌లకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, 'ఆధార్ ఫేస్ అథెంటికేషన్' ద్వారా నిమిషాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. దేశంలోనే మొదటిసారిగా యూఐడీఏఐ (UIDAI) సహకారంతో మొబైల్ యాప్‌లోనే 'ఫేస్ రీడింగ్' సదుపాయాన్ని ప్రవేశపెట్టిన తొలి భారతీయ బ్యాంక్‌గా యాక్సిస్ బ్యాంక్ నిలిచింది. ఆధార్ డేటాబేస్‌లో ఉన్న ఫోటోతో కస్టమర్ ముఖాన్ని లైవ్‌లో పోల్చి చూడటం ద్వారా ఈ విధానం అత్యంత పటిష్టంగా పని చేస్తుంది. దీనివల్ల మోసాలకు తావుండదు. ఇంటర్నెట్ సదుపాయం ఉంటే చాలు, ప్రపంచంలో ఎక్కడి నుంచైనా కస్టమర్లు తమంతట తామే రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌ను అప్‌డేట్ చేసుకోవచ్చు. డిజిటల్ మోసాలను అరికట్టేందుకు, నంబర్ అప్‌డేట్ చేసిన మొదటి 24 గంటల పాటు మొబైల్ బ్యాంకింగ్ లావాదేవీలపై కొన్ని పరిమితులు ఉంటాయి. ఆ తర్వాత యథావిధిగా లావాదేవీలు నిర్వహించుకోవచ్చు. "కస్టమర్లకు తమ ఖాతాపై పూర్తి నియంత్రణ ఇస్తూ, సురక్షితమైన డిజిటల్ అనుభవాన్ని అందించడమే మా లక్ష్యం" అని బ్యాంక్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ సమీర్ శెట్టి తెలిపారు. టెక్నాలజీ సాయంతో కస్టమర్ల శ్రమను తగ్గిస్తూ బ్యాంక్ తీసుకున్న ఈ నిర్ణయంపై వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 'డెకాయిట్' సెన్సార్ పూర్తి



ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్లతో అలరిస్తున్న అడివి శేష్ ఏప్రిల్ 10న థియేటర్లలోకి రాబోతున్న పాన్ఇండియా యాక్షన్‌రొమాంటిక్ థ్రిల్లర్ 'డెకాయిట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంతో షానియల్ డియో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. శేష్ సరసన మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటించారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రంలో శేష్ తొలిసారిగా మాస్, రగ్గడ్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషన్స్ ఫుల్ స్వింగ్‌లో కొనసాగుతున్నాయి. పోస్టర్లు, గ్లింప్స్, టీజర్, అలాగే 'రుబారు' చిచ్చుబుడ్డి పాటలు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన పొందుతూ సినిమాపై భారీ అంచనాలు నెలకొల్పాయి. ట్రూ బైలింగ్వల్ ప్రాజెక్ట్‌గా తెలుగు, హిందీ భాషల్లో ఒకేసారి రూపొందుతున్న ఈ చిత్రం తాజాగా రెండు భాషల్లో సెన్సార్ పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డ్ ఈ చిత్రానికి యూ/ ఏ సర్టిఫికేట్ ఇచ్చింది. సినిమా అద్భుతంగా వుందని సెన్సార్ సభ్యులు మూవీ టీంని అభినందించారు. అడివి శేష్ 'డెకాయిట్' తో డబుల్ హ్యాట్రిక్ కొట్టబోతున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో ఈ చిత్రాన్ని సుప్రియ యార్లగడ్డ నిర్మించగా, సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రానికి భీమ్స్ బ్లాక్ బస్టర్ అల్బమ్ అందించారు. ధనుష్ భాస్కర్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. జ్ఞాని నేపథ్య సంగీతం సమకూర్చారు.



## ఆది 'సైరాబాను' ప్రారంభం

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

'శంబాల' చిత్రంతో తన కెరీర్‌లోనే బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌ను అందుకున్న హీరో ఆది సాయి కుమార్, ఇప్పుడు స్ట్రాంగ్ కమర్షియల్, కాన్సెప్ట్ బేస్డ్ చిత్రాల వైపు దృష్టి పెడుతున్నారు. ఫణి కృష్ణ సిరికి దర్శకత్వంలో తెరకెక్కనున్న తన నెక్స్ట్ ప్రాజెక్ట్ ను ఆయన ఈరోజు అధికారికంగా ప్రకటించారు. 'కెర్యాంప్' సంచలన విజయంతో దూసుకుపోతున్న సక్సెస్ ఫుల్ నిర్మాత రాజేష్ దండా, హాస్య మూవీస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కృష్ణకాంత్ పరుచూరి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో ఆది సాయి కుమార్ సరసన బంధవి శ్రీధర్ కథానాయికగా నటిస్తున్నారు. 'సైరాబాను' అనే ఆసక్తికరమైన టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని, ఆకట్టుకునే పోస్టర్ ద్వారా ఆవిష్కరించారు. ఈ పోస్టర్ డిజైన్ ఉత్సాహభరితమైన రొమాంటిక్ వాతావరణాన్ని ప్రజెంట్ చేస్తోంది. సాఫ్ట్ పాస్టెల్ రంగులతో అద్దిన ఒక హార్ట్ షేప్ గులాబీ మేఘం, పోస్టర్ పైభాగంలో తేలుతున్నట్లుగా ఉంది. పోస్టర్‌లో నీటితో తడిసిన చార్మినార్, ప్రశాంతమైన వైజాగ్ బీచ్ రోడ్, రాజమండ్రి గోదావరి వంతెన, ఇవన్నీ బ్యాక్ డ్రాప్ లో వుండటం మరింత ఆసక్తిని పెంచుతోంది. నిర్మలమైన, ప్రశాంతమైన ఆకాశం, చెల్లాచెదురుగా ఉన్న మేఘాలు ఈ విజువల్‌కు మరింత అందాన్ని జోడించాయి.



## మెగా సుప్రీమ్ హీరో సాయి తేజ్ కొత్త చిత్రం

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

మెగా సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ కొత్త చిత్రం ఊహకు అందని స్థాయిలో రూపొందుతోంది. గ్రాండ్ స్కేల్ లో తెరకెక్కనున్న ఈ చిత్రం అనౌన్స్మెంట్ సినీ ప్రియుల్లో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. సాయి దుర్గ తేజ్ కెరీర్‌లో ఒక పవర్ ఫుల్ ఫేజ్ కి నాంది పలుకుతోంది. విభిన్నమైన కథలతో ముందుకు సాగుతున్న ఆయన 'యుగాలుగా బయటకు రాని రహస్యాలు, ఊహకు అందని శక్తులు' చుట్టూ తిరిగే ప్రపంచంలోకి అడుగుపెడుతున్నట్టు ఫస్ట్ పోస్టర్ సూచిస్తోంది. దర్శక ద్వయం సుజిత్ సందీప్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. వీరు 'క' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ చిత్రంతో వీరి విజన్ మరింత విస్తరించబోతోందని స్పష్టంగా కనిపిస్తోంది. మిథిక్ సైఫై నేపథ్యంలో హైఆక్టేన్ కథనాన్ని మిళితం చేస్తూ, గొప్ప సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించడానికి సిద్ధమవుతున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్ ను సాహు గారపాటి తన షైన్ స్క్రీన్స్ బ్యానర్‌లో నిర్మిస్తున్నారు. వరుస విజయాలతో దూసుకుపోతున్న ఈ నిర్మాణ సంస్థ, మరోసారి ఒక డిఫరెంట్, అంబిషస్ కాన్సెప్ట్ తో ముందుకు వస్తోంది. పోస్టర్‌లో ఒక యోధుడు విస్తారమైన ఆకాశ గోళాల ముందు నిలబడి ఉండటం, కథ స్కేల్, విజువల్ గ్రాండ్యూర్, విజన్ చూపిస్తోంది. బలమైన క్రియేటివ్ విజన్, పవర్ ఫుల్ పెర్ఫార్మెన్స్, సక్సెస్ ఫుల్ నిర్మాణ సంస్థ.. అన్నీ కలిసిన ఈ చిత్రం, బిగ్ కాన్వాస్ పై గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతుంది. ఈ సినిమా సినీ ప్రియుల్లో ఆసక్తిని మరింత పెంచుతూ ఒక గ్రాండ్ స్పెక్టకిల్‌గా నిలవనుంది.



## 'బైకర్' మూవీ రివ్యూ.. ఎమోషనల్ రైడ్!

టాలీవుడ్ లో విభిన్న కథలతో ప్రేక్షకులను అలరించే శర్వానంద్.. ఈసారి 'బైకర్' అనే స్పోర్ట్స్ డ్రామాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. అభిలాష్ రెడ్డి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సీనియర్ హీరో డా. రాజశేఖర్ కీలక పాత్ర పోషించారు. మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటించింది. ప్రభాస్ సన్నిహితులు ప్రమోద్ ఉప్పలపాటి, విక్రమ్ కృష్ణా రెడ్డి నిర్మాతలుగా ఈ సినిమాని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించారు. ఇండియాలోనే మొట్టమొదటి మోటోక్రాస్ మూవీగా, తెలుగులో మొట్టమొదటి డాల్బీ విజన్ సినిమాగా ఈ 'బైకర్'ని ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. మరి ఈ సినిమా ఎలా ఉంది? ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంది? అనేది చూద్దాం...

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

కథలోకి.. విక్కీ అలియాస్ విక్రమ్ నారాయణ్ (శర్వానంద్), తన భార్య అనన్య (మాళవిక నాయర్), తన కొడుకుతో కలిసి ఒక సింపుల్ లైఫ్ గడుపుతూ ఉంటాడు. తాను గోకార్టింగ్ రేస్ ట్రాక్ నిర్వహిస్తూ ఉంటే, భార్య అతనికి చేదోడు వాదోడుగా ఒక బోటిక్ నిర్వహిస్తూ ఉంటుంది. సరదాగా సాగిపోతున్న వీరి జీవితంలోకి, విక్రమ్ తండ్రి సునీల్ నారాయణ (రాజశేఖర్) మీద అవినీతి ఆరోపణలు రావడంతో ఒక్కసారిగా ఒక పెద్ద కుదుపు వస్తుంది. తాను తన తండ్రికి అండగా నిలబడాలంటూ విక్కీ తన భార్యకు చెప్పి, తన తండ్రి దగ్గరకు బయలుదేరుతాడు. అయితే అప్పటివరకు తన తండ్రి నుంచి విక్కీ ఎందుకు దూరంగా ఉన్నాడు? 'బైకర్'గా పేరుగాంచిన విక్కీ, ఎందుకు ఆ బైక్ రేసింగ్ వదిలేసి తండ్రికి దూరంగా వచ్చేసాడు? చివరికి తన తండ్రి మీద పడ్డ అవినీతి మరకలకు విక్కీ ఎలాంటి సమాధానం ఇచ్చాడు? అసలు విక్కీ రేసింగ్ ఎందుకు వదిలేశాడు? అనన్యతో అతనికి ఉన్న సంబంధం ఏంటి? విక్కీ జీవితంలో ఆమె పాత్ర ఏమిటి? రేసింగ్ మానేశాక విక్కీ జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది? అనేదే ఈ సినిమా కథ.

**విశ్లేషణ :** టాలీవుడ్‌లో ఇప్పటివరకు ఎన్నో స్పోర్ట్స్ డ్రామాలు వచ్చినా.. మోటోక్రాస్ రేసింగ్ అనే పాయింట్‌ను ఎవరూ టచ్ చేయలేదు. ఈ కొత్త నేపథ్యమే 'బైకర్' సినిమాకు ప్రధాన బలం. కథలో కొన్ని అంశాలు రొటీన్‌గా అనిపించినా.. తెలుగు తెరకు కొత్తదైన ఈ స్పోర్ట్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. రేసింగ్ సన్నివేశాలను చిత్రీకరించిన విధానం, యాక్షన్ కొరియోగ్రఫీ అద్భుతంగా ఉన్నాయి. మన దగ్గర పెద్దగా పరిచయం లేని ఆటను, ఎమోషన్స్ తో ముడిపెట్టి సామాన్య ప్రేక్షకుడికి కనెక్ట్ చేయడంలో దర్శకుడు సక్సెస్ అయ్యాడు. సాధారణంగా తెలుగు వెండితెరపై స్పోర్ట్స్ డ్రామాలు అంటే క్రికెట్ లేదా కబడ్డీ వంటి కథలే ఎక్కువగా కనిపిస్తాయి. కానీ, దానికి భిన్నంగా బైక్ రేసింగ్ అనే సరికొత్త బ్యాక్‌డ్రాప్‌ను ఎంచుకుని ఈ 'బైకర్'ను రూపొందించారు. నిజానికి ఏ స్పోర్ట్స్ సినిమాకైనా ఒకే ఫార్ములా ఉంటుంది హీరో మొదట ఓడిపోవడం, అవమానాలు ఎదుర్కోవడం, చివరకు పట్టుదలతో విజయం సాధించడం. 'బైకర్' కూడా అదే బాటలో సాగుతుంది. అయితే, ఇక్కడ రేసింగ్ ట్రాక్‌పై సాగే ఉత్కంఠభరితమైన విన్యాసాలు ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. బైక్ రేసింగ్ అనేది తెలుగు ప్రేక్షకులకు కనెక్టివిటీ విషయంలో కొంత ఇబ్బంది అనిపించవచ్చు కానీ, స్పోర్ట్స్ డ్రామాలు ఇష్టపడే వారికి మాత్రం ఇది భలే నచ్చేస్తుంది. ఒక పక్క గతాన్ని, మరోపక్క ప్రస్తుతాన్ని చూపిస్తూ నాన్‌లీనియర్ స్క్రీన్ ప్లేతో దర్శకుడు తాను చెప్పాలనుకున్న విషయాన్ని చెప్పే ప్రయత్నం చేసి, చాలా వరకు సక్సెస్ అయ్యాడు. ఫస్ట్ హాఫ్ విక్కీ ప్రశాంతమైన జీవితాన్ని చూపిస్తూనే, తన తండ్రికి ఎందుకు దూరమయ్యాడు అనే విషయాన్ని ఎస్టాబ్లిష్ చేశాడు. సెకండ్ హాఫ్‌లో విక్కీ తన తండ్రి కోసం ఎలా నిలబడ్డాడు అనే విషయాన్ని చూపిస్తూనే, తండ్రికి మాట రానివ్వకుండా కొడుకులు ఎంత దూరానికైనా వెళ్తారనే విషయాన్ని ఆసక్తికరంగా చూపించాడు. తండ్రిని ప్రేమించే కొడుకులకు, కొడుకులను ప్రేమించే తండ్రులకు ఒక ట్రిబ్యూట్ లాగా ఈ సినిమాని దర్శకుడు రాసుకున్నాడు. ఒకపక్క రేసింగ్ ఎపిసోడ్స్ ఎంత రేసీగా చిత్రీకరించాడో, మరోపక్క ఎమోషనల్ ఎపిసోడ్స్ కూడా అంతే బలంగా రాసుకున్నాడు. డైలాగ్స్ కూడా గుండెల్ని పిండేలా కాకుండా, ఆలోచింపజేసేలా రాసుకోవడంలో డైరెక్టర్ సక్సెస్ అయ్యాడు. కథలోని కీలక మలుపుల దగ్గర దర్శకుడు సేఫ్ గేమ్ ఆడాడు. కొత్తదనం కోసం ప్రయత్నించకుండా రొటీన్ ఫార్మాట్‌ను ఎంచుకోవడం కాస్త నిరాశపరుస్తుంది. ముఖ్యంగా రేసింగ్ సమయంలో హీరో పడే మానసిక సంఘర్షణను ఇంకాస్త బలంగా చూపించి ఉంటే సినిమా స్థాయి మరోలా ఉండేది. హీరోకు ఎదురయ్యే సవాళ్లు, స్పాన్సర్‌షిప్ ఎపిసోడ్స్ చాలా సింపుల్‌గా, ఎలాంటి కష్టం లేకుండా పరిష్కారం కావడం వల్ల కథలో వాస్తవికత లోపించినట్లు అనిపిస్తుంది. రేసింగ్ సన్నివేశాలు అద్భుతంగా ఉన్నప్పటికీ, ఆ రేస్‌కు దారితీసే పరిస్థితులను ఇంకాస్త ఎఫెక్టివ్‌గా రాసుకోవాల్సింది. హీరో హీరోయిన్ల మధ్య వచ్చే కాన్ఫ్లిక్ట్ పాయింట్ బాగున్నా.. దాన్ని పూర్తిగా వాడుకోలేకపోయారు. ఫస్టాఫ్ స్క్రీన్‌ప్లే కాస్త నెమ్మదిగా సాగుతుంది, కొన్ని చోట్ల బోర్ కొట్టిస్తుంది. ఎవరెలా చేశారంటే... శర్వానంద్ లుక్ చాలా ఫిట్‌గా ఉంది. ఒక ప్రొఫెషనల్ రేసర్‌గా తన నటనతో పూర్తి న్యాయం చేశాడు. ఎమోషనల్ సీన్స్ లో కూడా తన మార్క్ చూపించాడు. ఈ సినిమా కోసం హీరో శర్వానంద్ పడ్డ కష్టం అడుగడుగునా కనిపిస్తుంది. ఒక ప్రొఫెషనల్ బైకర్‌లా కనిపించడం కోసం ఆయన సుమారు 23 కేజీల బరువు తగ్గి, తన బాడీ లాంగ్వేజ్‌ను పూర్తిగా మార్చుకున్నారు. నటన పరంగా కూడా శర్వా తన పాత్రకు వంద శాతం న్యాయం చేశారు. ముఖ్యంగా డా. రాజశేఖర్‌తో వచ్చే సన్నివేశాలు చాలా బాగా పండాయి. ఈ చిత్రంతో యాంగ్రీ మ్యాన్ రాజశేఖర్ తన కెరీర్‌లో మరో మెట్టు ఎక్కారని చెప్పొచ్చు.

**సాంకేతిక విభాగం:** దర్శకుడు అభిలాష్ రెడ్డి రేసింగ్ నేపథ్యాన్ని ఎంచుకుని కొత్తదనం చూపించే ప్రయత్నం చేశారు. తెలుగు సినిమాకు ఇది కొత్త పాయింట్ కావడంతో ప్రేక్షకులకు ఆసక్తి కలిగేలా చేయడంలో సక్సెస్ అయ్యారు. ఒక రకంగా చెప్పాలంటే ఇది టెక్నికల్‌గా తెలుగు ఫిలిం ఇండస్ట్రీ గర్వంగా చెప్పుకునే సినిమాల్లో ఒకటి. ఇలాంటి రేసింగ్ ఎపిసోడ్స్ చిత్రీకరించిన సినిమాటోగ్రాఫర్ జె. యువరాజ్ కు హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే. రేసింగ్ సీన్స్‌ను అత్యద్భుతంగా కెమెరాలో బంధించారు. విజువల్స్ గ్రాండ్‌గా ఉన్నాయి. థ్రిల్లింగ్ సీన్స్ లో జిబ్రాన్ అందించిన నేపథ్య సంగీతం ప్రాణం పోసింది. సౌండ్ డిజైన్ వర్క్ చాలా బాగుంది. అలానే సినిమాని నెక్స్ట్ లెవెల్‌కి తీసుకువెళ్ళిన మ్యూజిక్ డైరెక్టర్, ముఖ్యంగా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ విషయంలో మాత్రం ఖచ్చితంగా అభినందించి తీరాలి. సినిమా విషయంలో ఏమాత్రం వెనుకాడకుండా ఖర్చుపెట్టిన యు.వి. క్రియేషన్స్ ప్రతి రూపాయి స్క్రీన్ మీద కనిపించింది. ముఖ్యంగా అలాంటి లొకేషన్స్ కి వెళ్లి షూట్ చేసుకువచ్చిన సినిమా టీం మొత్తాన్ని అభినందించాల్సిందే. రొటీన్ కథలు ఎవరైనా చేస్తారు, కానీ ఊపిరి బిగబట్టుకుని చూసేలా రేసింగ్ ఎపిసోడ్స్ చిత్రీకరించిన టీం మొత్తం ఖచ్చితంగా 'లయన్ హార్ట్స్' అనే చెప్పాలి. మొత్తం మీద 'బైకర్' ఒక ఎంగేజింగ్ స్పోర్ట్స్ డ్రామా. ఇప్పటివరకు టచ్ చేయని మోటోక్రాస్ రేసింగ్ బ్యాక్‌డ్రాప్‌తో పాటు, శర్వానంద్, డా. రాజశేఖర్‌ల అద్భుతమైన నటన సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయి. రేసింగ్ సన్నివేశాలు కూడా థ్రిల్ చేస్తాయి. **(3.25/5)**

**-ఎం.డి అబ్దుల్**



## 'రాకాస' మూవీ రివ్యూ... హారర్ డ్రామా!

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాణంలో కొత్త దర్శకురాలు మానస శర్మ తెరకెక్కించిన లేటెస్ట్ హారర్ కామెడీ సినిమానే 'రాకాస'. టీజర్, ట్రైలర్ లతో మంచి బజ్ ని రేకెత్తించిన ఈ సినిమా ఎలా ఉందో తెలుసుకుందాం...

**కథ:** ఎన్నోఏళ్ల క్రితం రాకవర అనే గ్రామం శాపానికి గురైన కారణంగా తరతరాలుగా ఆ ఊరిలో ఉన్న ఒక కోటలోని బ్రహ్మ రాక్షసుడికి కొన్ని సంకేతాలు రీత్యా, ఒక ప్రాణాన్ని బలిగా పంపుతూ వస్తారు. అలా కాలం ఇప్పుడు 2026 వరకు వస్తుంది. ఈ మోడ్రన్ యుగంలో యూఎస్ నుంచి అప్పుడే తన ఊరిలోకి వచ్చిన వీరబాబు (సంగీత్ శోభన్) ఈ బలి ఉచ్చులో ఎలా ఇరుక్కున్నాడు? ఎవరి వల్ల ఇరుక్కున్నాడు? ఆ కోటలోకి తను వెళ్లిన తర్వాత ఏమైంది? బలి పంపకపోతే ఆ బ్రహ్మ రాక్షసుడు వల్ల ఊరికి ఏమవుతుంది? అసలా రాక్షసుడు ఎలా వచ్చాడు? అతన్ని ఆపే మార్గం ఏంటి? చివరికి ఈ సమస్య ఎలా పరిష్కారం అయ్యింది? వీరబాబు బయటకి వచ్చాడా లేదా అనేవి తెలియాలి అంటే సినిమా చూడాలి.

**విశ్లేషణ:** ఈ సినిమాకి నిర్మాణ విలువలు, కామెడీ, హారర్ ఎలిమెంట్స్ తో పాటుగా ఫాంటసీ టచ్ లాంటివి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కొన్ని లాజికల్ అంశాలు పక్కన పెడితే ముఖ్యంగా సెకండాఫ్ లో కథనం దర్శకురాలు బాగా డిజైన్ చేసుకున్నారు. థ్రిల్ మూడ్ లో కూడా మంచి ఫన్ ని జెనరేట్ చేస్తూ సాలిడ్ ఫన్ ని సెకండాఫ్ లో మైంటైన్ చేస్తూ వెళ్లడం ఇందులో ఇంప్రెస్ చేస్తుంది. అలాగే ఒకటీ రెండు ట్విస్ట్ లు కూడా బాగా ప్లాన్ చేసుకున్నారు. ఇది ఫాంటసీ టచ్ ఉన్న సబ్జెక్ట్ అయినప్పటికీ కొన్ని అంశాలు మాత్రం మరీ లాజిక్ కి దూరంగా ఉంటాయి. ముఖ్యంగా బ్రహ్మ రాక్షసుడు లాంటి వాడికి కూడా ఎమోషనల్ యాంగిల్ ట్రై చేయడం ఒకింత కొత్త స్టెప్ అయినప్పటికీ ఇది అందరికీ కనెక్ట్ అవుతుంది అని చెప్పలేం. అలాగే సంగీత్ రోల్ పై చివరి నిమిషంలో చూపించే ట్విస్ట్ లో నాచురలిటీ అంతగా అనిపించదు. ఇంకా ఫస్టాఫ్ కథనం కూడా సోసో గానే అలా వెళుతుంది. ఇంకా సెకండాఫ్ లో కొన్ని లాజిక్స్ అయితే మర్చిపోవాలి. సంగీత్ అండ్ గ్యాంగ్ అంత సేపు కోటలో ఉండి అన్నీ చేస్తూ ఉంటారు కానీ బ్రహ్మ రాక్షసుడు మాత్రం మొదట అలా పలకరించి మళ్లీ చివరిలోనే వస్తాడు.

**సాంకేతిక వర్గం:** ఈ సినిమాలో నిర్మాణ విలువలు మాత్రం సాలిడ్ గా ఉన్నాయి. నిహారిక కొణిదెల నుంచి ఇది మరో సాలిడ్ ప్రాజెక్ట్. అనుదీప్ సంగీతం డీసెంట్ గా ఉంది. ఎదురోలు రాజు కెమెరా వర్క్ బాగుంది. అన్వర్ అలీ ఎడిటింగ్ కూడా ఓకే దర్శకురాలు మానస శర్మ విషయానికి వస్తే.. ఆమె డీసెంట్ డెబ్యూ ప్లాన్ చేసుకున్నారు. ఇంట్రెస్టింగ్ లైన్ తీసుకున్నారు. అయితే ఇందులో కామెడీ ఇంకా హారర్ థ్రిల్ సీన్స్ ని బాగా ప్లాన్ చేసుకున్నారు. ఫస్టాఫ్ ట్రాక్ కొంచెం రొటీన్ గా నడిపించినట్టు అనిపిస్తుంది కానీ సెకండాఫ్ లో మాత్రం ఆమె పోటెన్షియల్ కనిపిస్తుంది. ఓవరాల్ గా ఆమె వర్క్ బాగుంది. మొత్తంగా చూసుకుంటే ఇదో డీసెంట్ ఫన్ ఫాంటసీ ఎలిమెంట్స్ తో కూడిన హారర్ డ్రామా అని చెప్పొచ్చు.

**(2.75/5)**

## ఆ సినిమాలపైనే పూర్తి ఫోకస్!



ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

సిద్ధార్థ్ మల్హోత్రాతో వివాహం, ఆపై తల్లిగా మారిన తర్వాత బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కియారా అద్వానీ ప్రపంచమే మారిపోయిందట. ప్రస్తుతం సినిమాలతో పాటు తన వ్యక్తిగత జీవితాన్ని ఎంతో అద్భుతంగా గడుపుతోంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో కియారా మాట్లాడుతూ.. 'అమ్మనయ్యాక జీవితం పట్ల నా కోణం పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు నేను ఒక ఆడపులిలా తయారయ్యాను. నా బిడ్డను కాపాడుకోవాలనే తపనతో నాలో తెలియని ధైర్యం, శక్తి పెరిగాయి' అంటూ చాలా భావోద్వేగంగా చెప్పుకొచ్చారు. ఈ మాటలు విన్న నెటిజన్లు, ముఖ్యంగా తల్లులు.. కియారాలోని మాతృత్వపు ఆరాటాన్ని చూసి ఫిదా అవుతున్నారు. అలాగే.. పెళ్లి తర్వాత కూడా తన భర్త సిద్ధార్థ్ తో బంధం ఏమాత్రం మారలేదని, మునుపటిలాగే సరదాగా ట్రావెల్ చేస్తూ, సినిమాలు చూస్తూ ఎంజాయ్ చేస్తున్నామని ఆమె తెలిపారు. ఇక సినిమాల విషయానికి వస్తే.. రామ్ చరణ్‌తో చేసిన 'గేమ్ ఛేంజర్' తర్వాత కియారా ఇప్పుడు కన్నడ స్టార్ యశ్ నటిస్తున్న భారీ పీరియడ్ గ్యాంగ్‌స్టర్ డ్రామా 'టాక్సిక్'పై పూర్తి ఫోకస్ పెట్టారు. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఆమె 'నాడియా' అనే ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించబోతోంది. నయనతార, హుమా ఖురేషి వంటి స్టార్స్ నటిస్తున్న ఈ సినిమా అంతర్జాతీయ కారణాల వల్ల జూన్ 4, 2026కి వాయిదా పడింది.

## 29న బెల్లంకొండ సాయి శ్రీనివాస్ వివాహం



ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, కావ్య రెడ్డి రోకా వేడుక గత నెలలో అంగరంగ వైభవవంగా జరిగింది. సంప్రదాయం, వేడుక, కుటుంబ ఆత్మీయతల కలయికతో జరిగిన ఈ వేడుక, వారి వివాహ ప్రయాణానికి ఒక పరిపూర్ణమైన ఆరంభాన్ని ఇచ్చింది. వివాహానికి ముందు జరిగే వేడుకలు అధికారికంగా ప్రారంభం కాగా, నిశ్చితార్థం ఏప్రిల్ 5న జరగనుంది. విశాలమైన ఫామ్‌హౌస్‌లో జరగనున్న ఈ కార్యక్రమం వైభవం, ఆత్మీయతల కలయికగా ఉంటుంది. ఈ వేడుకలో సినీ పరిశ్రమ మిత్రులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు పాల్గొననున్నారు. వీరి వివాహ వేడుక ఏప్రిల్ 29న, దివ్యమైన తిరుమల ప్రాంగణంలో జరగనుంది. అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ఈ ప్రదేశం చిరస్మరణీయమైన కలయికకు సరైన వేదికగా నిలుస్తుంది.

Printed and Published By SHAIK MASTAN on behalf of AARAA DIGITAL NEWS NETWORKS, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: SHAIK MASTAN, Phone No. 040 - 24099999, PRGI REG. No. : TGTEL/25/A0540